


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




సోమవారం | 16-3-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 331 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 3.00 తదుపరి నవమి; నక్షత్రం: జ్యేష్ఠ ఉ. 11.13 తదుపరి మూల; వర్జ్యం: ఉ. 9.37-11.13, రా. 7.24-9.02; దుర్ముహూర్తం: మ. 12.48-1.36, మ. 3.11-3.59; అమృతఘడియలు: తె. 5.13 మొదలు; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.22 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

## సీఎం X ఎస్ఈసీ

# వాయిదాపై వార్

## స్థానిక సమరం ఆపడంపై సీఎం జగన్ ఫైర్


పగ్గాలు చేపట్టిన 10 నెలల తర్వాత తొలిసారి ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న సీఎం జగన్

### స్థానిక ఎన్నికలు

# 6 వారాలు వాయిదా

## కరోనా విజృంభణ వల్లే!

**అప్పటి వరకు కోడ్ అమల్లోనే.. ప్రలోభపెట్టే పథకాలపై నిషేధం**

**ప్రభుత్వ దైనందిన విధులకు ఇబ్బంది ఉండదు**

**ఇది వాయిదానే.. రద్దు కాదు.. ఆరు వారాల తర్వాత సమీక్షిస్తాం**

**అనంతరం ప్రక్రియ కొనసాగింపు.. జాతీయ విపత్తుగా కరోనా**

**కేంద్రం ప్రకటించింది.. ప్రజల భద్రతను పణంగా పెట్టలేం**

**ఏకగ్రీవంగా ఎన్నికైనవారు ఎన్నికైనట్లే.. పంచాయతీలకు కొత్త షెడ్యూల్.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంచలన నిర్ణయం**

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఆరు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఆదివారమిక్కడ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశాం. నామినేషన్లు కూడా

మిగతా 11వ పేజీలో...

**ఎన్నికల వాయిదా, కలెక్టర్లు, ఎస్పీల బదిలీపై కస్సుమన్న ముఖ్యమంత్రి**

**ఎస్ఈసీ రమేశ్‌ది బాబు కులమని ధ్వజం**

**కరోనాకు పారాసిటమల్ చాలని ప్రకటన**

**వారంలో కొంపలు మునిగిపోవని గుస్సా**

**అధికారుల బదిలీ అధికారం ఎవరిదంటూ నిలదీత**

**ఎస్ఈసీపై గవర్నర్‌కు ఫిర్యాదు**

**సీఎంగా తొలిసారి మీడియా ముందుకు**

**ప్రశ్నలకు తావివ్వకుండా ముగింపు**

11

## మాకు హైకోర్టు జడ్జి అధికారాలు

ఎన్నికలు రద్దు చేయలేదు

నిలుపుదల మాత్రమే చేశాం

సీఎం వ్యాఖ్యలపై ఎస్ఈసీ స్పందన

## అధికారం నీదా.. నాదా?

### సీఎం నేనా.. రమేశ్‌కుమారా?

ప్రజలు ఓట్లేసి మాకు 151 సీట్లిచ్చారు

నాకే అధికారం లేదంటే ఎన్నికలెందుకు?

ఎస్ఈసీయే పాలించొచ్చు కదా!

ఇంటి స్థలాలు పంపిణీ చేయొద్దంటారా?

సీఎం కంటే ఆయనకు ఎక్కువ అధికారాలా?

వైసీపీ స్వీప్ చేస్తుందని భయం: సీఎం



## సీఎస్‌కు సంకటం!

**ఎస్ఈసీ ఆదేశాలు అమలు చేయాలా? వద్దా?**

**చేస్తే సీఎంకి కోపం.. చేయకపోతే కోర్టు భయం**

2

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌పై బాగా కోపమొచ్చింది. అది... ఒక ముఖ్యమైన సమావేశం నుంచి మధ్యలోనే వెళ్లిపోయేంత కోపం! ఆగమేఘాలపైన గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసేంత కోపం! పదవి చేపట్టి పది నెలలైనా ఒక్కసారి కూడా తెలుగు మీడియాతో మాట్లాడని ఆయన... అప్పటికప్పుడు విలేకరుల సమావేశం పెట్టి ఆక్రోశం వెళ్లగక్కేంత కోపం!**

**ఈ కోపం ఎందుకంటే...**

**శనివారం** సాయంత్రం దాకా 'ఉందా... లేదా' అని విపక్షం విమర్శలు ఎదుర్కొన్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఉన్నట్టుండి కొరడా ఝుళిపించింది. అధికారపక్షం దౌర్జన్యాలు, బెదిరింపులు, ఉపసంహరణ గడువు ముగిశాక కూడా విత్‌డ్రాలు జరిగినా కిమ్మనని ఎస్ఈసీకి హఠాత్తుగా తన 'విచక్షణాధికారం' గుర్తుకొచ్చింది. చైనాని వణికించి, ప్రపంచాన్ని కుదిపేస్తున్న కరోనా వైరస్ ఇప్పుడు భారత్‌నూ భయపెడుతున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికల ప్రక్రియను ఆరు వారాలు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఆదివారం ఉదయం ప్రకటించారు. ఈ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరమేమిటో వివరించారు. అంతే... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విపరీతమైన కోపమొచ్చింది. విపక్షాల ఫిర్యాదులపై కిమ్మనడం లేదని, అధికార పార్టీకి సహకరిస్తున్నారని విమర్శలు ఎదుర్కొంటున్న ఎస్ఈసీ కులమేమిటో.... జగన్‌కు 'వాయిదా' వెంటనే గుర్తుకొచ్చింది. స్థానిక ఎన్నికల్లో తాము ఊడ్చేస్తున్నామని, దీనిని తట్టుకోలేక చంద్రబాబు సామాజిక వర్గం కావడంవల్లే ఎస్ఈసీ రమేశ్ కుమార్ స్థానిక

మిగతా 11వ పేజీలో...

## చిత్తూరు, గుంటూరు కలెక్టర్లు, ఎస్పీలపై

# వేటు!

**ఆ నలుగురినీ తప్పించండి**

**మాచర్ల సీఐని సస్పెండ్ చేయండి**

**పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, రాయదుర్గం, తాడిపత్రి సీఐల బదిలీ**

**ప్రభుత్వానికి ఎస్ఈసీ ఆదేశం**

**నామినేషన్లను అడ్డుకోవడం దారుణం**

**యంత్రాంగం ఉదాసీనత బాధాకరం**

**మహిళా అభ్యర్థులు, బలహీనవర్గాలపై దాడులు శోచనీయం**

**వీటితో ఎన్నికల ప్రక్రియ అపహాస్యం**

**తిరుపతి, మాచర్ల, పుంగనూరు ఎన్నికలపై నిశిత పరిశీలన**

**అవసరమైతే కొత్త షెడ్యూల్‌కు వెనుకాడం**

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టీకరణ**

2








కరోనా భయానికి ఖాళీగా ఉన్న తిరుమల ఆలయ ప్రాంగణం

# ఆగని కల్లోలం

### కరోనా దెబ్బతో ఆలయాలు వెలవెల

**తిరుమలకు తగ్గిన భక్తుల రద్దీ**

**రేపటి నుంచి టైంస్లాట్ టోకెన్లు జారీ**

**ఆరోగ్య జపయజ్ఞానికి టీటీడీ సిద్ధం**

**శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు రద్దు**

**సత్యసాయి సమాధి వద్దా నిషేధాజ్ఞలు**



10

## రాష్ట్రంలో కొత్తగా మరో 10 అనుమానిత కేసులు

విశాఖలో ఇద్దరికి కరోనా నెగిటివ్

గుంటూరులో పెరిగిన గృహనిర్బంధాలు

**దేశంలో 24 గంటల్లో 24 కొత్త కేసులు**

**ప్రపంచవ్యాప్తంగా ఒక్కరోజే 300 మంది మృతి**

9

# మొత్తంగా రద్దు చేయాలి!

**ప్రస్తుత కమిషనర్‌తో వద్దు.. కేంద్ర ఈసీ ఆధ్వర్యంలో నిర్వహించాలి**

**రాష్ట్ర పోలీసులు అన్‌ఫిట్.. సీఆర్‌పీఎఫ్‌ను రప్పించాలి**

**అన్ని పార్టీలదీ ఇదే డిమాండ్.. రాష్ట్రపతి, గవర్నర్‌లను కలుస్తాం**

**జగన్ ఆధ్వర్యంలో అరాచకాలు.. 22% సీట్లలో ఏకగ్రీవాలా?**

**కడపలో ఏకంగా 70 శాతమా?.. ప్రజాస్వామ్యం అపహాస్యం**

**ఈ సీఎం సిగ్గుపడాలి.. కరోనా గురించి ఈయనకేం తెలుసు?**

**151 సీట్లు వస్తే రాజ్యాంగం వర్తించదా?.. జగన్‌పై బాబు ఆగ్రహం**

### స్థానిక ఎన్నికలకు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలి: బాబు



10

## రమేశ్‌కుమార్... నరసింహన్ చాయిస్

**నేనైతే సీఆర్ బిశ్వాల్‌ను ప్రతిపాదించా**

**గవర్నర్ గట్టిగా సూచించడంతో అంగీకరించా: చంద్రబాబు**





పరంజ్యోతి



## మనిషిని దిద్దే మహాగ్రంథం.. భాగవతం

*ధనంజయే హాటక సంపరీక్షా*
*రణాంగణే శస్త్ర భృతాం పరీక్షా*
*విపత్తికాలే గృహిణీ పరీక్షా*
*విద్యావతాం భాగవతే పరీక్షా*

బంగారాన్ని నిప్పులో వేసి పుటం పెట్టిన తర్వాతే అది చొక్కమైన బంగారమా కాదా తెలుసుకోవచ్చు. మహాభయంకరమైన యుద్ధరంగంలోనే మహావీరుని శౌర్యపరాక్రమాలు తెలుస్తాయి. ఇళ్లల్లో సంక్షోభాలు నెలకొన్నప్పుడే సమయస్ఫూర్తితో వ్యవహరించే గృహిణి చాకచక్యం తెలుస్తుంది. అలాగే.. విద్యావంతుని విద్వత్తు భాగవత పరీక్షకు నిలిచినప్పుడే తెలుస్తుందని దీని అర్థం. ఒక విధంగా విద్యావంతుడి పరీక్షాస్థానం భాగవతమేనన్నది సారాంశం. ఈ మాట ఎందుకు ప్రచారంలోకి వచ్చిందో విచారిస్తే ఎన్నెన్నో సత్యాలు తెలుస్తాయి. భాగవత పురాణంలో భగవత్సంబంధమైన కథలు, అవతార విశేషాలు, భక్తుల కథలు ఉంటాయి. వాటి గురించి తెలుసుకోవడానికి అంత పాండిత్యం అవసరమా అన్నది ప్రశ్న. కానీ, జాగ్రత్తగా గమనిస్తే భాగవతంలోని కథలన్నింటి వెనుక గొప్ప తాత్వికత, మానవ ప్రవర్తనలో రావాల్సిన మార్పులు, జీవుల వేదనలలోని అంతస్తత్వాలు కనిపిస్తుంటాయి. అయినప్పటికీ.. చూడటానికి, వినడానికి భక్తి మార్గం బోధిస్తున్న ఐతిహ్యంలా కనిపిస్తూ, అవన్నీ చాలా సులభమైన విషయాల్లా కనిపించడమే భాగవతంలోని కథలు, విశేషాల ప్రత్యేకత.

*'భక్త్యా భాగవతం జ్ఞేయం, న వ్యుత్పత్త్యా న టీకయా'*

..అంటే భాగవత పురాణం పాండిత్యం వల్లనో, టీకా తాత్పర్యాలు చదవడం వల్లనో అర్థం కాదు. అది కేవలం భక్తి వల్ల మాత్రమే తెలియబడుతుంది. అష్టాదశ పురాణాలను, పంచమవేదాన్ని లోకానికి అందించిన వేద వ్యాస మహర్షికి కూడా ఏర్పడ్డ అసంతృప్తి, అసహనం భాగవత రచన వల్ల మటుమాయమయ్యాయి. భాగవతంలో కనిపించే గజేంద్రమోక్ష ఘట్టం, ప్రహ్లాద చరిత్ర, క్షీరసాగర మథనం, శ్రీకృష్ణభగవానుని అవతార విశేషాలు అన్నీ భక్తిని తెలియజేసేవి, అవతార విశిష్టతలను తెలిపేవే అయినా వాటి అంతరార్థం మాత్రం.. మనిషికి మంచి మార్గాన్ని దర్శింపజేయడమే. అందుకే పండితులైనవారు భాగవత ప్రచారం చెయ్యాలి. తెలుగులో భాగవతాన్ని అందించిన బమ్మెర పోతనామాత్యుడు ఈ విషయాన్నే చెబుతూ.. "భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు శూలికైన తమ్మి చూలికైన" అన్నాడు. ఆ తెలిసి పలకడమే మనిషిని ఉద్ధరించడం, మనిషికి ఆధారంగా నిలవడం, మానవలోకానికి మార్గదర్శి కావడం. అడుగడుగునా భక్తితో పాటు మనిషి ప్రవర్తనకు పెద్ద పీట వేసిన మహాభాగవతం అన్ని కాలాల్లోనూ ఆదర్శంగా నిలిచే మహాగ్రంథం.

**- గన్నమరాజు గిరిజామనోహరబాబు**



## అంగరంగ వైభవం.. బ్రహ్మరథోత్సవం

వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. భక్తుల గోవిందనామ స్మరణతో మార్మోగాయి. యువకులు పోటీపడి రథాన్ని లాగితే.. భక్తులు స్వామివారి రథంపైకి దవణం, మిరియాలు విసురుతూ తన్మయత్వం చెందారు. అనంతపురం జిల్లా కదిరిలో ఆదివారం జరిగిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవ వైభవమిది. 15 రోజులపాటు సాగిన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం జరిగింది. ఉదయం 8.15 గంటలకు ప్రారంభమైన రథోత్సవం మధ్యాహ్నం 12.48 గంటలకు ముగిసింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. **- కదిరి**

# మానవత్వం చూపండి!

## నమ్మి భూములు ఇచ్చాం.. ఇప్పుడు నట్టేట ముంచుతారా?

- అమరావతిని కొనసాగించండి
- రైతులు, మహిళల వేడుకోలు
- సుదర్శన యాగం చేసిన రైతులు
- 89వ రోజు కొనసాగిన ఆందోళనలు



తుళ్లూరు దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

గుంటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): "మా జీవితాలతో పాటు భావితరాలు బాగుంటాయని ఆశపడ్డాం. విశ్వనగరంగా అమరావతి ఏర్పడుతుందని ప్రభుత్వాన్ని నమ్మి భూములు ఇచ్చాం. నేడు నట్టేట మునిగాం. కాస్త మానవత్వంతో ఆలోచించండి. అమరావతిని రాజధానిగా కొనసాగించండి" అంటూ రైతులు, మహిళలు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. రాజధానిగా అమరావతిని కొనసాగించాలనే డిమాండ్‌తో రైతులు, కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు 89వ రోజు ఆదివారం కొనసాగాయి. రాయపూడి, వెలగపూడి, ఎర్రబాలెం, పెదపరిమి తదితర ప్రాంతాలల్లో రిలే దీక్షలు, ఆందోళనలు కొనసాగించారు. ఉద్దండ్రాయునిపాలెంలోని అమరావతికి శంకుస్థాపన చేసినప్రాంతంలో రైతులు సుదర్శన హోమం నిర్వహించారు. ఉదయం 7.25 గంటలకు మొదలైన ఈ హోమం 4 గంటలవరకు కొనసాగింది. అమరావతి దేవతల రాజధానిగా ఉందని చరిత్ర చెబుతోందని.. కానీ, జగన్ ప్రభుత్వం రాజధాని విషయంలో అరాచకంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

### పంచెల వేడుకలో 'జై అమరావతి'

మందడంలో ఆదివారం పెద్ది నరహరిసాయి పంచెల వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి 'జై అమరావతి' ప్లకార్డులు, మెడలో పచ్చ కండవాలతో గ్రామస్థులు హాజరయ్యారు. నరహరిసాయి కూడా 'జై అమరావతి' నినాదాలు చేశారు.

### ఇది.. ఆంధ్రాను కదిలించడమే!

- స్వామి కమలానంద భారతి

అమరావతిని కదిలించటం అంటే ఆంధ్రాని కదిలించటమేనని స్వామి కమలానంద భారతి అన్నారు. గుంటూరులో ఆదివారం 'అమరావతి ఆవశ్యకత' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని ముక్కలు చేయాలన్న కుట్ర సాగుతోందన్నారు. గోదావరి నీరు తెలంగాణ మీదుగా సీమకు అందిస్తామన్నప్పుడు ఈ కుట్రకు బీజం పడిందని తెలిపారు. అలానే విశాఖ రాజధాని అంటే 'జై కళింగ' ఉద్యమం పురుడుపోసుకుంటుందని చెప్పారు. హైదరాబాదులో ఆస్తులు ఉన్ననేతలు ఆంధ్రా పాలకులుగా ఉన్నంత కాలం రాష్ట్రానికి అధోగతేనని చెప్పారు. అమరావతితోనే ఆంధ్రా భవిత అని స్వామి స్పష్టం చేశారు.

### పరీక్షల కాలం!



రాయపూడి దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న చిన్నారులు

తమకు, తమ పిల్లలకు పరీక్షా కాలం నడుస్తోందంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో పిల్లలను శిబిరాలకు తీసుకొచ్చి చదివించుకున్నారు. తుళ్లూరు శిబిరంలో చిన్నారులు సీఎం ఫొటో ఉన్న వ్యక్తి వద్ద తమ భవిష్యత్తును నాశనం చేయవద్దంటూ నినాదాలు చేశారు. తణుకువాసి వట్టికూటి సత్యనారాయణ రూ.50వేలు, నరసాయిపాలేనికి చెందిన బసవపున్నమ్మ 2బంగారు గాజులు, గుంటూరుకు చెందిన ప్రొఫెసర్లు రూ.10వేలు విరాళం ఇచ్చారు. కాగా, ఎర్రబాలెం, నవులూరు, నిడమర్రు, కృష్ణాయపాలెం గ్రామాల్లో రిలేదీక్షలు 89వ రోజుకు చేరాయి. పెనుమాక, ఉండవల్లిలో నిరసనలు కొనసాగాయి. పెనుమాకలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి యు.గనిరాజు, ప్రగతి శీల న్యాయవాద జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌లు మద్దతు తెలిపారు.

## చిత్తూరు, గుంటూరు కలెక్టర్లు, ఎస్పీలను తప్పించాలి



### మాచర్ల సీఐని సస్పెండ్ చేయాలి

- పలమనేరు డీఎస్పీ, పుంగనూరు,రాయదుర్గం, తాడిపత్రి సీఐల బదిలీ
- ప్రభుత్వానికి ఎస్ఈసీ ఆదేశం.. తిరుపతి, మాచర్ల, పుంగనూరుకు అవసరమైతే కొత్త షెడ్యూల్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టీకరణ

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలు సందర్భంగా జరిగిన హింసాత్మక సంఘటనలను రాష్ట్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. రెండు జిల్లాల కలెక్టర్లను, ఎస్పీలను విధుల నుంచి తప్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఆదివారమిక్కడ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో అభ్యర్థులు క్రియాశీలంగా వ్యవహరించకుండా, అడుగడుగునా నామినేషన్లు వేయకుండా వారిని అడ్డుకోవడం, శాంతియుతంగా ఎన్నికలు జరగకుండా అవరోధాలు కల్పించడం అవాంఛనీయమన్నారు. బెదిరింపులు ప్రచారమాధ్యమాల ద్వారా స్పష్టంగా కనపడుతున్నాయని.. ఇది దురదృష్టకరమని తెలిపారు. 'ఈ సంఘటనలు ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నట్లు, భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు భావించాల్సి వస్తోంది. కొన్నిచోట్ల అధికార యంత్రాంగం పక్షపాత ధోరణితో వ్యవహరించడం, ప్రేక్షకపాత్ర వహించడం బాధాకరం. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారాలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఉంటాయి. ఈ నేపథ్యంలో అత్యంత హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న గుంటూరు కలెక్టరు, రూరల్ ఎస్పీ, చిత్తూరు కలెక్టరు, తిరుపతి అర్బన్ ఎస్పీలను విధుల నుంచి వెంటనే తప్పించి.. ప్రత్యామ్నాయ అధికారులను సూచించాలి. మాచర్లలో జరిగిన హింసాత్మక సంఘటన నేపథ్యంలో ఉదాసీనంగా వ్యవహరించి నిందితులపై కేసులు నమోదు చేసి.. వెనువెంటనే బెయిల్ మంజూరుచేయడం గర్హనీయం. అందుకు సీఐని తక్షణమే సస్పెండ్‌చేసి ప్రత్యామ్నాయంగా ఆమోదయోగ్యమైన అధికారిని నియమించాలని సూచిస్తున్నాం. హింసాత్మక సంఘటనల నేపథ్యంలో శ్రీకాళహస్తి, పలమనేరు డీఎస్పీలు, తిరుపతి, పలమనేరు, రాయదుర్గం, తాడిపత్రి సీఐలను బదిలీ చేయాలి. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, పత్రాలు చింపివేయడం వంటి సంఘటనలు పెద్దఎత్తున జరిగినట్లు నిర్ధారించిన తిరుపతి, మాచర్ల, పుంగనూరు ఎన్నికలను నిశితంగా పరిశీలిస్తున్నాం. వాటిలో అవసరమైనచోట కొత్త షెడ్యూల్‌ను ప్రకటించడానికి వెనుకాడం' అని స్పష్టం చేశారు. కొందరు అధికారులపై చర్యలు తీసుకోవాలని, హింసాత్మక సంఘటనలు పునరావృతం కాకూడదని ఆశిస్తున్నామన్నారు. గ్రామ వలంటీర్ల తీరుపై భారీగా ఫిర్యాదులు వస్తున్నాయని, వారిని కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు.

## వాయిదాపై వార్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలను వాయిదా వేశారన్నారు. 'ప్రతోడూ విచక్షణాధికారాల మాటెత్తడమే' అని మండిపడ్డారు. 'కరోనాకు మందులేదు మొర్రో' అని ప్రపంచ శాస్త్రవేతలు తలలు బద్దలుకొట్టుకుంటుండగా... 'పారాసిటమాల్‌తో పోయే కరోనాకు భయపడి స్థానిక ఎన్నికలు వాయిదా వేయడమేమిటని జగన్ ప్రశ్నించారు. పది రోజులాగితే ముగిసే ఎన్నికలను... ఎప్పుడు పోతుందో తెలియని కరోనా పేరిట ఆపేస్తారా అని నిలదీశారు. ఇక... చిత్తూరు, గుంటూరు ఎస్పీలు, కలెక్టర్లతోపాటు పలువురు పోలీసు అధికారులను తప్పించాలన్న ఎస్ఈసీ ఆదేశాన్నీ తప్పుబట్టారు. 'స్థానిక ఎన్నికల్లో ఎప్పుడైనా ఇంతకంటే తక్కువ సంఘటనలు జరిగాయా?' అనే ప్రశ్న లేవనెత్తారు. ముఖ్యమంత్రి హోదాలో అధికారికంగా నిర్వహించిన విలేకరుల సమావేశానికి... ఆహ్వానం పంపి కూడా, 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులను అనుమతించలేదు. సీఎం అయ్యాక తొలిసారి మీడియాతో మాట్లాడిన జగన్... తాను చెప్పాల్సింది చెప్పి, ప్రశ్నలు అడిగేందుకు ఆస్కారం ఇవ్వకుండా వెళ్లిపోయారు. అటు విపక్ష నేత చంద్రబాబు 'స్థానిక ఎన్నికలను వాయిదా వేయడం కాదు... రద్దు చేసి మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, కేంద్ర ఎన్నికల కమిషన్ రంగంలోకి దిగాలని కోరారు. అధికార పార్టీకి రాష్ట్ర పోలీసులు భయపడుతున్నారని...సీఆర్పీఎఫ్ బలగాలను దించాలని అన్నారు. కరోనాపై తేలిగ్గా మాట్లాడిన సీఎం జగన్ తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. రమేశ్ కుమార్‌ను ఎస్ఈసీగా సిఫారసు చేసింది తాను కాదని, గత గవర్నర్ నరసింహన్ అని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకోవాల్సిందే అని ఇతర పార్టీల నేతలూ డిమాండ్ చేశారు. ఏదిఏమైనా... శనివారం రాత్రిదాకా అధికార పార్టీకి 'మంచిది'గా కనిపించిన ఎస్ఈసీ ఉన్నట్టుండి చేదైపోయింది. ఎస్ఈసీ ఆదేశాలను జగన్ ప్రభుత్వం అమలు చేస్తుందా? 'నువ్వు చెబితే నేను వినేదేంటి?' అని మొండికేస్తుందా? రాజ్యాంగ వ్యవస్థకూ, రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య 'పంచాయితీ' ఎంత దూరం వెళ్తుంది? ఎన్ని మలుపులు తిరుగుతుంది? వేచి చూడాల్సిందే!

# ఉలిక్కిపడ్డ పోలీస్!

## ఊహించని షాకిచ్చిన ఎస్ఈసీ.. ఎస్పీ నుంచి సీఐల వరకూ వేటు



- సీఎం వ్యాఖ్యలతో చర్యలకు బ్రేక్
- గీతదాటితే వేటు తప్పదేమోనని ఆందోళన

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలతో పోలీసుశాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రెండు జిల్లాల ఎస్పీలు, రెండు సబ్‌డివిజన్ల డీఎస్పీలు, నలుగురు సీఐలపై వేటుకు సిఫారసు చేయడంతో పోలీసుల్లో కంగారు మొదలైంది. కొందరి మెప్పుకోసం చిక్కుల్లో పడాల్సి వచ్చిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సీఎం జగన్ వ్యాఖ్యలతో వారిపై చర్యలకు తాత్కాలిక బ్రేక్ పడింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒత్తిళ్లు ఎదుర్కొంటోన్న పోలీసులు వరుస పరిణామాలతో ఆందోళన చెందుతున్నారు. ఏపీ పోలీస్ పరువు పోతోందంటూ సీనియర్ ఐపీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేస్తుండగా క్షేత్రస్థాయి పోలీసులు ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక పోతున్నామని వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పెచ్చుమీరిన హింసను కట్టడి చేయాల్సిన పోలీసులు చాలాచోట్ల అధికార పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. హింసాత్మక ఘటనలు తీవ్రంగా పరిగణిస్తున్నామని, అన్నింటినీ పరిశీలిస్తామని ఈసీ చేసిన వ్యాఖ్యలు పోలీసుల్ని కలవరపరిచాయి. ఈ నేపథ్యంలో తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేశ్‌రెడ్డి, గుంటూరు రూరల్ ఎస్పీ విజయారావుపై వేటు పడింది. శ్రీకాళహస్తి, పలమనేరు డీఎస్పీలను తప్పించాలని, తిరుపతి, పలమనేరు, తాడిపత్రి, రాయదుర్గం సీఐలను తక్షణమే బదిలీ చేయాలని ఆదేశించిన ఈసీ... గుంటూరు జిల్లా మాచర్ల సీఐని సస్పెండ్ చేయాలని పేర్కొంది. ఒకేరోజు ఇన్ని షాక్‌లు తగలడంతో పోలీసు శాఖలో ఆందోళన మొదలైంది.

### నలిగిపోతున్నాం

అధికార పార్టీ నేతల ఒత్తిడి, రాజ్యాంగ సంస్థల చర్యల మధ్యలో నలిగి పోతన్నామని పోలీసులు వాపోతున్నారు. పోస్టింగ్ రావాలంటే పనితీరు కన్నా పాలక పార్టీ నేతల సిఫారసులకే విలువ ఎక్కువని పోలీసులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేల లేఖలతో పోస్టింగులు తెచ్చుకోక తప్పడం లేదంటున్నారు. ఎమ్మెల్యేలు సూచించిన వారికే స్టేషన్, సర్కిల్ దక్కుతుండగా మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేల ఆశీర్వాదంతో డీఎస్పీలకు సబ్ డివిజన్లలో పోస్టింగ్ వస్తోంది. ఎన్నికల్లో తమకు అనుకూలంగా వ్యవహరించాలని పోలీసులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను బెదిరించడానికి పోలీసులే పలు చోట్ల రంగంలోకి దిగాల్సి వస్తోందని చెబుతున్నారు.

### ఎన్నికలొస్తే ఇంతేనా?

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలీసులపై వైసీపీ నేతలు ఢిల్లీలో ఈసీకి రోజూ ఫిర్యాదు చేశారు. అప్పటి సీఎస్ అనిల్‌చంద్ర పునేఠా, రాష్ట్ర సీఈవో ఆర్పీ సిసోడియా, డీజీపీ ఆర్పీ ఠాకూర్, ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు, డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్, శ్రీకాకుళం, ప్రకాశం, కడప జిల్లాల ఎస్పీలు వెంకటరత్నం, కోయ ప్రవీణ్, రాహుల్‌దేవ్ శర్మపై పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఆర్పీ ఠాకూర్ మినహా దాదాపు అందరినీ ఈసీ ఎన్నికల విధుల నుంచి తప్పించింది. ఈసీ సిఫారసుల మేరకే సీఎస్‌గా ఎల్వీ సుబ్రమణ్యం, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కుమార విశ్వజీత్, ఇతర జిల్లాల ఎస్పీలనూ మార్చారు.

### ప్రతిపక్షాలకు ఎప్పుడూ చేదే

టీడీపీ అధికారంలో ఉండగా రాష్ట్ర పోలీసులపై తనకు నమ్మకం లేదని అప్పటి ప్రతిపక్ష నేత జగన్ ఆరోపించారు. తనపై విశాఖలో జరిగినదాడి, బాబాయ్ వివేకానందరెడ్డి హత్య కేసుల్ని సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో తమకు వ్యతిరేకంగా వచ్చే పోస్టింగులపైనా జగన్ సోదరి తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కేవలం 43చోట్ల మాత్రమే హింసాత్మక ఘటనలు జరిగాయని, ఏపీ పోలీసుల పనితీరు భేష్ అని సీఎం జగన్ ప్రశంసించారు. ఆ తర్వాత కొంతసేపటికి ప్రెస్‌మీట్ పెట్టిన చంద్రబాబు.... ఏపీ పోలీసులపై తమకు నమ్మకం లేదని, కేంద్ర బలగాల పహారాలో ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. ఇద్దరు నేతల వ్యాఖ్యలపై వాట్సాప్‌లో జోక్‌లు చక్కర్లు కొడుతున్నాయి.

## ఇరకాటంలో సీఎస్

- ఎస్ఈసీ ఆదేశాలు అమలు చేయాలా? వద్దా?
- చేస్తే సీఎంకి కోపం.. చేయకపోతే కోర్టు భయం



అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా నేపథ్యంలో ఆదివారం రాష్ట్రంలో జరిగిన పరిణామాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీలం సాహ్నిని ఇరుకున పడేశాయి. చిత్తూరు, గుంటూరు జిల్లాల కలెక్టర్లు, గుంటూరు రూరల్, తిరుపతి అర్బన్ ఎస్పీలు, పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, రాయదుర్గం, తాడిపత్రి సీఐలను బదిలీ, మాచర్ల సీఐని సస్పెండ్ చేయాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) రమేశ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత సీఎస్‌దే. అయితే, ఆ ఆదేశాలను సీఎం జగన్ వ్యతిరేకించడమే కాకుండా, ఎస్ఈసీకి ఆ అధికారాలే లేవని వ్యాఖ్యానించారు. దీంతో సీఎస్ ఏం నిర్ణయం తీసుకుంటారనే ఆసక్తి నెలకొంది. ఎస్ఈసీ ఇచ్చిన బదిలీ ఆదేశాలపై ఆదివారం పొద్దుపోయే వరకు సచివాలయంలో ఫైళ్లు కదలేదు. దీంతో ఎస్ఈసీ ఆదేశాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వెనుకడుగు వేశారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎస్ఈసీ ఆదేశాలు ప్రభుత్వం అమలుచేయకపోతే కొత్త చిక్కులు వచ్చిపడతాయి. తమ ఆదేశాలను ప్రభుత్వం ఖాతరు చేయని పక్షంలో ఎస్ఈసీ హైకోర్టును ఆశ్రయించవచ్చు. అదే జరిగితే రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం తలెత్తినట్టే. ప్రభుత్వం తరఫున ఎస్ఈసీ ఆదేశాలను అమలుచేయాల్సిన సీఎస్ కోర్టు బోనెక్కాల్సి రావచ్చు. ఎస్ఈసీ ఆదేశాల అమలు గురించి జీఏడీ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌ను సంప్రదించగా, ఆయన స్పందించలేదు. ఇటీవల డీజీపీని, ఎస్ఈసీని కోర్టు తీవ్రంగా మందలించిన నేపథ్యంలో తాజాగా ఎస్ఈసీ ఆదేశాల అమలును అధికారులు అమలు చేస్తారా? సీఎం అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటారా? అనేది ఆసక్తిగా మారింది. రాజ్యాంగ బద్ధ సంస్థ అయిన ఎస్ఈసీ ఆదేశాలు అమలు చేయని అధికారులపై కోర్టులు తీవ్రమైన చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. దీంతో ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు ఇప్పుడు ఏంచేయాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం.

## తెలుగుకు నేనే ప్రచారకర్త

- 'మన నుడి-మన నది'లో జనసేనాని పవన్‌కల్యాణ్



సదస్సులో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

రాజమహేంద్రవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): "తెలుగు భాష పరిరక్షణకు నేనే ప్రచారకర్తనవుతా. ప్రజల నుంచే తెలుగు ఉద్యమం పుట్టాలి. మేధావులు కదిలితేనే సామాన్యులు కదులుతారు" అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన 'మన నుడి-మన నది' సదస్సులో పవన్ మాట్లాడారు. 'తెలుగు భాష పరిరక్షణ కోసం కదలండి. మన నుడి-మన నది కాన్సెప్ట్‌ను మేధావుల నుంచి స్వీకరించాను. సలహాలు సూచనలతోనే ఈ కార్యక్రమం ఆగకూడదు. ఇది ఉద్యమంగా మారాలి. తెలుగు పరిరక్షణ కోసం ఒక కమిటీ వేసి కార్యక్రమాలు చెయ్యాలి" అని సూచించారు. "విద్యార్థి దశలో భాష సరిగా రాకపోతే మానసికంగా ఎంత బాధపడతామో నాకు తెలుసు. అప్పట్లో నాకు ఇంగ్లిష్ సంపూర్ణంగా రాదు. సంపూర్ణ తెలుగు రాదు. కానీ నేను తపించాను. చదువుకున్నాను" అని తెలిపారు. యాస, భాషలను గౌరవించకపోవడం సమాజానికి మంచిది కాదన్నారు. రాష్ట్రంలో 39 నదులున్నాయని, వాటి తీరంలో సామాన్యులువాడే పదాలను అక్కడ కళలు, కళాకారులను వెలికితీస్తేనే భాషకు జీవం ఉంటుందని పవన్ పేర్కొన్నారు.

## లోకం తీరు




రీచార్జ్ చేయగానే కరోనా కాలర్ టోన్ విని ఇతను... పెరిగిన ఫోన్ రేట్లు విని అతను... ఇలా

### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రాజమండ్రి | 31.0 | 18.0 |
| శ్రీకాకుళం | 32.5 | 22.0 |
| హైదరాబాద్ | 33.2 | 21.8 |
| గుంటూరు | 35.5 | 24.3 |
| విజయవాడ | 34.8 | 21.8 |
| అనంతపురం | 36.0 | 22.1 |



### కరోనా వైరస్.. దేవుడు విధించిన శిక్ష

కరోనా వైరస్ అనేది అమెరికా, ఐరోపా సమాజానికి దేవుడిచ్చిన శిక్ష. మాపై ఆంక్షలు విధించినందుకే దేవుడా శిక్ష విధించాడు. ఆయా దేశాల ప్రజలు ఇప్పుడు ఇళ్లల్లోనే బందీ అయ్యారు. వారి ఆర్థిక పరిస్థితులు తలకిందులవుతున్నాయి. కరోనా వైరస్ ఫలితాలను ఆయా దేశాలు అనుభవించాల్సిందే. అప్పుడే మా బాధ ఏమిటో అర్థమవుతుంది.

*- ఓపా ముచిన్‌గురి, జింబాబ్వే రక్షణ మంత్రి*



### 350 సీట్లొస్తాయని జోతిష్యుడు చెప్పాడు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీకి 350 సీట్లు వస్తాయి. విమానంలో ఢిల్లీకి వెళ్తున్నప్పుడు ఓ వ్యక్తి నా చేయి చూసి ఈ విషయం చెప్పాడు. బాగా కష్టపడితే వచ్చేసారి నేనే సర్కారు ఏర్పాటు చేస్తానేనది అతని జోస్యం.

*- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు*



### అవయవ మార్పిడిని అక్కున చేర్చుకునే సూక్ష్మకణాలు

వాషింగ్టన్ డీసీ, మార్చి 15 : అవయవ మార్పిడి జరిగిన సందర్భాల్లో.. శరీరంలోకి కొత్తగా వచ్చి చేరిన అవయవంపై వ్యాధి నిరోధక వ్యవస్థ దాడిచేస్తుంది. ఈ ప్రతికూలతను అధిగమించేందుకు దోహదపడే అతి సూక్ష్మకణాలను అమెరికాలోని పిట్స్‌బర్గ్ వర్సిటీకి చెందిన స్వాన్సన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. వీటిని అవయవ మార్పిడి జరిగిన భాగం, చర్మాన్ని అతికించిన ప్రాంతాల్లోని కణజాలంలోకి ప్రవేశపెడతారు. అక్కడ సూక్ష్మకణాలు సీసీఎల్22 అనే ప్రొటీన్‌ను విడుదల చేస్తాయి. ఇది జరిగిన వెంటనే అక్కడికి తెల్ల రక్తకణాలు చేరుకొని ఆ భాగాన్ని రక్షించే పనిలో నిమగ్నమైపోతాయి. ఫలితంగా కొత్తగా వచ్చి చేరిన సదరు అవయవం, చర్మ భాగం తనదే అనే భావన కలిగేలా ఈ సూక్ష్మకణాలు రోగి శరీరాన్ని, వ్యాధి నిరోధక వ్యవస్థను సంసిద్ధం చేస్తాయి. ఎలుకలపై జరిపిన ప్రయోగ పరీక్షల్లో ఈ విషయం వెల్లడైంది. వ్యాధి నిరోధక వ్యవస్థను మభ్యపెట్టేందుకు కేన్సర్ కణాలు ప్రవర్తించే తీరు స్ఫూర్తిగా ఈ ఆవిష్కరణ చేశారు.

### భూ అయస్కాంత క్షేత్ర ఆవిర్భావానికి కారణం 'మ్యాంటిల్'

**అమెరికాలోని శాండియాగో వర్సిటీ శాస్త్రవేత్తలు**

లాస్ ఏంజెలిస్, మార్చి 15 : భూ అయస్కాంత క్షేత్రం ఎలా ఏర్పడింది? ఈప్రశ్నకు ఇప్పటివరకు భూమిలోని 'కోర్ పొర అనే సమాధానం వినిపించేది. కానీ అమెరికాలోని కాలిఫోర్నియా శాండియాగో వర్సిటీ శాస్త్రవేత్తలు మాత్రం 'మ్యాంటిల్ పొర అని బదులిస్తున్నారు. తమ అధ్యయనంలో ఈవిషయమే తేలిందని వారు వాదిస్తున్నారు. భూమి పైపొర 'క్రస్ట్'పై మనం జీవిస్తున్నాం. దాని కింద మ్యాంటిల్, 'కోర్, లిథోస్పియర్, ఎస్తెనోస్పియర్ అనే మరో నాలుగు రకాల పొరలు ఒకదాని తర్వాత ఒకటిగా ఉంటాయి. మ్యాంటిల్ పొర దిగువ భాగంలోని ద్రవ రూప సిలికేట్ విద్యుత్ వాహకంగా పనిచేసి భూమికి బలమైన అయస్కాంత క్షేత్రాన్ని ఏర్పరుస్తోందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ అయస్కాంత క్షేత్రం ప్రభావంతో సూర్యుడి నుంచి వెలువడే సౌర పవనాలు భూమిపైకి చేరకముందే దారిమళ్లిపోతాయి. ఒకవేళ ఇదే లేకుంటే సూర్యుడి అతినీల లోహిత కిరణాల నుంచి భూమండలాన్ని కాపాడే ఓజోన్ పొర ఎప్పుడో ఛిద్రమైపోయేది.

## ఎన్నికలు 6 వారాల వాయిదా

# ఆగిన ప్రచారం

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

కరోనా వైరస్ దృష్ట్యా రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికలను 6 వారాలు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ప్రకటన చేసిన వెంటనే ఎక్కడికక్కడ అభ్యర్థులు ప్రచారాన్ని నిలిపివేశారు. నోటిఫికేషన్-పోలింగ్ తేదీ మధ్య గడువు స్వల్పమైనందున కాలంతో పరుగులు పెడుతూ ప్రచారం సాగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న అభ్యర్థులు ఇప్పుడా గడువు 6 వారాలకు పెరగడంతో తదనుగుణంగా తిరిగి వ్యూహాలు రచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాయిదా వల్ల ప్రచారాన్ని సావకాశంగా చేసుకునే అవకాశం లభించిందని అభ్యర్థుల్లో కొందరు ఆనందిస్తుండగా, పలువురు మాత్రం అన్ని వారాల పాటు ప్రచారపర్వం వల్ల ఎన్నికల వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరగడం తథ్యమన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ స్థానిక సంస్థలకు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శనివారం ముగిసింది. అంతలోనే ఎన్నికల ప్రక్రియకు అర్ధంతరంగా బ్రేకులు పడ్డాయి. కరోనా అదుపులోకి వచ్చి, దానితో ఇక జనబాహుళ్యానికి ఎటువంటి ప్రమాదం లేదని నిర్ధారణ అయిన తర్వాత తిరిగి ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. దాన్ని బట్టే నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం, అనంతరం ఎన్నికల తేదీ ఎప్పుడో ఖరారవనున్నాయి. అప్పటి వరకూ ఆశావహులకు నిరీక్షణ తప్పదు!



సుగుణమ్మతో ఉదయ్ భాస్కర్ (ఎడమవైపు చివర.. వైట్ షర్ట్)

### అపహరణ.. ఉపసంహరణ

▸▸ కర్నూలు జిల్లాలో వైసీపీ ఆగడాలు

కర్నూలు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వైసీపీ నాయకులే నేరుగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో పాల్గొన్నారు. కొలిమిగుండ్ల మండలం నుంచి టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసిఁసుగుణమ్మతో వైసీపీ జడ్పీ చైర్మన్ అభ్యర్థి కుమారుడు ఉదయ్ భాస్కర్‌రెడ్డి శనివారం దగ్గరుండి మరీ విత్ డ్రా చేయించారు. ఆర్వో కార్యాలయంలో ఆమె పక్కనే నిలబడి ఉపసంహరణ చేయిస్తున్నా ఆర్వో వెంకట సుబ్బయ్య, ఇతర అధికారులెవరూ అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. స్థానిక టీడీపీ నాయకులు విషయం తెలుసుకుని జడ్పీ కార్యాలయానికి చేరుకునే లోపే విత్ డ్రా ప్రక్రియను ముగించారు. కాగా.. అధికారుల తీరును టీడీపీ నాయకులు తప్పుబట్టారు.

### మోసం చేసి పోటీకి దూరంచేశారు!

▸▸ కలెక్టర్‌కు ఎంపీటీసీ అభ్యర్థి ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రామకృష్ణ

విజయనగరం, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అధికారులు సైతం అధికార పార్టీతో కుమ్మక్కై నామినేషన్‌ను ఉపసంహరించుకునేలా కుట్ర పన్ని తనను పోటీ నుంచి దూరం చేశారని విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గం పాచిపెంట సెగ్మెంట్-3 ఎంపీటీసీ టీడీపీ అభ్యర్థి బెవర రామకృష్ణ ఆవేదన వ్యక్తంచేశాడు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిజవహర్‌లాల్‌కు ఈ మేరకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. రామకృష్ణ ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేశాడు. 14వ తేదీ సాయంత్రం పొలంలో పనిచేస్తుండగా కొంతమంది వచ్చి నామినేషన్ పత్రాల్లో కొన్ని సంతకాలు లేవని, ఆర్వో రమ్మంటున్నారంటూ పిలిచారు. మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం 5.30 గంటలకు సంతకం తీసుకున్నాక రాత్రి 8 గంటలకు ఎన్నికల బరిలో నుంచి తప్పుకున్న వారి జాబితాలో తన పేరును చేర్చారని రామకృష్ణ తెలిపాడు. మోసపోయానని గుర్తించి టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌కు జరిగిన విషయాన్ని తెలిపి, ఆదివారం కలెక్టర్‌ను కలసి ఫిర్యాదుచేశాడు.

### పోలీసుల అదుపులో 'మద్యం' నిందితులు?

తెనాలి అర్బన్, మార్చి 15: గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి ఇంట్లో అర్ధరాత్రి మద్యం సీసాలు పెట్టిన అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పురపాలక ఎన్నికల్లో 4వ వార్డు నుంచి టీడీపీ తరపున పోటీ చేస్తున్న అడుసుమల్లి వెంకటేశ్వరరావు ఇంటిలో ఇద్దరు అగంతకులు ప్రవేశించి మద్యం సీసాల బాక్సు ఉంచి వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరుసటి రోజే ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వాహకుని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సంఘటన జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ సంచలనం కలిగించడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై టూ టౌన్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా అభ్యర్థి ఇంట్లో ప్రవేశించిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

### ఫోర్జరీ సంతకాలతో పోటీ నుంచి తప్పించారు

▸▸ చంద్రబాబుకు టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థుల ఫిర్యాదు

ముప్పాళ్ళ, మార్చి 15: సంతకాలు ఫోర్జరీ చేసి ఎన్నికల్లో పోటీ నుంచి తమను తప్పించారని టీడీపీ మండల నాయకులు, ఎంపీటీసీ అభ్యర్థులు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు ఫిర్యాదుచేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయనను కలిసి మండలంలో 12 ఎంపీటీసీలకు గానూ 5 ఎంపీటీసీను వైసీపీ ఏకగ్రీవంగా ఎన్నిక చేయించుకుందని తెలిపారు. గోళ్లపాడు, లంకెలకూరపాడు, రుద్రవరం గ్రామాల ఎంపీటీసీల సంతకాలను వైసీపీ వర్గీయులు ఫోర్జరీ చేసి విత్‌డ్రాలు చేయించారని ఆవేదన వ్యక్తంచేశారు. మాదలలో ఉన్న రెండు ఎంపీటీసీల బీ-ఫారాలను చించివేసి బలవంతంగా, దౌర్జన్యంగా విత్‌డ్రా ఫారాలపై సంతకాలు చేయించారని వారు చంద్రబాబుకు చెప్పారు.



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో జస్టిస్ మానవేంద్రరాయ్, జస్టిస్ శ్యాంప్రసాద్

### శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, మార్చి 15: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రరాయ్, జస్టిస్ శ్యాంప్రసాద్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్‌లో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

### టీటీడీ ఈవో రేసులో శ్రీవత్స కృష్ణ

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఈవోగా కర్ణాటక కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీవత్స కృష్ణను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మూడేళ్ల కాల పరిమితి మే మొదటి వారంలో ముగుస్తుండటంతో శ్రీవత్సను డెప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి ఈవోను చేయాలని ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఢిల్లీకి చెందిన శ్రీవత్స 1994 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. 1994లో ఆయన్ను ఏపీ కేడర్‌కు కేటాయించగా, అప్పట్లో హైదరాబాద్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. తర్వాత ప్రపంచబ్యాంకు అసైన్‌మెంట్‌పై వెళ్లారు. అనంతరం విధుల్లోకి తిరిగొచ్చినా ఆయన సతీమణి మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఏఎస్ కావడంతో స్పౌజ్ ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోగా ఇద్దరినీ కర్ణాటక కేడర్‌కు కేటాయించారు. కర్ణాటకలో పనిచేస్తున్న ఆయనను ఇప్పుడు ఏపీకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే శ్రీలక్ష్మి, స్టీఫెన్ రవీంద్ర, రోహిణీ సింధూరి తదితరుల డెప్యుటేషన్ దరఖాస్తులను కేంద్రం పెండింగ్‌లో పెట్టింది.




# వెంపటి సేవలు అజరామరం

▸▸ 'కూచిపూడి రత్న' ప్రదానోత్సవంలో పట్రాయని సంగీతరావు



సంగీతరావుకి అవార్డును ఇస్తున్న దృశ్యం

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్యానికి వెంపటి చినసత్యం ఒక శతాబ్దానికి చాలినంత సేవ చేశారని, కూచిపూడి నాట్య సంప్రదాయ శైలిని కాపాడే బాధ్యతను ఆయన వారసులు సమర్ధవంతంగా నిర్వహించే శక్తి నటరాజస్వామి వారికి కల్పించాలని తెలుగు సంగీత దిగ్గజం పట్రాయని సంగీతరావు ఆకాంక్షించారు. శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు కూచిపూడి ఆర్ట్ అకాడమీ తరపున ఆదివారం రాత్రి చెన్నైలో 'కూచిపూడి రత్న' బిరుదును ప్రదానం చేసి, గండపెండేరం తొడిగి, కనకాభిషేకం చేశారు. దివంగత వెంపటి చినసత్యం స్థాపించిన ఈ అకాడమీ ప్రాంగణంలో ఆయన కుమారుడు వెంకట్ వెంపటి సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళనాడు ఎమ్మెల్యే ఆర్.నటరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని సంగీతరావుకి బిరుదును ప్రదానం చేశారు. వయోభారం దృష్ట్యా సంగీతరావు మనసులోని భావాలను ఆమె కుమార్తె, ప్రముఖ రచయిత్రి కేవీ రమణమ్మ వెల్లడించారు. సంప్రదాయ కూచిపూడి నాట్యాన్ని మద్రాసులో నిలబెట్టాలన్న వెంపటి చినసత్యం సేవ అపూర్వమైనదని, తనను వైణికుడిగా, సంగీత దర్శకుడిగా చినసత్యమే పరిచయం చేశారని చెప్పారు.

### మాజీ మంత్రి ఆదిపై కేసు నమోదు

జమ్మలమడుగు రూరల్, మార్చి 15: కడప జిల్లా జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణకు సంబంధించి మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డితో పాటు ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మరికొందరిపై పోలీసులు పలు సెక్షన్ల కింద ఆదివారం కేసులు నమోదుచేశారు. జమ్మలమడుగు అర్బన్ సీఐ మధుసూదన్‌రావు ఆదివారం రాత్రి విలేకరులకు కేసు వివరాలు తెలిపారు. వైసీపీ నాయకుడు ఎం.రెడ్డయ్యతో పాటు ఆయన అన్న రామాంజనేయులు దేవగుడి గ్రామం ప్రధాన రోడ్డుపై ఉండగా.. ఆది అనుచరులు వారిని దేవగుడి గ్రామంలోకి తీసుకెళ్లారు. అక్కడ ఆదినారాయణరెడ్డి, శివనాథరెడ్డి, దేవగుడి జయరామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలతో పాటు మరో 80 మంది కలిసి రాళ్లు, కర్రలతో వారిపై దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడ్డ రెడ్డయ్యను ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. రెడ్డెయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.



తవ్వేయడంతో ధ్వంసమైన రోడ్డు

### వైసీపీ నాయకుడి దాష్టీకం

▸▸ మట్టి తవ్వకాలను అడ్డుకున్నారని గ్రామానికి వెళ్లే రోడ్డు ధ్వంసం

ధర్మవరం రూరల్, మార్చి 15: చెరువులో మట్టిని తోలుకోనివ్వలేదని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు గ్రామానికి వెళ్లే రహదారిని ధ్వంసం చేసిన వైనమిది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా ధర్మవరం మండలంలోని మల్కాపురం గ్రామ చెరువులో నుంచి ఎవరైనా మట్టి తోలుకుంటే గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయానికి ఎంతో కొంత విరాళం ఇస్తుంటారు. ఆ విరాళాన్ని దేవాలయం అభివృద్ధికే ఖర్చు పెడతారు. ఇది ఎప్పటినుంచో గ్రామస్తులు పెట్టుకున్న సంప్రదాయం. దీనికి తోడు అక్రమంగా చెరువుల్లో, వంకల్లో మట్టి తోలితే తమకు ఫిర్యాదు చేయాలని గతంలో పోలీసులు గ్రామస్తులకు తెలిపారు. ఈ నేపథ్యంలో గొట్లూరుకు చెందిన వైసీపీ నేత పిట్టా నరసింహులు కుమారుడు పిట్టారాజు ట్రాక్టర్లతో పాటు ఎక్స్‌కవేటర్లతో ఆదివారం మట్టి తోలి నిబంధనలు అతిక్రమించడంతో గ్రామస్తుంతా అడ్డుకున్నారు. దీంతో నరసింహులు గ్రామస్తులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతటితో ఆగకుండా మా గ్రామానికి ఎలా వస్తారో చూస్తానంటూ.. మల్కాపురం గొట్లూరు మధ్యలో రోడ్డుకు అడ్డంగా గుంత తీయించి గ్రామానికి వెళ్లే దారిని పూర్తిగా ధ్వంసం చేశాడు. దీంతో మల్కాపురం గ్రామస్తులు మూకుమ్మడిగా ధర్మవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



సోమవారం 16 మార్చి 2020

# వివిధ

సాహిత్య వేదిక vividha@andhrajyothy.com



# నా చే తాకిన గొప్పవాళ్ళు

ఏడుకొండల వెంకటేసుడు యముని పాయం పట్టలేక
మొగినాలీ పొందుకై పాకులాటను పాటగా పాడిన
మా నాగవ్వ పాటే మా కింపైన బాస

నడిజామన పానం అగ తప్పితే చెట్టోరు మందు పొంగ పోసి ఇస్తే
కాంచేడికి జుట్టు పట్టి పైకి లేపినట్లు చేసే
మా మల్లయ్య చేతి వైద్యమే మా బతుకు

మొన్ను కూడా పెరక్క తినే కటన్న కరువులో
గొట్టి గడ్డలు అనప బేడలు బెల్లం వేసి
చింతకట్లుతో రేయంత ఉడకబెట్టి పంచె వన్నె పదార్తాన్ని మా నోటికందించిన
మా లచ్చమ్మ చెయ్యివాటం మా బతుకు తీపి

ఏడు పొగుళ్ళు ఏడు రేత్రులు తెరపెరగని వాన గాలి ఎత్తుకుంటే
ఊరందరి పైకప్పులు పైకి లేస్తే మా ఇంటి కప్పు చెక్కుచెదరకుండ కప్పిన
మా బోయకొండ తాత పనితనమే మా నెత్తి గొడుగు

కుదుట్లో నిండు నీళ్ళకడవపై బూతద్దం వేసి వెతికినా
ఎల్సని కుండ చేసిన కుమ్మరి వెంకటప్ప చేతుల్లో ఉన్న
ఉన్నరి తనమే మా నోటి కూడు

పెండ్లి, పుట్టుక, పండగ, ఆట, పాట, రంపు, చావుల్ల పెద్ద తలకాయగా నిలబడి
అంతు ఇడసకుండా అందరినీ ఒకే గాటీ కట్టేసే మల్లెతనం ఉన్న
మా రామయ్య కొండమ్మలే మా మేలుకొలుపు

ఏడేండ్లు వెతికిన పురుగుకి దారి దొరకనీయకుండా దాసిన విత్తనాల కోసం
పోవిడి దొరికిన వాల్నంతా ఒంటికాలి మింద నిలబెట్టేలా చేసిన
మా ఈరమ్మ ముందుచూపే మా బతుకు నిలుపు

పగోనిపై చెయ్యి కర్ర వాడకుండా
నీ బుర్ర దొల్లాడా నీ దటం యాలాడ అని నోటితోనే అల్లి పెట్టె
మా అనసూయ తిట్టే మా నోటి గెలుపు

నూరేండ్లు అయినా నేల పోయే నల్ల జీమను కనిపెడుతూ
పొప్పేమకలు పలపల కొరుకుతూ వంగకుండ
అందురు అసోద్దె పోయేటట్లు బతికిన
పాపుల పెద్దమ్మ బతికిన బతుకే మా పానతీపి!

తరాలు మారినా యుగాలు మారినా మనతో బతికేది మన బాస
మనకు సొంతమైన బాసే మన బతుకు కిటుకు
కిటుకు లేని మనిషి కీటకముతో సమానం

■ ఎండపల్లి భారతి
93908 03436

### తిరుమల స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారం

శ్రీమతి తిరుమల స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారాన్ని కొండపల్లి నీహారిణి స్వీకరిస్తారు. ప్రదాన సభ మార్చి 16 సా.6గం.లకు దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఎల్లూరి శివారెడ్డి, తిరుమల శ్రీనివాసాచార్య, సుమతీ నరేంద్ర తదితరులు పాల్గొంటారు.

జె. చెన్నయ్య

### 'పడిలేచే కెరటం', 'అరణ్యపర్వం' నవలలు

సలీం రాసిన 'పడిలేచే కెరటం', 'అరణ్యపర్వం' నవలల ఆవిష్కరణ సభ మార్చి 17 సా.6గ.ంలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

పాలపిట్ట బుక్స్

### తెలంగాణ దళిత సాహిత్యం, సంస్కృతి, కళారూపాలపై సదస్సు

ఈ రెండు రోజుల సదస్సు మార్చి 18, 19 తేదీల్లో దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, కె.శ్రీనివాస్, జూపాక సుభద్ర, గుట్టం సీతారాములు, దాసరి రంగ, పి. కనకయ్య, నందిగామ నిర్మల కుమారి, తైదల అంజయ్య, గడ్డం మోహన్ రావు తదితరులు పాల్గొంటారు.

జె. చెన్నయ్య

### 'దుర్గాపురం రోడ్'కు ఉమ్మడిశెట్టి సత్యాదేవి అవార్డు

ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు-2019కు దేశరాజు 'దుర్గాపురం రోడ్' కవిత్వ సంపుటి ఎంపికైంది.

ఉమ్మడిశెట్టి రాధేయ

# 'మన కబీర్'కు మహోన్నత పురస్కారం



"పల్లె కన్నీరు పెడుతోంది..." గేయమెంత నిడివి ఉందో దాని చుట్టూ అంత చర్చ జరిగింది. ఆ పాట నా ఆత్మ. ఇరవై నాలుగేండ్ల క్రితం అది రాయకుంటే ఆత్మహత్యే శరణ్యం అనుకునేటంతటి దైన్యంలో ఎగసిన పలవరింత. సమాజం ఉత్పత్తి సంబంధాలు- ఉత్పత్తి పరికరాల ఎదుగదలను అర్థం చేసుకోలేని వాణ్ణి కాదు నేను. అనివార్యమని అనుకున్నా, అధిపత్యంతో లాభాపేక్ష సామ్రాజ్యవాదం విదిల్చిన ఇనుపరెక్కల వీరంగానికి అల్లాడిన పల్లె దృశ్యానికి పల్లవి కట్టాను.

**తె**లుగు సాహిత్యంలో పాటల ఊటచెలిమ గోరటి వెంకన్న. పాటకు కవిత్వ పరిమళాలను అద్ది, పదునెక్కించి పాటను శిఖరాయమానం చేసిన కవిత్వం వెంకన్నది. దక్షిణ భారతాన కొనసాగిన సాంస్కృతిక పోరాటాల వారసత్వాన్ని అందిపుచ్చుకున్న వెంకన్నపాట... ఆకలి, కన్నీరు లేని లోకాన్ని కలగంటున్నది. వెంకన్నది వామపక్ష నేపథ్యం. అయినప్పటికీ వివిధ తాత్విక ధోరణులను తన రచనలో యిముడ్చుకొన్నాడు. ఆదిసామ్యవాది గౌతమబుద్ధుని బోధన వెంకన్న వాదన. విశ్వగమనాలను ఆకళింపు చేసుకున్న సునిశిత దృష్టి వెంకన్న సొంతం. మానవ సమూహ దుఃఖ సముద్రాలను ఒడిసిపట్టుకున్న కవనం తనది. సాధు, సంతు, సూఫీ, బైరాగి, అచల, విప్లవ సమన్విత కవితా ప్రవాహరూపమే వెంకన్న పాట. ఇలాంటి వెంకన్న పాటకు ఇటీవల ప్రతిష్ఠాత్మక కబీర్ సమ్మాన్ అవార్డు దక్కింది. భారతీయ భాషల్లోని ప్రామాణిక కావ్యాలకు ఇచ్చే ఈ అవార్డుకు ఎంపికైన సందర్భంలో- వెంకన్న తన పాటల వెనుక ఉన్న బలం ఏమనుకుంటున్నాడో, వర్తమాన సామాజిక సందర్భాన్ని ఎట్లా చూస్తున్నాడో తెలుసుకునే ప్రయత్నమే ఈ ముఖాముఖి...

**భారత సమాజంపై బలమైన ముద్రను వేసిన భక్తి కవుల సంప్రదాయ కవిశిరోమణి కబీర్ పేరుమీద ఇచ్చే "కబీర్ సమ్మాన్ జాతీయ పురస్కారం" మీ పాటను వరించిన వేళ మీ అనుభూతి ఏమిటి?**

శకలాలు శకలాలుగా రాల్చుకున్న తరాల దుఃఖ వ్యక్తీకరణకు దక్కిన గౌరవమనుకుంట. నేనే ఏదో సాధించిన విజయం కాదిది. దున్న ఈద్దాసు, చెన్నదాసు మొదలుకొని దువ్వూరి, కృష్ణశాస్త్రి, జాషువా, గద్దర్‌ల పాదజాడలకు ప్రణమిల్లిన ఫలమనుకుంట. ఎంపిక చేసిన సాహితీమూర్తులకు ధన్యవాదాలు.

**మౌఖిక వారసత్వం, విస్తృత సాహిత్య అధ్యయనం, విశాల సైద్ధాంతిక అవగాహన, తాత్విక కవితాధోరణి మీ పాటకు మూలస్తంభాలు. ఈ నాలిగింటితో పాటు బలమైన కాలికస్పృహతో అప్‌డేట్ కావడం ఎలా సాధ్యమవుతున్నది?**

మీరు నన్ను అప్‌డేట్ అనుకుంటున్నారు. నేను ఉన్నచోటే ఊహల్లో మునిగి ఉన్న. ఆ ఊహలు చెదిరినపుడు హృదయంలో ఉబికే అలజడికి ఆవేదనను అనుచుకోలేని సహజ నేపథ్యమే నా అప్‌డేట్.

**మీ పాట పాడుతున్నప్పుడు గేయమై అలరిస్తది, చదివితే ఒక దీర్ఘ కవితను తలపిస్తది ఇది ఎట్లా సాధ్యం?**

కవిత్వ జీవధాతువు మౌఖికతలో దాగి ఉంది. మౌఖిక వారసత్వంతో పాటు ప్రాచీన, ఆధునిక సాహిత్యాల యెడ ఆరాధనవల్ల మీ అభిమానాన్ని పొంది ఉండవచ్చు.

**ఇంత గాఢత సాధించిన అభివ్యక్తికి మీ అధ్యయనమే కారణమా?**

అధ్యయనం కావొచ్చు. పరిశీలన కావచ్చు. వైయక్తిక అనుభూతి కావచ్చు. అల్లే వేళ మైకం. అన్నీ నావనుకునే అనురక్తి, ఏదీ కానీ విరక్తి కావచ్చు.

**పోతన మొదలుకొని వేమన, కృష్ణశాస్త్రి మొదలుకొని దువ్వూరి, కాళ్లకూరి దాకా వందల పద్యాలు మీకు కంఠస్థం. పద్యంపై ఇంతటి మోహం ఎలా అలవడింది?**

పాఠశాలలో పద్యమే నాకు నైవేద్యం. లయ గల గేయంలో తెలియకుండానే ఛందస్సు ఉంటుంది. అది మౌఖిక సాహిత్యంగా మనం ఎరుగుదుము. పాట, పద్యం యెడ సమారాధన నాది. నాలోని వెలితిని, నా దుఃఖాన్ని నేను వ్యక్తీకరించుకోలేని ఆసక్తతలో బలిజెపల్లో, వేమనో, కృష్ణశాస్త్రో తదితర మహాకవుల పద్య వలపోతనే నాకు ఓదార్పు.

**బాబ్ డిలాన్, పాల్ రాబ్సన్, దర్విష్, లాయింగ్‌స్టన్, దాస్తోవిస్కీ, కుప్రీన్, టాల్‌స్టాయ్ తదితర అంతర్జాతీయ కవుల సాహిత్యానికి మీ పాటకు సామ్యం ఉంది. ఇది ఎలా సాధ్యమైంది?**

సామ్యం ఉందో లేదో నాకు తెలియదు. కానీ, వారి రచనాశక్తికి దోసిలొగ్గెవాడిని. కొన్ని అనువాదాల్లోగానీ, మూలంలోగానీ చదివి ఆస్వాదిస్తాను. ఆర్టిస్ట్ మోహన్ గారి వల్ల పాశ్చాత్య సాహిత్య పరిచయం కొంత కలిగింది. అనేకమంది సాహితీమూర్తుల చలువవల్ల వీరిని చదవాలనే ఆసక్తి కలిగింది.

**గ్లోబలైజేషన్ దాడికి భారత పల్లెలు నాశనమయ్యాయని వెంకన్న "పల్లె కన్నీరు పెడుతోంది..." పాట రాస్తే దార్శనికులు మొదలుకొని దారిన వెళ్లే పామరజనం కూడా కన్నీరు కార్చారు. అదే సమయంలో వృత్తులను అంటిపెట్టుకున్న కులం మాటేమిటి, వెంకన్న కులం పోవద్దని కోరుకుంటున్నాడా? అనే విమర్శకు సమాధానం ఏమిటి?**

ఈ గేయమెంత నిడివి ఉందో దాని చుట్టూ అంత చర్చ జరిగింది. నిద్ర పోయినోళ్లను లేపొచ్చు. నిద్ర నటించేవాణ్ణి లేపలేం. అయినా రెండు మాటలు.. తప్పదు కదా. ఆ పాట నా ఆత్మ. ఇరవై నాలుగేండ్ల క్రితం అది రాయకుంటే ఆత్మహత్యే శరణ్యం అనుకునేటంతటి దైన్యంలో ఎగసిన పలవరింత. గ్లోబలైజేషన్, సరళీకరణ ఇవన్నీ అర్థమై రాసింది కాదు. సూచనప్రాయంగా వాటి గూర్చి అవగాహన ఉన్నా అది రాసినప్పుడు నా కళ్లల్లో మెదిలిన నా ఊరు, నేను చదివిన రఘుపతిపేట, వెయ్యి మగ్గాల శిథిలత్వం, ప్రాణ మిత్రుల ఎడబాటు, పరిసరాలలో ఆవరించిన ఎడారిదృశ్యం, ఏనాడు నా ఊరిలో ఎవరితో ఇసుమెత్తు విబేధంలేని సామరస్య పూర్వక జీవితం, కష్టాలు కన్నీళ్లు, ఆనందాలు, అనుబంధాలు కలబోసుకొని బతికిన పల్లె యాదికొచ్చి అల్లుకున్న పాట అది. ఉద్యోగ బదిలీ వల్ల ఊరికి దూరం కావాల్సిన పరిస్థితుల వల్ల నాలో తన్నుకొని వచ్చిన గేయం అది. సమాజం ఉత్పత్తి సంబంధాలు-ఉత్పత్తి పరికరాల ఎదుగదలను అర్థం చేసుకోలేని వాణ్ణి కాదు నేను. అనివార్యమని అనుకున్నా, అధిపత్యంతో లాభాపేక్ష సామ్రాజ్యవాదం విదిల్చిన ఇనుపరెక్కల వీరంగానికి అల్లాడిన పల్లె దృశ్యానికి పల్లవి కట్టాను. వృత్తులే కులానికి కారణమైతే ప్రపంచంలో అనేక దేశాల్లో ఇలాంటి వృత్తులు చేసే వారి యెడ వివక్షత లేదు. వృత్తి చితికింది. కులం అతికింది. ఇది భారతీయ సమాజ తరాల ప్రత్యేక అమానుష్య విధానమే వివక్షగానీ, వృత్తులు చేయడం వల్ల కాదు. వృత్తులున్న గ్రామాల కంటే వృత్తులు లేని నగరాలలో కులవివక్ష అధికమనేది ఏ దళితున్ని అడిగినా చెప్తారు. అయినా గ్లోబలైజేషన్ వల్ల కొన్ని వృత్తులకు అధిక రాబడి కూడా వచ్చింది. భూస్వామ్య సంకెళ్లను తెంచుకున్నయి. దాన్ని అంగీకరించవచ్చు. అప్పటి నా అవగాహన. గాంధీ చెప్పినా, బుద్ధుడు చెప్పినా, మావో చెప్పినా పరిమితత్వం, ప్రశాంతం, సహజత్వం నా స్వభావానికి అనుగుణమిది. అందుకే ఆ పాట రాసిన. దాని మీద చర్చ చేసేవాళ్ల వాదం సముద్రాన్ని కుండతో తోడే విఫల యత్నం.

**మీ గేయాన్ని చదివినపుడు ఏకకాలంలో ప్రబంధాలను దాటిన వర్ణన ఒకవైపు, భావ కవిత్వ ప్రతీకలు మరోవైపు, ఇంత వైవిధ్య బతుకు చిత్రణ ఎట్లా సాధ్యమైంది? ఉదాహరణకు వెన్నెల, వసంతం, చీకటి, వాగు, కొంగ, పిట్ట, ఎరుకలి నాగన్న గేయాలు...**

బాల్యంలో ప్రబంధాలు అలభ్యం. పంతులయ్యలు చెప్పే పాఠాలకే పరవశించి, ఒకటికి రెండు ఊహించే స్వభావం దాంతంగా నాలో పాదై ఉన్నది. ఇంటర్ జడ్చర్ల, డిగ్రీ మహబూబ్‌నగర్‌లో చదివే సమయంలో నా తీరిక సమయం అంతా దొరికినంత వరకు గ్రంథాలయంలో కృష్ణ దేవరాయలు, అల్లసాని పెద్దన వంటి ప్రబంధకవుల వ్యాఖ్యానసహితమైన రచనలు చాలా యిష్టంగా చదువుకున్నాను. ఊరును వర్ణించాలనే కుతూహలం ఈనాటిది కాదు. దానికి పాదు బాల్యంలోనే. దువ్వూరి పద్యాల కంఠస్తం వల్ల పల్లెను పాటల పల్లకిలో నిలపడం వీలైంది. కృష్ణశాస్త్రి గేయకవితల వల్లివేత చలువనే నా పాటల సొబగు. ఆముక్త మాల్యద, మృచ్ఛకటికం, హరిశ్చంద్ర, చింతామణి, కాళిదాసు అన్ని రచనలను భక్తితో తాదాత్మ్యంతో గానం చేస్తా. ఆ ఛాయ కొంత నా పాటకు అబ్బి ఉంటది. బతుకు, ఉద్యమ నేపథ్య గేయాలలో గద్దరన్న ఎంత ఆదర్శమో, ప్రకృతి పల్లె వర్ణనకు దువ్వూరి, కృష్ణదేవరాయల పద్యాలు నా మనోసీమలో రాగఝురులై అలరిస్తుంటాయి.

**ఒక్కోమారు వెంకన్న అన్నిపాయలు దాటి సూఫీలా దర్శనమిస్తాడు. ఈ సూఫీతత్వం ఎలా అబ్బింది?**

దీవి సుబ్బారావులాంటి వారి అనువాదాలు చదివాక సూఫీ పంథాలో విషయాన్ని వర్ణించే స్పృహ కలిగింది. కానీ, చిన్నప్పుడు వరిపొలాల దగ్గర, బావుల దగ్గర సూఫీ దర్గాలు, ఆకుపచ్చ జెండాలు, పీర్ల దట్టీలు, అల్లాకే నామ్ పాటలు తెలియకుండానే నాకు పల్లెల్లో అందరిని అల్లుకున్నట్టుగానే నన్ను అల్లుకున్నాయి. సూఫీ సాహిత్య పరిచయం లేకముందే సంచారమే ఎంత బాగున్నది, తెల్లారి పోతుంది హరిదాస, బాటసారిలాంటి గేయాలు రాసుకున్న. అచలం, సూఫీ, బైరాగి సంప్రదాయం, సిద్ధ సంప్రదాయం, అమనస్కం, మార్క్సిజం, బుద్ధిజం అన్నిటి భావ సమ్మిశ్రతనే నాలో కొన్ని పాటలు రాయడానికి కారణమయ్యాయి. విశ్వోద్దీన్, అహ్మదుద్దీన్ (భాస్కర్ యోగి చేసిన పరిచయం), బందే నవాజ్, అమీర్ కుస్రో, రూమీ, షంషుద్దీన్‌ల అనువాదాలంటే నాకు ఎంతో ప్రీతి.



రచయితలు దోసిలొగ్గితే సంచార కళాకారులైన హరిదాసులు, జంగమ దేవరలు, జమిడిక వాయించే బైండ్లవాళ్లు, సీత శోకాన్ని మోసుక తిరిగే బాల సంతులు కనుమరుగవుతున్నా, ఇంకా మారుమూల ప్రాంతాల్లో వెతుకులాడితే మిణుకుమిణుకుమంటూ కొడిగట్టిన దీపాలలాగ మిగిలి ఉన్నవాళ్లు, మనకు భాషా బిక్షను ఒంపుతారు. మాండలిక సొగసే రచనకు సారభూతమైన దినుసు.

**నోమ్ ఛామ్‌స్కీ భాషా సంస్కృతులులేని జాతులు అంతరిస్తాయంటాడు. ఈ నేపథ్యంలో సాంస్కృతిక దాడిని ఎదుర్కొంటున్న ప్రజల భాషకు మీ పాట... ఎలాంటి పట్టం కట్టింది?**

భావనా పటిమతో జీవద్భాషనే ఏ ప్రక్రియకైనా మౌలిక ఆలంబన. భాష భావ ప్రకటన సాధనమేకాకుండా బతుకు మూలాలను నిలిపేది కూడా. భాషను కాపాడుకోవడం అంటే మన మౌలిక స్వాభిమానాన్ని కాపాడుకున్నట్టు. నా పాటలోని భాషంతా నా ఊరునేపథ్యం-వ్యవసాయాధారిత, సేవక వృత్తుల నుండి పురుడు పోసుకున్నది. రచయితలు దోసిలొగ్గితే సంచార కళాకారులైన హరిదాసులు, జంగమదేవరలు, జమిడిక వాయించే బైండ్లవాళ్లు, సీత శోకాన్ని మోసుక తిరిగే బాల సంతులు కనుమరుగవుతున్నా, ఇంకా మారుమూల ప్రాంతాల్లో వెతుకులాడితే మిణుకుమిణుకుమంటూ కొడిగట్టిన దీపాలలాగ మిగిలి ఉన్నవాళ్లు, మనకు భాషా బిక్షను ఒంపుతారు. మాండలిక సొగసే రచనకు సారభూతమైన దినుసు.

**నేడు దేశంలో పరిస్థితులను మీరు ఎట్లా చూస్తున్నారు, ఏం రాశారు?**

దేశీయ మూలాలను తడుముతూ ఇటీవల రాసిన పాట మీరు విన్నారు. అచలం, బైరాగి, అమనస్క, సిద్ధ సంప్రదాయాల తాత్వికను ఆధ్యాత్మిక సిద్ధాంతాలను మనం సొంతం చేసుకోకపోవడం వల్ల మత ఉన్మాదాలు జడలు విప్పుతున్నాయి. నేను హిందువునే గానీ, మీ హిందువును కాను. నేను శివహిందువును. నేను హిందువునే గానీ, నేను రమణమహర్షి హిందువును. నేను హిందువునే గానీ, నేను వీర బ్రహ్మం హిందువును... అల్లమా ప్రభువు, అక్కమహాదేవి హిందువును. నేను లౌకికవాదినే గానీ, మతం పేరుతో మనుషులను తలనరికే జిహాదీలను ఆమోదించను. జలాలుద్దీన్, షంషద్దీన్, అమీర్ ఖుస్రో, గాలిబ్, బందే నవాజ్, విశ్వోద్దీన్ వంటి సూఫీ గురువుల బోధలే సహనానికి జాడలు. బౌద్ధమే విశ్వానికి జ్ఞానదీపం.

(కబీర్ సమ్మాన్ జాతీయ పురస్కారాన్ని గోరటి వెంకన్న అందుకుంటున్న సందర్భంగా)

■ పసునూరి రవీందర్

## "చిన్న పదాల్లో చిక్కనైన భావాన్ని ప్రకటించడం అలవాటు చేసుకున్నాను"

**నాలుగు దశాబ్దాల కవిత్వ ప్రయాణం తర్వాత ఇటీవల మీరు 'నివురు' (2018), 'నాలుగో పాదం' (2019) అనే రెండు సంపుటాలను తీసుకొచ్చారు. ఈ ప్రయాణంలో మీరు కవిగా చేసిన ప్రయోగాలు, మిమ్మల్ని మార్పుకి గురి చేసిన సందర్భాల గురించి చెప్పండి?**

నాలుగున్నర దశాబ్దాలకు ముందు నుంచే కవిత్వం రాస్తున్నాను. మొదట్లో పద్యం, లయాత్మక గేయం రాసేవాడిని. ఆవేశం ఆలంబనగా భావాన్ని నేరుగా వ్యక్తం చేసేవాడిని, భాష మీద ఎంతో కొంత పట్టు వల్ల అవి ప్రత్యేకత కలిగి ఉండేవి. ఆ తర్వాత జీవన పరిశీలన పెరిగి ఆలోచన పదునెక్కుతూ వచ్చింది. అధ్యయనం దానికి తోడయింది. జరుగుతున్న అన్యాయం మీద కసి ఏర్పడేది. దానికి యథాతథంగా అక్షర రూపం ఇవ్వడం ఆగ్రహ ప్రదర్శనగా ముగిసిపోయి చదివేవారికి వెగటు కలిగిస్తుంది. అందుకే ప్రతీకను, వ్యంగ్యాన్ని ఆశ్రయించాను. 1980లో నేను రాసిన 'కళ్ళు' దీర్ఘ కవితలో ఇవి బాగా ప్రతిఫలించి, రక్తికట్టించాయని విమర్శకులే అభిప్రాయపడ్డారు. బీహార్ భాగల్‌పూర్ ఖైదీల కళ్లల్లో యాసిడ్ పోసి గుడ్డివారిని చేసిన దారుణ ఘటన నేపథ్యంలో దానిని రాశాను.



నిజం ❖ పలకరింపు

మనిషి మనిషిగా సకల స్వేచ్ఛలతో, సమానత్వంతో బతకలేకపోతున్న స్థితి నానాటికీ తీవ్రమవుతున్న నేపథ్యం, ఆహార, ఆహార్యాలలో తప్ప ఆలోచనలో, మానవ సంబంధాలలో, జీవన గమనంలో ఆధునికత, మానవీయత లోపం గాఢతరమవుతున్న స్థితి, కనుపించని సంకెళ్ళు మానసికంగా బిగుసుకొని పీడిస్తున్న భయంకర వాస్తవం, సాధారణ మానవుల కాళ్ళ కింది నేల కనుమరుగవుతున్న దృశ్యం కవిత్వ రాయడం వైపు ప్రేరేపించాయి. స్థానికంగా, జాతీయంగా, అంతర్జాతీయంగా స్వప్రయోజక శక్తుల విజృంభణ- సమష్టిని కలిసి నడిచే తత్వాన్ని కేన్సర్‌లా కొరుక్కుతింటున్న దుర్గతి కలచివేసింది. దీనిని కవిత్వీకరించవలసిన అవసరాన్ని గుర్తించాను. భావం, భాషల జమిలితనమే కాకుండా వ్యక్తీకరణలో నాదంటూ ఒక ప్రత్యేకత ఉండి అది పాఠకుల్లో ఆలోచనను రేకెత్తించి ఆవేశాన్నో, ఆహ్లాదాన్నో కలిగించేదిగా ఉంటే బాగుంటుందని అనుకున్నాను. అందుకు నాకు చేతనైన రీతిలో ప్రయత్నించాను. చిన్న చిన్న పదాల్లో చిక్కనైన భావాన్ని ప్రకటించడం అలవాటు చేసుకున్నాను. అది కవిత నిడివిని తగ్గించింది, దీని వల్ల క్లిష్టత మార్మికత వంటివి వచ్చి చేరినా లోతుగా చూసి ఆలోచించే పాఠకులను ఆకట్టుకునే లక్షణం వాటికి వచ్చింది. ఇదీ ప్రయోగమే అనుకుంటాను.

**మీ కవిత్వంలో వ్యంగ్యం, తాత్వికత, కోపం, ఒకింత వేదన కనబడుతుంటాయి. అవన్నీ క్లుప్తంగా అభివ్యక్తిలో ఇముడుతాయి. దీన్ని ఎలా సాధించారు?**



దోపిడీని, దౌర్జన్యాన్ని, అత్యంత సరళంగా, సక్రమంగా సాగిపోతున్నట్టు కనిపించే సెలయేరులాంటి జీవితాలలో కనిపించకుండా లోలోపల ఉండే అసమానత, పీడనలను గమనించినప్పుడు కలిగే విషాద సముద్రపు కెరటాల నురగే వ్యంగ్యం, తాత్వికత, కోపం, వేదనలు- అవన్నీ కలిసి ఆల్చిప్పల్లో రూపొందే ముత్యాల్లాంటి కవితలకు దోహదం చేశాయి.

**భాషలో ప్రయోగాల గురించి, స్థానిక భాషల సందర్భం గురించి మీ అభిప్రాయం?**

తెలుగు భాషలో గల సౌలభ్యాన్ని ఉపయోగించుకుని కొద్దిపాటి అక్షర మార్పులతో కొత్త పదాల సృష్టిని ఒక చమత్కార ప్రయోగంగా చేపట్టాను. జర్నలిస్టుగా నా సుదీర్ఘ వృత్తి వ్యాపకంలో కూడా ఇది నాకు తోడ్పడింది. పదాలు, పర్యార పదాలు, భిన్న భావ వ్యక్తీకరణలకు తోడ్పడే పదాల మధ్య గల అక్షర నిర్మాణ సామీప్య సారూప్యాలు, బాంధవ్యాలు కొత్త పద ప్రయోగాలకు ఉపయోగపడ్డాయి. కవిత్వంలో స్థానిక భాష, యాసల పాత్ర, ప్రాధాన్యాలు చెప్పనలవికానంత గొప్పవి. వాటి నాడి తెలిసినవారు గురి తప్పకుండా లక్ష్యాన్ని ఛేదించగల విలు విద్యా ప్రవీణుల మాదిరిగా వాటిని ప్రయోగించి కవిత్వాన్ని రక్తి కట్టించగలరు.

**మిమ్మల్ని ప్రభావితం చేసిన కవులు?**

ఇక్కడ కూడా నన్ను ప్రభావితం చేసింది బహువచనమే. నేను చదివిన అనేకమంది కవుల కవిత్వంలోని మానవీయ ఆర్ద్రత, దాన్ని వ్యక్తీకరించిన తీరులోని విలక్షణత నన్ను ప్రభావితం చేశాయనుకుంటాను. ముఖ్యంగా ఇప్పటి ఆధునిక తెలుగు కవిత్వం నన్ను విశేషంగా ఆకట్టుకుంటుంది. స్త్రీ, దళిత, బహుజన, మైనారిటీ వాద కవిత్వాలు, ఏ వాదానికీ చెందని కవితలు సాగిస్తున్న అపూర్వమైన అక్షర, భావ నృత్యం పరవశం కలిగిస్తున్నది. తనలో ఇముడ్చుకొని నాలో కొత్త దారులు, ద్వారాలు తెరిపిస్తున్నది.

జరుగుతున్న అన్యాయం మీద కసి ఏర్పడేది. దానికి యథాతథంగా అక్షర రూపం ఇవ్వడం ఆగ్రహ ప్రదర్శనగా ముగిసిపోయి చదివేవారికి వెగటు కలిగిస్తుంది. అందుకే ప్రతీకను, వ్యంగ్యాన్ని ఆశ్రయించాను.



## ఊరికే జీవితమై..

నువ్వూ, నీ జీవితమూ మినహా
మనసులో మచ్చుకైనా మరేమీ లేని

అనుభవాన్ని పొందావా నువ్వు
ఇది నా ప్రతిభ, నా విజయం
ఇది నా ఆస్తి, నా కుటుంబం
ఇది నా కీర్తి, నా అనుభవం
అన్నట్లుగానే
ఇది నా జీవితం అని
ఎప్పుడైనా తలచావా

ఉత్త జీవితం
ఏమీ లేని జీవితం
ఖాళీ జీవితం
ఎప్పుడైనా తాకిందా నిన్ను

ఆకులమీంచి సంధ్యావర్ణాలు రాలిపోతున్నాయి
పిట్ట ఒకటి ఆకాశాన్ని విదిలించుకొంటూ
స్వేచ్ఛలోకి ఎగురుతూ ఉంది

ఏ అర్థమూ లేని ఉత్త ఖాళీ చప్పుడొకటి
గాలిలోంచి నీ మీదుగా నిశ్శబ్దంలో కరిగిపోతుంది

ఊరికే చూసావా జీవితాన్ని జీవితంగా
అద్దంలోకి కాక, ఉత్త అద్దాన్ని చూసినట్టు
జీవితంలోకి దూకకుండా ఉత్త జీవితాన్ని చూసావా

నిన్నేమీ అనని జీవితాన్ని
నీ తప్పు ఒప్పుల్ని పట్టించుకోని జీవితాన్ని
నీ సుఖదుఃఖాలు తాకని జీవితాన్ని
ఊరికే శ్వాసలా నిద్రలోనూ నిన్ను విడవని జీవితాన్ని
రంగూ, రుచీ, స్పర్శా, వాసనా లేని జీవితాన్ని
తలచావా
గుర్తించావా
తమకంగా కౌగలించుకొన్నావా

ఊరకనే జీవితమైపోయావా ఎప్పుడైనా

■ బివివి ప్రసాద్
90320 75415

### యానాం పొయిట్రీ ఫెస్టివల్

మార్చి 21న కవితా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీ సాహిత్య అకాడెమీ, యానాం కవిసంధ్యల ఆధ్వర్యంలో 'యానాం పొయిట్రీ ఫెస్టివల్' జరుగుతుంది. ఈ సందర్భగాఆ 'కవిత్వంలో ఇటీవలి ధోరణులు' అంశంపై ఒక రోజు సాహిత్య సదస్సు జరుగుతుంది. కె. శివారెడ్డి, విజయ్‌భాస్కర్, ఖాదర్ మొహియుద్దీన్, పాపినేని శివశంకర్, దర్భశయనం శ్రీనివాసాచార్య, జి.లక్ష్మీనరసయ్య, చల్లపల్లి స్వరూపరాణి, ప్రసేన్, ప్రసాదమూర్తి, యాకూబ్, దాట్ల దేవదానం రాజు, మధునాపంతుల, ముమ్మిడి నాగప్రసాద్ తదితరులు పాల్గొంటారు. కవి సమ్మేళనం ఉంటుంది.

కవిసంధ్య

పేరెంటచ్

# నచ్చిన రీతిలోనే..

పిల్లల్లో ఎవరికి ఎలా చదవడం ఇష్టమో అలాగే చదవాలి. ఎక్కడ చదవడం ఇష్టమో అక్కడే చదవాలి. ఉదాహరణకు కొంత మంది పిల్లలకు క్లోజ్డ్‌ప్లేస్ అంటే గదిలో చదవడం ఇష్టంగా ఉంటుంది. మరికొందరికి ఓపెన్ ప్లేస్‌లో చదవడం ఇష్టంగా ఉంటుంది. అందువల్ల పిల్లలను వారి ఇష్టానికే వదిలేయాలి.

- బయటినుంచి ఏ చిన్న శబ్దాన్ని కూడా భరించ లేని వాళ్లు, డిస్టర్బ్ అయ్యే వాళ్లు గదిలో చదవడానికే ఎక్కువ ఇష్టపడతారు. అలాంటి వారికి ఆ ఏర్పాట్లే చేయాలి.
- కొందరిని వాహనాల శబ్దం గానీ, మాటల హోరుగానీ డిస్టర్బ్ చేయలేవు. అలాంటి పిల్లలు ఓపెన్ ప్లేస్‌ను బాగా ఇష్టపడతారు. అలాంటి వాతావరణంలోనే వారికి చదివింది మెదడుకు ఎక్కుతుంది.
- ఇంటర్మీడియెట్ పిల్లలైతే, మైదానాలు పార్కుల్లో కూర్చుని చదవడాన్ని ఇష్టపడతారు. పార్కులు మరీ దూరంగా కాకుండా, ఇంటికి దగ్గరలోనే ఉంటే, ఆక్షేపించాల్సిన అవసరం లేదు. ఈ కోవకు చెందిన టెన్త్‌లోపు పిల్లలైతే, ఇంటి ఆవరణలో గానీ, టెర్రస్ పైన గానీ, చదవడానికి ఇష్టపడతారు. దాన్నేమీ తప్పు పట్టాల్సిన అవసరం లేదు.
- ఎంత ఓపెన్ ప్లేస్‌ను ఇష్టపడినా, చీకటి పడ్డాక ఇంట్లో చదవడం ఎలాగూ తప్పదనుకోండి. వీలైనంత వరకైతే వాళ్లకు ఇష్టమైన ప్రదేశాల్లో చదువుకోనివ్వాలి.
- కొంతమంది పిల్లలకు బయటికి చదవడం ఇష్టం. అలా చదవడం వల్ల అవతలి వాళ్లకు కొంత ఇబ్బంది అనిపించినా భరించాలి. అంతే తప్ప అలా చదవకూడదని మాత్రం వారించకూడదు. ఒకవేళ ఒకే ఇంట్లో పరీక్షలు రాస్తున్న వాళ్లు ఇద్దరు ఉన్నప్పుడు వారి మధ్య కొంత దూరం ఉండేలా ఏర్పాట్లు చేయాలి.
- కొందరు పిల్లలకు సంగీతం వింటూ చదవడం ఇష్టం. అలా చదవడం వల్ల వచ్చే నష్టం ఏమీ లేదు. కాకపోతే, పాటలూ, గేయాలూ కాకుండా వాద్య సంగీతం వినడం మేలు. టీవీ చూస్తూ చదవడం ఏ విధంగానూ సరికాదు.
- కొంతమంది పిల్లలు ప్రతి అరగంటకు ఒకసారి పుస్తకం మూసేసి అటూ ఇటూ తిరగాలనుకుంటారు. ఒత్తిడి నుంచి బయటపడటానికి వాళ్లకు తెలిసిన మార్గం అది. తల్లితండ్రులు దానికి అడ్డు చెప్పాల్సిన పనిలేదు.



ఫిట్‌నెస్

# ఇంటిపట్టునే వ్యాయామం!

వేసవిలో బరువు తగ్గడం తేలిక. కాబట్టి ఈ కాలాన్ని శరీరంలో పేరుకున్న కొవ్వును కరిగించుకోవడానికి ఉపయోగించుకోవాలి. ఇందుకోసం జిమ్‌కు వెళ్లలేని వారు ఇంట్లోనే కొవ్వు కరిగించే వ్యాయామాలు చేసుకోవచ్చు.

**కాంబో వర్కవుట్!**

**హై నీస్:** కాళ్ల మధ్య అడుగు దూరం ఉండేలా నిలబడాలి. మోకాళ్లను మడిచి నడుము దగ్గరకు మార్చి, మార్చి లేపుతూ ఉండాలి. ఇలా కాళ్లను లేపినప్పుడు చేతులతో మోకాళ్లను తాకుతూ ఉండాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.

**బర్పీ:** రెండు చేతులు గాల్లోకి లేపి ఎగరాలి. వెంటనే ముందుకు నేల మీద పడుకోవాలి. ఆలస్యం చేయకుండా లేచి నిలబడి మళ్లీ గాల్లోకి లేవాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.



**మౌంటెయిన్ క్లైంబ్:** చేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో మిగతా శరీరం నేలను తాకకూడదు. ఈ భంగిమలో ఉండి, పర్వతం ఎక్కుతున్నట్టుగా కాళ్లను నడుము దగ్గరకు, కిందకూ మార్చి, మార్చి కదిలించాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.

**ప్లాంక్:** మోచేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో మిగతా శరీరం నేలను తాకకూడదు. ఇలా 30 సెకండ్లు ఉండాలి. ఈ వ్యాయామాలు 3 సెట్లు చేయాలి.



ప్రయత్నం

**అవసరాలు బతుకుదెరువుకు బాటలు వేస్తాయి! ఒకరివి ఆర్థిక ఇబ్బందులైతే, మరొకరివి పిల్లల అనారోగ్యాలు. ఏదైతేనేం... కష్టం వచ్చిందని కుంగిపోకుండా అవకాశాన్ని అందిపుచ్చుకున్నారా మహిళలు! తొలి మహిళా క్యాబ్ డ్రైవర్లుగా సాటి మహిళలను గమ్యాలకు చేరవేసే విధుల్లో చేరబోతున్నారు! వీరికి చేయూతనిచ్చిన 'యోదీ' సంస్థ వ్యవస్థాపకురాలు, ఫిక్కీ (ఎఫ్ఎల్ఓ) మాజీ చైర్‌పర్సన్ జ్యోత్స్న అంగారాను, 'ఉమెన్ ఆన్ వీల్స్' (వావ్)ను 'నవ్య' కలిసింది! వారి ఆశలు, ఆశయాలు ఇలా వెల్లడయ్యాయి!**

# వారిని చూసి వావ్ అనాల్సిందే!

మహిళల భద్రత ఈ రోజుల్లో గాల్లో దీపం చందంగా మారింది. దాంతో క్యాబ్ ప్రయాణాల పట్ల కూడా మహిళల్లో కొంత అభద్రతాభావం నెలకొని ఉంటోంది. ఇలాంటప్పుడు ఒంటరి మహిళలు ఎలాంటి భయానికీ లోను కాకుండా, ప్రయాణాలు చేయాలంటే ఆ క్యాబ్ నడిపే వ్యక్తి మహిళ అయి ఉండాలి. అలాగే అలా క్యాబ్ డ్రైవింగ్‌ను వృత్తిగా ఎంచుకునే మహిళ కూడా అంతులేని మానసిక స్థయిర్యం కలిగి ఉండాలి. వృత్తిని ప్రేమించడంతో పాటు, నిబద్ధతతో పని చేయగలగాలి. ఇలా రెండు కోణాల్లో మహిళలకు తోడ్పడేలా, అవసరంలో ఉన్న మహిళలకు స్వయం స్వావలంబన కలిగించడంతో పాటు, అదే సమయంలో సాటి మహిళలకు ప్రయాణ అవసరాలు తీరేలా ఓ వినూత్న ప్రయత్నానికి పూనుకున్నారు ఫిక్కీ మాజీ అధ్యక్షురాలు, యోది సంస్థ స్థాపకురాలు జ్యోత్స్న అంగారా. అందుకోసం తన స్వీయ సంస్థ 'యోషా ధిదితి' సహాయంతో 36 మంది పేద మహిళలను ఎంపిక చేసి కారు నడపడంలో శిక్షణ ఇప్పించారు. వారికి బ్యాంకు రుణ సదుపాయంతో కార్లు ఇప్పించారు. ఆ మహిళా క్యాబ్ డ్రైవర్లలో ఆత్మస్థయిర్యాన్ని నింపి, వెన్ను తట్టి ప్రోత్సహించారు. ఈ ఆలోచన వచ్చింది మొదలు కార్యరూపం దాల్చడానికి సరిగ్గా నాలుగేళ్ల సమయం పట్టింది అంటున్నారామె. ఈ సంకల్పం వెనక ఎంతో పరిశోధన, అంతర్మథనం జరిగిందని కూడా చెప్పారు. ఆమె ఏమన్నారంటే....

**నాలుగేళ్ల శ్రమ!**

'ఉమెన్ ఆన్ వీల్స్' నా నాలుగేళ్ల కల. 2016లో ఈ ఆలోచన వచ్చినప్పుడు దీనిలో ఉన్న ఇబ్బందులు, లోటుపాట్ల గురించి పరిశోధన మొదలు పెట్టాను. గతంలో ఇలాంటి ఉద్దేశంతోనే మొదలైన 'షీ క్యాబ్స్' పలు కారణాల వల్ల విఫలమైంది. షీ క్యాబ్స్ విఫలమవడానికి దారితీసిన అంశాలను తెలుసుకొని అలాంటి వాటికి ఆస్కారం లేకుండా 'ఉమెన్ ఆన్ వీల్స్'ను రూపొందించాను. అయితే అన్నిటికన్నా పెద్ద సవాల్ ఎటువంటి ష్యూరిటీ లేకుండా కార్ల కొనుగోలుకు బ్యాంకు రుణం పొందడం. ఈ విషయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డి.జి.ఎమ్ వినీతా భట్టాచార్య మహిళ అయి ఉండడం మాకు కలిసివచ్చింది. ఆవిడ మా ప్రయత్నాన్ని ప్రోత్సహించి, రుణసదుపాయం కల్పించారు. అయితే డ్రైవింగ్ పురుషులకు పరిమితమైన రంగం. ఇదే వృత్తిలో మహిళలకు ఎదురయ్యే భిన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, వాటిని ఎదుర్కొనే నేర్పరితనం, మెలకువలు నేర్పాం. స్థయిర్యం కల్పించడం కోసం, శిక్షణకు రెండేళ్లు కేటాయించాం. శిక్షణలో భాగంగా మారుతీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్‌తో పాటు, చిన్నా చితకా రిపేర్లు, షీ టీమ్స్ సహాయంతో ఆత్మరక్షణ మెలకువలు కూడా నేర్పించాం. ఒత్తిడిని తగ్గించే యోగా, ఇంగ్లీషు, హిందీ భాషల్లో పట్టు ఏర్పడేలా కూడా శిక్షణ ఇప్పించాం. అంతే కాదు. రుణంతో అందిస్తున్న వాహనాలు కాబట్టి అప్పు తీరేవరకూ మహిళా డ్రైవర్లు వెనుకంజ వేయకుండా అదే వృత్తిలో కొనసాగగలగాలి. రోజంతా కారు నడపడంతో పాటు కుటుంబాన్నీ నడపగలగాలి. కుటుంబ తోడ్పాటు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అయినా పట్టుదలతో వృత్తి జీవితంలో నెగ్గగలగాలి. ఇలా అన్ని కోణాల్లోనూ ఆలోచించి అందుకు అవసరమైన ఏర్పాట్లు, శిక్షణ పూర్తి చేయడానికి ఇంత సమయం పట్టింది.




**సీఎన్‌జీ కార్లు!**

'ఉమెన్ ఆన్ వీల్స్' ఉపయోగించేవన్నీ మారుతి సెలేరియో సీఎన్‌జీ కార్లే. ఈ కార్లన్నీ వి6 ఇంజన్ రకానికి చెందినవి. ఒక్కో కారు ఖరీదు 5 లక్షల 25 వేలు. 2.25 లక్షల సబ్సిడీ ఇప్పించాం. కారు నడపగా వచ్చే ఆదాయం నేరుగా డ్రైవర్ బ్యాంక్ అకౌంట్‌లో క్రెడిట్ అవుతుంది. ఆ అకౌంట్ నుంచి వాయిదాల పద్ధతిలో నెల నెలా రుణం బ్యాంకుకు వెళ్లిపోతూ ఉంటుంది. కాబట్టి ఇతర క్యాబ్ సర్వీసులోలా ఆదాయం నుంచి క్యాబ్ కంపెనీకి చెల్లింపులేవీ ఉండవు. కాబట్టి ఈ మహిళల కష్టానికి తగిన ఫలం దక్కుతూ ఉంటుంది. ప్రస్తుతానికి 'ఉమెన్ ఆన్ వీల్' క్యాబ్ సేవలు పగటి వేళల్లోనే అందుబాటులో ఉంటుంది. మున్ముందు రాత్రుళ్లూ నడుస్తాయి. మరో 20 కార్లు త్వరలో రోడ్డెక్కబోతున్నాయి. మున్ముందు మహిళా 'వావ్' ఆటో డ్రైవర్లను కూడా ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



మా వారు కూడా కారు డ్రైవరే. కానీ ఆయన సంపాదనలో ఏమీ మిగల్చలేకపోతున్నారు. దాంతో ఆయన చేయలేని పని నేను చేసి చూపిస్తానని శపథం చేశాను. అందుకోసమే ఈ వృత్తిలోకి వచ్చాను. సాధారణ డ్రైవింగ్ క్లాసులు 10 రోజుల వరకే ఉంటాయి. కానీ మాకు మూడు నెలల పాటు డ్రైవింగ్‌లో శిక్షణ సాగింది కాబట్టి ఎలాంటి తడబాటు లేకుండా కారు నడపగలను. రిస్కులు, ఇబ్బందులు ప్రతి రంగంలోనూ ఉంటాయి. అలాగే డ్రైవింగ్‌లో కూడా. మరీ ముఖ్యంగా మహిళలకు ఈ రంగంలో సవాళ్లూ ఎక్కువే. అయినా నెగ్గుకురాగలననే నమ్మకం నాకు ఉంది. ఈ వృత్తిలో ఓపిక ఉన్నంత కాలం కొనసాగుతాను.

**- తిప్పన శారద,** మిర్యాలగూడ.

పేపర్‌లో యాడ్ చూడగానే, డ్రైవింగ్ నేర్చుకుని, ఉపాధి పొందవచ్చనే ఆలోచన వచ్చింది. దాంతో వెంటనే చేరిపోయాను. మా వారు ఎలక్ట్రీషియన్. పిల్లల చదువుల ఖర్చు, ఇల్లు గడవడానికి ఆయన ఆదాయం సరిపోవడం లేదు. దాంతో ఈ వృత్తి అక్కరకొస్తుందనే ఆలోచన కూడా నేను డ్రైవర్‌గా మారడానికి కారణం. డ్రైవింగ్‌తో నెలకు రూ. 10 నుంచి 15 వేలు సంపాదించవచ్చనే నమ్మకం నాకుంది.

**- మలిగిరెడ్డి సౌజన్య,** వనస్థలిపురం, హైదరాబాద్.





కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా నేను పెద్దగా చదువుకోలేకపోయాను. దాంతో చిన్న వయసులోనే పెళ్లి చేసేశారు. నాకు ముగ్గురు ఆడ పిల్లలు. పిల్లలు పుట్టిన తర్వాత ఆయన నన్ను వదిలేశారు. అప్పట్లో నా దగ్గర టాటా ఏస్ ఉండేది. దాన్ని నడపడం నేర్చుకున్నా. ఆ తర్వాత మారుతి డ్రైవింగ్ స్కూల్‌లో నాలుగేళ్ల పాటు ఉద్యోగం కూడా చేశా. అయితే ఆ ఉద్యోగంలో కష్టానికి తగిన ఫలం దక్కేది కాదు. దీనిలో మనం కారు నడిపినంత మేరకు ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ ఆలోచనతో జ్యోత్స్న గారిని కలిసి, 'ఉమెన్ ఆన్ వీల్స్'లో చేరాను. మున్ముందు పిల్లల చదువులకు నా ఆదాయం తోడ్పడితే చాలు.

**- డి.శారద,** ఓల్డ్ సిటీ, హైదరాబాద్.



మాది నిరుపేద కుటుంబం. బాబుకు గుండె జబ్బు. చికిత్స చేయించే స్తోమత లేదు. మావారు స్కూల్ బస్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు వచ్చే రూ. 12 వేల జీతంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉన్నప్పుడు, బాబుకు చికిత్స ఎలా చేయించగలం? మిగతా వృత్తుల్లో పనివేళలు ఎక్కువ. కానీ ఈ వృత్తిలో అవసరానికి తగ్గట్టు పని చేసుకోగలిగే వెసులుబాటు ఉంది. కాబట్టి బాబు చికిత్సకు డబ్బు సమకూర్చ గలను అనే నమ్మకంతో ఈ వృత్తి ఎంచుకున్నాను. కారు నడపడం పురుషులకే సొంతమైన నైపుణ్యం కాదు. 'మహిళలం కూడా అంతే సమర్థంగా కారు నడపగలం' అని కూడా నిరూపించాలనే పట్టుదల కూడా ఉంది.

**- వాకిటి ధనలక్ష్మి,** ఎల్.బి.నగర్, హైదరాబాద్.

• **గోగుమళ్ల కవిత**
ఫొటోలు: **అశోకుడు**

సూపర్ ఉమన్

# కలల్ని సాధించాలి...

**మహిళలకు పెళ్లయి పిల్లలు పుడితే... 'ఇక తమ కలలకు వాళ్లు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే' అనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. అయితే ఒక సాధారణ గృహిణి నుంచి బాడీ బిల్డర్, డీజే, ఫొటోగ్రాఫర్‌గా... ఇలా తను కన్న కలలను పట్టుదలతో పండించుకున్నారు కిరణ్ డెంబ్లా. అందుకోసం ఆమె ఏం చేశారంటే...**



"ఎందరినో ప్రేరేపించగల గొప్ప సత్తా మహిళలకు ఉందని నా గాఢాభిప్రాయం. 'పెళ్లి, పిల్లలే పరమావధిగా జీవితమంతా గడపాల్సిందేనా?' అనే ఆలోచన నన్ను నలుగురిలో 'సమ్‌థింగ్ స్పెషల్'గా నిలబెట్టింది. నేను కూడా ఒక సాధారణ గృహిణిగానే జీవితాన్ని మొదలెట్టా. ఆ తర్వాతే బాడీ బిల్డర్‌గా, డీజేగా మారా. ఫిట్‌నెస్‌కి ప్రతీకగా నన్ను నేను నిలబెట్టుకున్నా. సాధారణ గృహిణుల్లో సైతం బాడీ బిల్డింగ్ వైపు మళ్లే స్ఫూర్తిని రగిలించగలిగా. ఆసక్తి, పట్టుదల ఉండాలేగాని దేన్నైనా ఆడవాళ్లు సాధించగలరు. నేను పర్వతారోహకురాలిని కూడా. అయితే ఇప్పటి కిరణ్‌కు, పది సంవత్సరాల క్రితం కిరణ్‌కు చాలా తేడా ఉంది. ఇల్లాలిగా నాకు అప్పట్లో కుటుంబమే లోకం. అయితే రెండో బిడ్డ పుట్టిన తర్వాత తీవ్ర ఒత్తిడికి గురయ్యా. దాంతో బాగా లావయ్యా. దేనిమీద దృష్టి పెట్టలేకపోయా. అలాగే ఉంటే ఆత్మవిశ్వాసం కోల్పోతానని గ్రహించి, వెంటనే స్విమ్మింగ్ చేయడం ప్రారంభించా. ఈత వల్ల బరువు వేగంగా తగ్గుతామంటారు కానీ నా విషయంలో అది సాధ్యంకాలేదు. తర్వాత కొందరు స్నేహితులతో కలిసి యోగ చేయడం మొదలెట్టా.




ఆ సమయంలోనే జిమ్‌కి వెళ్లాలన్న ఆసక్తి పెరిగింది. జిమ్‌కి వెళ్లడంతో బరువు మెల్లగా తగ్గడం మొదలైంది. ఏడు నెలల్లో 24 కిలోలు తగ్గాను. దీంతో నాలో ఆత్మవిశ్వాసాన్ని పెరిగింది. అప్పటి నుంచి ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నా. 2013లో బుడాపెస్ట్‌లో జరిగిన 'వరల్డ్ బాడీ బిల్డింగ్ పోటీ'లో పాల్గొన్నా. అందులో పాల్గొనడానికి ఇంట్లోనే వ్యతిరేకత ఎదుర్కొన్నా. కారణం బాడీ బిల్డింగ్ ఈవెంట్‌లో పాల్గొనాలంటే బికినీ ధరించాలి. ఈ విషయంలో నా భర్తకు సర్దిచెప్పాలని చూశా కానీ ఆయన మొండిగా ఉన్నారు. అయితే నేను కూడా అంతే మొండిగా పోటీలో పాల్గొంటానని కరాఖండీగా చెప్పా. బాడీ బిల్డింగ్ చేయాలంటే నాన్‌వెజ్ తినాల్సిందే. అయితే నాన్‌వెజ్ తినడానికి వీల్లేదన్నారు ఇంట్లో వాళ్లు. కానీ నేను వారి మాటలు లెక్కచేయలేదు. ఇలాంటి ఎన్నో సవాళ్లన్నీ ఎదుర్కొని 'వరల్డ్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్'లో ఆరో స్థానంలో నిలిచా. బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొన్నందుకు నాపై సోషల్ మీడియాలో భయంకరమైన ట్రోల్స్ వచ్చాయి. వాటితో తీవ్ర మానసికవేదనకు గురైనప్పటికీ నాకు నేను ధైర్యం చెప్పుకుని గట్టిగా నిలబడ్డా. ఈ విజయాలను నేను నలభై ఏళ్ల వయసులో సాధించాను. నాకు శాస్త్రీయ సంగీతం వచ్చు. ప్రొఫెషనల్ డీజేగా కూడా పని చేశా. ఫొటోగ్రఫీలో కూడా నన్ను నేను నిరూపించుకున్నా. నేను మహిళలకు చెప్పేదొకటే... ముందుగా మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. అలాగే ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వండి. అలా చేస్తే మీ జీవితంలో మీకే తెలియనన్ని అద్భుతాలను సృష్టిస్తారు. సూపర్ ఉమన్ అవుతారు."




బ్యూటీ

# బ్లెండర్‌తో ఈజీగా...

స్పాంజిలా ఉండే బ్యూటీ బ్లెండర్ ఉపయోగిస్తే మేకప్ అదిరిపోతుంది. తక్కువ మేకప్‌తోనే ఫినిషింగ్ పర్‌ఫెక్ట్‌గా వస్తుంది.

- **తక్కువలో ఎక్కువ మెరుపు:** మేకప్ వేసుకునేటప్పుడు చేతులు, బ్రష్ వాడడం ద్వారా చాలావరకు మేకప్ ప్రొడక్ట్స్ వృథా అవుతాయి. బ్యూటీ బ్లెండర్‌తో తక్కువ ఫౌండేషన్‌తోనే ముఖానికి లుక్ తేవచ్చు. అంతేకాదు ఎయిర్ బ్రష్‌తో ఫినిషింగ్ ఎలా వస్తుందో అలా ఉంటుంది.
- **మేకప్ ఒకేలా:** ఎక్కువ మేకప్ అంటిన దగ్గర బ్యూటీ బ్లెండర్‌తో రుద్ది, అంతటా మేకప్ ఒకేలా కనిపించేలా చేయవచ్చు.
- **బ్లష్ ఫినిషింగ్:** లిక్విడ్ లేదా క్రీమ్ ఉత్పత్తులు వాడేవారికి బ్యూటీ బ్లెండర్ ఎంతో పనికొస్తుంది. ఇది సహజ ఫినిషర్‌గా పనిచేసి, చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.



విశేషం




# పక్షులు ఆత్మహత్య చేసుకుంటాయా!



వివిధ రంగుల్లో, భిన్నమైన అరుపులతో ఆహ్లాదాన్ని పంచే పక్షులు ఆత్మహత్య చేసుకోవడం గురించి విన్నారా? అసోంలోని జటింగా అనే గ్రామంలో ఏటా కొన్ని వేల పక్షులు ఆత్మహత్య చేసుకుంటున్నాయి. పక్షులు ఎక్కడైనా ఆత్మహత్య చేసుకుంటాయా? అంటే నిజమే అంటున్నారు ఆ గ్రామస్థులు. గత కొన్ని దశాబ్దాలుగా ఇలా జరుగుతోందని చెబుతున్నారు. ఏటా సెప్టెంబర్ నుంచి నవంబర్ మధ్య కాలంలోనే పక్షులు చనిపోవడం జరుగుతోంది. గౌహతికి 330 కి.మీల దూరంలో పచ్చని కొండల మధ్య ఉండే ఈ గ్రామం పక్షుల ఆత్మహత్య కథనాలతో దర్శనీయ ప్రదేశంగా మారింది.

అయితే పరిశోధకులు మాత్రం పక్షులు ఆత్మహత్య చేసుకోవడం నిజం కాదని, వాతావరణ మార్పులు, ఇతర కారణాల వల్ల అవి చనిపోతున్నాయని అంటున్నారు. సెప్టెంబర్-నవంబర్ మధ్య కాలంలో బలమైన గాలులు వీయడం వల్ల పక్షులు కింద పడి గాయాలపాలై చనిపోతున్నాయని వారు చెబుతున్నారు. అలాగే పొగమంచు ఎక్కువగా ఉండడం, గ్రామంలోని వీధి దీపాల ఆకర్షణకు గురయి పక్షులు వేగంగా వచ్చి చెట్లకు, ఇళ్లకు ఢీకొట్టి చనిపోతున్నాయని తేల్చారు. అంతేకాదు గ్రామస్థులు పెద్ద పెద్ద కర్రలతో తక్కువ ఎత్తులో ఎగిరే పక్షులను చంపడాన్ని అధికారులు గుర్తించారు కూడా. పర్యాటకులను ఆకర్షించడం కోసమే గ్రామస్థులు పక్షులను చంపుతున్న విషయం వారి దృష్టికి వచ్చింది. దాంతో వారు ఆ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అప్పటి నుంచి పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇప్పుడు అక్కడ చనిపోయే పక్షుల సంఖ్య బాగా తగ్గింది.

## సరైన నీడను గుర్తించండి



## దారి కనుక్కోండి



## ఏ భాగం ఎక్కడ?



## 5 తేడాలు గుర్తించండి




## డైలీ సుడోకు - 309

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | 5 | | 1 | 9 | |
| | | | 7 | 1 | | 8 | 5 | 3 |
| 9 | | | | | | | | |
| 8 | 4 | 2 | | | | 3 | | |
| | | | | | | | | |
| | | 9 | | | | 5 | 4 | 2 |
| | | | | | | | | 1 |
| 3 | 9 | 5 | | 7 | 6 | | | |
| | 7 | 4 | | 3 | | | | |

**సుడోకు- 308 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 9 | 7 | 2 | 4 | 1 | 6 | 3 | 5 |
| 1 | 6 | 5 | 8 | 9 | 3 | 2 | 7 | 4 |
| 3 | 2 | 4 | 7 | 5 | 6 | 9 | 1 | 8 |
| 4 | 1 | 8 | 5 | 3 | 9 | 7 | 6 | 2 |
| 5 | 3 | 9 | 6 | 2 | 7 | 4 | 8 | 1 |
| 2 | 7 | 6 | 1 | 8 | 4 | 5 | 9 | 3 |
| 6 | 5 | 2 | 9 | 1 | 8 | 3 | 4 | 7 |
| 9 | 4 | 1 | 3 | 7 | 2 | 8 | 5 | 6 |
| 7 | 8 | 3 | 4 | 6 | 5 | 1 | 2 | 9 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



*వృత్తి విద్యా కోర్సుల్లో ఎంబీఏ (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్), ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్)లది ప్రత్యేక స్థానం. రాష్ట్ర స్థాయిలో ఈ రెండు కోర్సుల్లో ప్రవేశం పొందాలంటే ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్షకు తప్పకుండా హాజరు కావాలి. 2020-21 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలు..*

# ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశానికి ఐసెట్ మార్గం

ఐసెట్-2020 నిర్వహణ బాధ్యతలను ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ తరపున తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరీక్ష ద్వారా అర్హత సాధించిన వారికి ఆంధ్రా, నాగార్జున, కృష్ణా, విక్రమసింహపురి, నన్నయ, రాయలసీమ, శ్రీవేంకటేశ్వర, శ్రీకృష్ణదేవ రాయ, జేఎన్‌టీయూ - కాకినాడ, జేఎన్‌టీయూ - అనంతపురం, అంబేద్కర్ తదితర యూనివర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీఏ (లేటరల్ ఎంట్రీ) కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.

## అర్హత

- **ఎంబీఏ:** ఏదైనా డిగ్రీ (ఓరియంటల్ లాంగ్వేజ్ కాకుండా).
- **ఎంసీఏ:** ఏదైనా డిగ్రీ. ఇంటర్మీడియెట్ / 10+2 స్థాయిలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు అయితే 45 శాతం మార్కులు ఉంటే చాలు. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంసీఏ (లేటరల్ ఎంట్రీ):** బీసీఏ లేదా డిగ్రీ (ఐటీ/సీఎస్)తోపాటు ఇంటర్ / 10+2 స్థాయిలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

### ఆన్‌లైన్‌లో పరీక్ష

ఐసెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్ష విధానంపై అవగాహనకు వెబ్‌సైట్‌లో మాక్‌టెస్ట్‌ను పొందుపరిచారు. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో 200 మార్కులకు ఉంటుంది. ఇందులో 200 ప్రశ్నలు ఇస్తారు. వీటికి 150 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. ఇందులో ఉండే విభాగాలు...

| (అనలిటికల్ ఎబిలిటీ) | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| **విభాగం-ఎ** | | |
| డేటా సఫీషియన్సీ | 20 | 20 |
| ప్రాబ్లమ్ సాల్వింగ్ | 55 | 55 |
| **విభాగం-బి** | | |
| **(మ్యాథమెటికల్ ఎబిలిటీ)** | | |
| అర్థమెటికల్ ఎబిలిటీ | 35 | 35 |
| ఆల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ | 30 | 30 |
| స్టాటిస్టికల్ ఎబిలిటీ | 10 | 10 |
| **విభాగం-సి** | | |
| **(కమ్యూనికేషన్ ఎబిలిటీ)** | | |
| వొకాబ్యులరీ | 10 | 10 |
| బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ | 10 | 10 |
| ఫంక్షనల్ గ్రామర్ | 15 | 15 |
| రీడింగ్ కాంప్రెహెన్షన్ | 15 | 15 |
| **మొత్తం** | **200** | **200** |

## సన్నద్ధత

- **అనలిటికల్ ఎబిలిటీ:** అభ్యర్థి తార్కిక, విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని అంచనా వేసేలా ఈ విభాగంలో ప్రశ్నలు ఇస్తారు. సీటింగ్ అమరిక, సీక్వెన్స్ అండ్ సిరీస్, వెన్ డయాగ్రమ్, బార్ గ్రాఫ్, పైచార్టులు, డేటా అనాలసిస్ వంటి అంశాలు ఉంటాయి. డేటా సఫీషియన్సీలో ప్రాబ్లమ్ సాల్వింగ్, సీక్వెన్స్ అండ్ సిరీస్, నెంబర్ అండ్ ఆల్ఫాబెట్, వరుసలో నంబర్ మిస్సింగ్, డేటా అనాలసిస్‌పై ప్రశ్నలు ఎదురవుతాయి. అలాగే టేబుల్స్ అండ్ గ్రాఫ్స్‌లో బార్ డయాగ్రామ్స్, పైచార్ట్, వెన్ డయాగ్రమ్, పాసేజ్, కోడింగ్ అండ్ డీకోడింగ్‌పై ప్రశ్నలు అడుగుతారు. డేట్, టైమ్, అరేంజ్‌మెంట్ విభాగంలో కేలండర్స్, క్లాక్, రక్త సంబంధాలు, వాహనం రాక-పోక, సీటింగ్ అమరిక, చిహ్నాలు వివరణ (సింబల్స్ ఇంటర్‌ప్రిటేషన్) అంశాలపై కూడా ప్రశ్నలు వస్తాయి.
- **మ్యాథమెటికల్ ఎబిలిటీ:** ఇందులో అర్థమెటికల్ ఎబిలిటీ, ఆల్జీబ్రా, జామెట్రికల్ ఎబిలిటీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు అడుగుతారు. అర్థమెటికల్ ఎబిలిటీలో లాస్ ఆఫ్ ఇండిసెస్, ఐసీఎం, జీసీడీ, ప్రాఫిట్ అండ్ లాస్, ప్రాంతం - వైశాల్యం, రేషియో అండ్ ప్రపోర్షన్, రేషనల్ నంబర్స్, పార్టనర్‌షిప్, మెన్సురేషన్, ఆర్డరింగ్, పైప్స్ అండ్ సిస్టెర్న్స్, మాడ్యులర్ అర్థమెటిక్, సంఖ్యల విభజన, పర్సంటేజ్, దూరం - పని అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఆల్జీబ్రా, జామెట్రికల్ ఎబిలిటీ నుంచి స్టేట్‌మెంట్స్, ట్రూత్ టేబుల్స్, వివిధ రూపాల్లో రేఖా సమీకరణం, పురోగమనాలు, త్రికోణమితి, బహుపద, ద్విపద సిద్ధాంతం, మాత్రికల పరిమితి, జ్యామితిపై ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి ఫ్రీక్వెన్సీ డిస్ట్రిబ్యూషన్, మీన్, మీడియన్, మోడ్, స్టాండర్డ్ డీవియేషన్, సహసంబంధం (కోరిలేషన్), ప్రాబబిలిటీ నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- **కమ్యూనికేషన్ ఎబిలిటీ:** ఈ విభాగంలో ఫంక్షనల్ గ్రామర్, వొకాబ్యులరీ, బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ, రీడింగ్ కాంప్రెహెన్షన్ నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. బేసిక్ నాలెడ్జ్‌తో మంచి స్కోరు సాధనకు అవకాశమున్న విభాగం ఇది. వొకాబ్యులరీ కోసం బేసిక్ ఇంగ్లీష్ గ్రామర్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. రోజూ కొత్త పదాలు నేర్చుకోవడం, వాటిని ఉపయోగించే విధానాన్ని ప్రాక్టీస్ చేయాలి. సందర్భోచితంగా పదాలను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ఇందుకు నిత్యం ఆంగ్ల దినపత్రికలను చదవాలి. అలాగే రోజూ నిర్ణీత సంఖ్యలో పదాలకు అర్థం తెలుసుకుని, వాటి ద్వారా వాక్యాలను రూపొందించుకుంటే తేలికగా గుర్తుంటాయి. కేవలం డిక్షనరీలో పదాలకు అర్థం తెలుసుకుంటే సరిపోదు. వాటిని ఉపయోగించుకునే తీరు చాలా ముఖ్యం. రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగంలో ప్యాసేజీల ఆధారంగా అడిగే 15 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులకు ఒక అంశాన్ని, అందులోని కీలక పదాలను, సారాంశాన్ని పసిగట్టే నేర్పు అవసరం. దీనికోసం వ్యాసాలు, ఇంగ్లీష్ స్టోరీ పుస్తకాలు చదవడం ఉపయుక్తం. ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం సినానిమ్స్, యాంటానిమ్స్, కొశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్ - ఇన్‌డైరెక్ట్ స్పీచ్ తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి. బిజినెస్ టెర్మినాలజీ కోసం దినపత్రికలలో బిజినెస్ పేజీలో వచ్చే పదాలను చదవడం మంచిది. నిత్యం వాడుకలో ఉండే వ్యాపార సంబంధిత పదాలను కూడా తెలుసుకోవాలి.

### సూచనలు

- ఐసెట్‌లో 25 శాతం మార్కుల (50 మార్కులు)ను కనీస అర్హతగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అర్హత మార్కుల విషయంలో ఎటువంటి పరిమితులు లేవు.
- ప్రణాళిక ప్రకారం చదివితే తేలిగ్గా మార్కులు సాధించొచ్చు. మౌలిక అంశాలపై సిద్ధం కావడం, మాక్ పరీక్షలు రాయడం అనే రెండు అంచెల్లో సన్నద్ధతను రూపొందించుకోవాలి.
- సెక్షన్-బి నుంచి పరీక్షకు సిద్ధం కావడం మంచిది. సెక్షన్-బిలో నేర్చుకున్న అర్థమెటిక్ సెక్షన్-ఎకు కూడా ఉపయోగపడుతుంది. అందుకే ముందుగా అర్థమెటిక్ ఎబిలిటీ చూడాలి.
- పరీక్షలో 200 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. అంటే ఒక్కో ప్రశ్నకు నిమిషం సమయం కూడా ఉండదు.
- పరీక్షకు సుమారుగా 42 రోజుల సమయం ఉంది. పట్టు ఉన్న అంశాలకు కాకుండా, అంతగా పరిజ్ఞానం లేనివాటికి ఎక్కువ సమయం కేటాయించాలి.
- ముందుగా సెక్షన్-బితో ప్రిపరేషన్ ప్రారంభించాలి. ఎందుకంటే సెక్షన్-ఎ సిలబస్ కూడా ఇందులో ఇమిడి ఉంటుంది కాబట్టి. సెక్షన్-బిలో అర్థమెటిక్, ఆల్‌జీబ్రా, జామెట్రీ, స్టాటిస్టికల్ ఎబిలిటీల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇక్కడ భావనలను అర్థం చేసుకుంటే చాలా ప్రశ్నలకు గుర్తించవచ్చు.
- సెక్షన్-బి సన్నద్ధత సెక్షన్-ఎలో పేర్కొన్న డేటా సఫిషియెన్సీకి కూడా ఉపయోగపడుతుంది. ప్రశ్నించే విధానమే భిన్నం.
- గణితేతర నేపథ్యం ఉన్నవారు సెక్షన్-బికి ఎక్కువ సమయం కేటాయించాలి.
- సాధ్యమైనన్ని ఎక్కువ నమూనా పరీక్షలను రాయాలి.

### ముఖ్య సమాచారం

- ఐసెట్ పరీక్ష తేదీ: ఏప్రిల్ 27, 2020
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2, 2020 (లేట్ ఫీజు రూ. 2,000తో ఏప్రిల్ 12 వరకు, రూ. 5,000తో ఏప్రిల్ 20 వరకు, రూ.10,000తో ఏప్రిల్ 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు)
- వెబ్‌సైట్: https://sche.ap.gov.in/ICET

# గిరిజనులకు గురుకుల విద్య



*విద్యార్థి సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తూ విద్యారంగంలో సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుతున్నాయి... గురుకులాలు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, పోటీ పరీక్షలకు శిక్షణ, క్రీడలకు ప్రాధాన్యం, వసతి, భోజనం వంటి సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నాయి. 2020-21 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను చూద్దాం..*

నవోదయ పాఠశాలలతో సమానంగా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించే ఉద్దేశంతో ఏకలవ్య స్కూల్స్‌ను ప్రారంభించారు.

### ప్రత్యేకతలు

- 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ విధానంలో ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు.
- అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది, నాణ్యమైన పరిశోధనశాలలు, లైబ్రరీలు అందుబాటులో ఉంటాయి.
- ఉచితంగా స్టడీ మెటీరియల్, రిఫరెన్స్ పుస్తకాలను అందిస్తారు.
- చదువుతోపాటు విద్యార్థుల క్రమశిక్షణకు గురుకుల కళాశాలల్లో ప్రాధాన్యం ఇస్తారు.
- ప్రతి విద్యార్థిపై వ్యక్తిగతంగా శ్రద్ధ వహిస్తారు.

### అర్హతలు

- ఏ జిల్లాకు చెందిన విద్యార్థులు ఆ జిల్లాలోని పాఠశాలలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- 2019-20 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షకు మించకూడదు.

### 28 పాఠశాలలు

ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా మొత్తం 28 పాఠశాలలలో ప్రవేశం కల్పిస్తారు. ఇవి ఉన్న జిల్లాలు - ప్రదేశాలు శ్రీకాకుళం: భామిని, మెళియపుట్టి; విశాఖపట్నం: జీకే వీధి, డుంబ్రిగూడ - అరకు, ముంచింగ్‌పుట్ - పెద్దబయలు, చింతపల్లి, పెద్దబయలు, అనంతగిరి, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, కొయ్యూరు, అరకు; విజయనగరం: అనసభద్ర - వైఎస్ వలస, కోటికపెంట - సరాయ్ వలస, జీఎల్ పురం, కురుపమ్; తూర్పు గోదావరి: వై.రామవరం, మారేడుపల్లి, రాజవొమ్మంగి, చింతూరు, ఆర్.సి.పురం, అడ్డతీగల; నెల్లూరు: కొడవలూరు, ఓజిలి; పశ్చిమ గోదావరి: బుట్టాయిగూడెం; ప్రకాశం: డోర్నాల; చిత్తూరు: బి.ఎన్. కండ్రిగ.

### సీట్ల కేటాయింపు ఇలా

మొత్తం సీట్లలో 70 శాతం సీట్లను ఎస్టీ విద్యార్థులకు కేటాయిస్తారు. అంటే 60లో 42 సీట్లు. ఇందులో బాలురకు 21, బాలికలకు 21 సీట్లు ఉంటాయి. 20 సీట్లను క్రీడా కోటా కింద ఎస్టీ విద్యార్థులకు రిజర్వ్ చేస్తారు. ఇందుకు నిబంధనల కనుగుణంగా విద్యార్థి లేదా సదరు విద్యార్థి తల్లిదండ్రుల్లో ఒకరు నిర్దేశించిన క్రీడాంశాల్లో ఏదైనా పతకం గెలుచుకోవడం / పాల్గొని ఉండాలి. మిగిలిన 10 శాతం సీట్లు నాన్ ఎస్టీ కోటా కింద ఉంటాయి. ఇందులో ఎస్సీలకు 2, బీసీలకు 2, ఓసీలకు 2 సీట్లలో అవకాశం కల్పిస్తారు.

### రాత పరీక్షతో ప్రవేశం

రాత పరీక్ష ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఐదో తరగతి సిలబస్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో ఖాళీలు, ఒక వాక్య సమాధానాలు, మ్యాచింగ్ రూపంలో 100 ప్రశ్నలు ఇస్తారు. వీటికి రెండున్నర గంటల్లో సమాధానాలను రాయాలి. పరీక్షలో అడిగే సబ్జెక్టులు.. తెలుగు (మార్కులు 20, ఒక వాక్య ప్రశ్నలు - 10, ఖాళీలు - 10), ఇంగ్లిష్ (మార్కులు 20, ఒక వాక్య ప్రశ్నలు - 10, ఖాళీలు - 10), మ్యాథ్స్ (మార్కులు 30, ఒక వాక్య ప్రశ్నలు - 10, ఖాళీలు - 10, మ్యాచింగ్ - 10), ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ (మార్కులు 30, ఒక వాక్య ప్రశ్నలు - 10, ఖాళీలు - 10, మ్యాచింగ్ - 10).

### కనీస అర్హత మార్కులు

రాత పరీక్షలో కనీస అర్హత మార్కులను నిర్ణయించారు. దీని ప్రకారం పీవీటీజీ కేటగిరీలో విద్యార్థులు 25 మార్కులు, జనరల్ ఎస్టీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ విద్యార్థులు 40 మార్కులు, బీసీ విద్యార్థులు 45 మార్కులు, ఓసీ విద్యార్థులు 50 మార్కులు సాధించాలి.

### ముఖ్య సమాచారం

- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 24, 2020.
- రాత పరీక్ష తేదీ: మార్చి 29, 2020.
- వెబ్‌సైట్: aptwgurukulam.ap.gov.in.

# కరోనా కాటు కారణంగా...

కరోనా ప్రభావం భారతీయ చిత్రసీమపై బలంగా పడింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లోని థియేటర్లను మూసివేయగా, ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైన సినిమాలు వాయిదా పడ్డాయి. తాజాగా షూటింగులూ బంద్ చేయాలని తెలుగు చిత్ర పరిశ్రమ నిర్ణయం తీసుకుంది. కరోనా కాటు కారణంగా... పరిశ్రమలో 24 శాఖల్లో పనిచేస్తున్న అందరి ఆరోగ్యాన్ని, భద్రతను దృష్టిలో పెట్టుకుని పలు చర్యలు చేపడుతున్నారు. కొందరు హీరోలు పుట్టినరోజు వేడుకలను రద్దు చేసుకున్నారు. ఆఖరికి, సినిమా కబుర్లనూ చెప్పడం లేదు.


సి. కల్యాణ్, ప్రసన్నకుమార్, జీవిత, కొమర వెంకటేశ్, నారాయణదాస్ నారంగ్, బెనర్జీ, దామోదరప్రసాద్, ఠాగూర్ మధు

## షూటింగులు బంద్!

"థియేటర్లు బంద్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మేం స్వాగతిస్తున్నాం. థియేటర్లతో పాటు షూటింగులనూ బంద్ చేయాలని మేం నిర్ణయం తీసుకున్నాం. ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న చిత్రీకరణలు ఒక్కొక్కటిగా ఆగిపోతున్నాయి. అభ్యంతరం లేని ప్రాంతాల్లో షూటింగులు జరుగుతున్నాయి" అని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు సి. కల్యాణ్ తెలిపారు. తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) ఆదివారం సాయంత్రం ఫిల్మ్ ఛాంబర్‌లో సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. అందులో కరోనా కారణంగా సోమవారం నుండి ఈ నెల 21 వరకూ షూటింగులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపాయి. అయితే... చిత్రసీమ ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందే చిరంజీవి స్పందించారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్న 'ఆచార్య' చిత్రీకరణను వాయిదా వేస్తున్నట్లు శనివారం రాత్రి చిరంజీవి ప్రకటించారు. ఇక, ఆదివారం జరిగిన సమావేశంలో "కరోనా కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. దీనికి అందరూ సహకరిస్తున్నారు. స్వాగతిస్తున్నారు" అని వాణిజ్య మండలి అధ్యక్షుడు నారాయణ దాస్ నారంగ్ అన్నారు. "ఈ నెల 21 వరకూ థియేటర్లు మూసివేసి ఉంటాయి. తర్వాత 31వరకూ బంద్ కొనసాగుతుంది" అని వాణిజ్య మండలి కార్యదర్శి దామోదర ప్రసాద్ అన్నారు. "ఎంతోమంది ప్రాణాలతో ముడిపడిన సమస్య కావడంతో చిత్రీకరణలు ఆపాలని నిర్ణయం తీసుకున్నాం" అని నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి టి. ప్రసన్నకుమార్ అన్నారు. "సామాజిక బాధ్యతతో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమిది. మేమంతా సమర్థిస్తున్నాం. విదేశాల్లో చిత్రీకరణలు చేస్తున్న వారూ ప్యాకప్ చేసుకుని తిరిగి వస్తున్నారు" అని 'మా' కార్యదర్శి జీవితా రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో 'మా' యాక్టింగ్ ప్రెసిడెంట్ బెనర్జీ, నిర్మాతలు నట్టి కుమార్, 'ఠాగూర్' మధు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి బయటకు రాలేదు!



ముంబయ్‌లోని అమితాబ్ బచ్చన్ స్వగృహం 'జల్సా' ముందు ప్రతి ఆదివారం అభిమానుల సందడితో కోలాహలంగా ఉంటుంది. బిగ్ బి దర్శనం కోసం వచ్చే ప్రేక్షకులతో ఆ రోడ్డంతా కిటకిటలాడుతుంది. అయితే... అభిమానులు, ప్రేక్షకులను ఇంటికి రావొద్దని ఆదివారం ఉదయం ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన కూడా ఇంటి బయటకు రాలేదు. "అభిమానులు, శ్రేయోభిలాషులు అందరికీ ఒక రిక్వెస్ట్. ప్లీజ్... ఈ రోజు 'జల్సా' గేట్ దగ్గరకు రావొద్దు. నేనూ రావడం లేదు. తగు జాగ్రత్తలు తీసుకోండి. సేఫ్‌గా ఉండండి" అని అమితాబ్ ట్వీట్ చేశారు. అందులో ఎక్కడా కరోనా గురించి ఆయన ప్రస్తావించనప్పటికీ... ఈ వైరస్ కారణంగా ఇంటి బయటకు రాలేదని తెలుస్తోంది. అభిమానులు పెద్ద సంఖ్యలో గుమిగూడటం ఇష్టం లేక ఈ నిర్ణయం తీసుకున్నారని ముంబయ్ టాక్.

## పుట్టినరోజు వేడుకలు వద్దు

**- పునీత్ రాజ్‌కుమార్**



కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ తనయుడు, హీరో పునీత్ రాజ్‌కుమార్ అభిమానులు ప్రతి ఏడాది మార్చి 17 వస్తే... సంబరాల్లో మునుగుతారు. తమ అభిమాన కథానాయకుడి పుట్టినరోజును వేడుకలా జరుపుతారు. అతణ్ణి నేరుగా కలిసి శుభాకాంక్షలు చెప్పడానికి కర్ణాటకలో వివిధ ప్రాంతల నుండి బెంగళూరు తరలి వస్తారు. కరోనా వైరస్ రోజు రోజుకీ విజృంభిస్తున్న నేపథ్యంలో అభిమానులకు పునీత్ వీడియో ద్వారా ఒక విజ్ఞప్తి చేశారు. "ప్రస్తుతం ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. మీలో ఎవరూ ఆరోగ్యాన్ని పణంగా పెట్టాలని నేను కోరుకోవడం లేదు. ఈ ఏడాది నేను పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం లేదు. రాష్ట్రం నలుమూలల నుండి పుట్టినరోజు వేడుకల కోసం మీరు బెంగుళూరు రావొద్దు. భారీ సమావేశాలు నిర్వహించకూడదనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవిద్దాం. మీ ప్రేమ, అభిమానాలకు నేను కృతజ్ఞుణ్ణి" అని పునీత్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

## చెబుదామనుకున్నాం కానీ...


అడివి శేష్

మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జయంతి మార్చి 15న. ముంబయ్ 26/11 ఉగ్రదాడిలో ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడిన ఆయన జీవిత కథతో తెలుగు, హిందీ భాషల్లో 'మేజర్' చిత్రం తెరకెక్కుతోంది. అడివి శేష్ హీరోగా నటిస్తున్నారు. ఆదివారం సందీప్ ఉన్నికృష్ణన్ జయంతి సందర్భంగా 'మేజర్' చిత్రానికి సంబంధించిన ముఖ్యమైన విషయాన్ని ప్రేక్షకులతో పంచుకోవాలనుకున్నామనీ, కొవిడ్-19 (కరోనా) తమ ప్రణాళికలను దెబ్బ తీసిందని అడివి శేష్ ట్వీట్ చేశారు. "మా చిత్ర బృందానికి, దేశానికి ఈ రోజు ఎంతో ముఖ్యమైన రోజు. మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవితం, ఆయన చేసిన త్యాగాలు నాకు ఎన్నో విషయాలు నేర్పించాయి. నాలో స్ఫూర్తి నింపాయి. కరోనా కారణంగా ఈ రోజు మేం అనుకున్న అనౌన్స్‌మెంట్ చేయలేకపోతున్నాం. జాగ్రత్తగా ఇంట్లో ఉండండి. సందీప్ ఉన్నికృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన్ను మరోసారి గుర్తు చేసుకుందాం. సైనికుల త్యాగలను ఎప్పటికీ మరువకండి" అని అడివి శేష్ ట్వీట్ చేశారు. శశికిరణ్ తిక్కా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

## కరోనా ప్యార్ హై!

ప్రపంచవ్యాప్తంగా ఎటు చూసినా కరోనా గురించే చర్చ. ఈ నేపథ్యంలో కరోనాపై సినిమాలు తీయడానికి కొందరు నిర్మాతలు సిద్ధమవుతున్నారు. ప్రముఖ హిందీ నిర్మాణ సంస్థ ఈరోస్ ఇంటర్నేషనల్ 'కరోనా ప్యార్ హై' టైటిల్ రిజిస్టర్ చేయించింది. గతంలో హృతిక్ రోషన్ హీరోగా 'కహో నా ప్యార్ హై' సినిమా వచ్చింది. ఆ టైటిల్‌కి దగ్గరగా ఈ టైటిల్ ఉండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. 'కరోనా ప్యార్ హై' సినిమా గురించి నిర్మాత క్రిషికా లుల్లా మాట్లాడుతూ "ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఇదొక ప్రేమకథా చిత్రం. కథకు తుది మెరుగులు దిద్దిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తాం. పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత చిత్రాన్ని ప్రారంభించి, వేగంగా పూర్తి చేస్తాం" అన్నారు. కన్నడ నిర్మాత ఉమేశ్ 'కరోనా' టైటిల్ రిజిస్టర్ చేయించారు. ఆ చిత్రాన్ని హిందీలో 'డెడ్లీ కరోనా'గా విడుదల చేస్తామని తెలిపారు.

## మాల్దీవుల్లో...


హన్సిక

విదేశాలు వెళ్లడానికి ప్రజలందరూ జంకుతున్నారు. సినిమా తారల సంగతి అయితే చెప్పనవసరం లేదు. కరోనా కారణంగా విదేశాల్లో తమ సినిమా చిత్రీకరణలు, పర్యటనలను వాయిదా వేసుకున్న వారు ఎందరో! హన్సిక మాత్రం ధైర్యంగా విదేశాలకు వెళ్లారు. ప్రస్తుతం మాల్దీవుల్లో ఉన్నారామె. అక్కడ సముద్ర తీరంలో సేద తీరుతున్నారు. ఆమెతో పాటు సోదరుడు ప్రశాంత్, మోనా కూడా వెళ్లారు. ప్రతి ఏడాది తల్లి, సోదరుడితో కలిసి కనీసం ఒకసారైనా విదేశ పర్యటనకు వెళ్లడం హన్సికకు అలవాటు. ప్రస్తుతం చిత్రీకరణలకు చాలామంది సెలవులు ప్రకటించడంతో మాల్దీవులు వెళ్లినట్టు ఉన్నారు.

## అలెగ్జాండర్.. ఒక్కడే నటుడు


జయప్రకాశ్ రెడ్డి

జయప్రకాశ్ రెడ్డి కీలక పాత్ర పోషించి, నిర్మించిన చిత్రం 'అలెగ్జాండర్'. ధవళ సత్యం దర్శకత్వం వహించారు. ప్రయోగాత్మకంగా తెరకెక్కించిన ఈ చిత్రంలో జయప్రకాశ్ రెడ్డి ఒక్కరే పాత్రధారి కావడం విశేషం. ఆయన మాట్లాడుతూ "ఒకే పాత్రతో ప్రయోగం చేయాలనుందని రచయిత పూసలకు చెబితే ఆయన చక్కని కథ ఇచ్చారు. 100 నిమిషాల నిడివి గల ఈ కథతో తెలుగు రాష్ట్రాల్లో 66 నాటక ప్రదర్శనలు ఇచ్చాను. ఆ కథతోనే 'అలెగ్జాండర్' సినిమా తీశా. రిటైర్డ్ మేజర్ ఒక హెల్ప్‌లైన్ ద్వారా కొందరి సమస్యలను ఎలా తీర్చాడన్నది ఈ సినిమా ఇతివృత్తం. ధవళ సత్యం కథను మలిచిన విధానం బావుంది. క్యారెక్టర్ ఆర్టిస్ట్ నటించిన సినిమా ప్రేక్షకులకు చేరువ కావడం ఎంత కష్టమో నాకు తెలుసు. అందుకే ఓటీటీ ప్లాట్‌ఫామ్ ద్వారా సినిమా విడుదల చేయాలనుకుంటున్నా" అని అన్నారు.



## సరైనోడు దొరికితే...



"ఈ క్షణంలో జీవిద్దాం, సోషల్ మీడియాలో కాదు! ఈ క్షణంలో జీవించడాన్నే నేనే నమ్ముతా" అన్నారు కాజల్ అగర్వాల్. ప్రస్తుతం సమాజంలో సెల్ఫీలు తీసుకోవడం, సోషల్ మీడియాలో ఏదో ఒకటి స్టేటస్ అప్‌డేట్ చేయడం చాలామందికి అలవాటుగా మారిందని ఆమె అభిప్రాయపడ్డారు. 'ఒకవేళ సమాజంలో ఏదో ఒక అంశాన్ని మార్చే అవకాశం మీకు వస్తే, దేన్ని మారుస్తారు?' అని కాజల్‌ను ప్రశ్నించగా, "సెల్ఫీలు, స్టేటస్ అప్‌డేట్స్ అలవాట్లను మారుస్తా. సోషల్ మీడియాలో కాదు, ఈ క్షణంలో జీవిద్దాం" అని సమాధానం ఇచ్చారు. అలాగే, పెళ్లి గురించీ మాట్లాడారు. "వివాహ వ్యవస్థపై నాకు నమ్మకం ఉంది. గౌరవిస్తా. నాకు నా మిస్టర్ రైట్ (సరైనోడు) దొరికితే తప్పకుండా పెళ్లి చేసుకుంటా" అని కాజల్ తెలిపారు. ఆరు దాటిన తర్వాత సినిమాలు, చిత్రీకరణల గురించి అసలు ఆలోచించననీ, సినిమా చిత్రీకరణ చేసేటప్పుడు మిగతా విషయాలను పట్టించుకోననీ, దృష్టంతా నటన మీద లగ్నం చేస్తానని ఆమె అన్నారు.


అనూప్‌రూబెన్స్, రాధామోహన్, సునీల్ రావు, రాజ్‌తరుణ్, విజయ్‌కుమార్

## నాన్‌స్టాప్‌గా నవ్వులే

**- విజయ్‌కుమార్ కొండ**

రాజ్ తరుణ్, మాళవిక నాయర్, హెబ్బా పటేల్ నటించిన చిత్రం 'ఒరేయ్ బుజ్జిగా'. విజయ్‌కుమార్ కొండ దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. శనివారం రాత్రి కరీంనగర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. మేయర్ సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై బిగ్ సీడీని ఆవిష్కరించారు. నిర్మాత మాట్లాడుతూ "పూర్తి వినోదాత్మక చిత్రమిది. ఉగాది సందర్భంగా ఈ నెల 25న విడుదల చేయాలనుకున్నాం. కరోనా ప్రభావం, ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 21 వరకూ థియేటర్లు మూసివేయడం వల్ల విడుదల ఆగింది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని తెలిపారు. "చక్కని కుటుంబ కథాంశంతో రూపొందిన ఈ చిత్రం రెండున్నర గంటలపాటు పడిపడి నవ్వేలా చేస్తుంది" అని రాజ్ తరుణ్ అన్నారు. "ప్రేక్షకుల్ని నాన్‌స్టాప్‌గా నవ్వించడానికే ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ సినిమా తీశాం. మా అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుంది" అని దర్శకుడు చెప్పారు. "గుండెజారి గల్లంతయ్యిందే', 'ఒక లైలా కోసం' తర్వాత విజయ్‌తో పని చేసిన మూడో సినిమా ఇది. మా ఇద్దరికీ హ్యాట్రిక్ అవుతుందనే నమ్మకం ఉంది" అని సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ తెలిపారు.

## 'రఘుపతి వెంకయ్య నాయుడు ఫిల్మ్‌నగర్'గా మార్చాలి!

తెలుగు సినిమా పరిశ్రమ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన రఘుపతి వెంకయ్యనాయుడు పేరును ఫిల్మ్‌నగర్ పేరుకు జతపరచి 'రఘుపతి వెంకయ్య నాయుడు ఫిల్మ్ నగర్'గా మార్చాలని రఘుపతి వెంకయ్య అకాడమీ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం రఘుపతి వెంకయ్య 79వ వర్ధంతి సందర్భంగా ఫిల్‌ఛాంబర్ ఎదురుగా ఉన్న రఘుపతి వెంకయ్య విగ్రహానికి పలువురు సినీ ప్రముఖులు నివాళి అర్పించారు. " ప్రతి సంవత్సరం మార్చి 15న రఘుపతి వెంకయ్య వర్ధంతిని, అక్టోబర్ 15న జయంతిని ఘనంగా జరుపుతామని కమిటీ సభ్యులు తెలిపారు. "రఘుపతి వెంకయ్య విగ్రహాన్ని బాగుపరిచి ఫెన్సింగ్, గొడుగు, నిచ్చెన వంటి ఏర్పాట్లు చేస్తామని మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అకాడమీ నూతన కమిటీ సభ్యులు అధ్యక్షుడు యన్.గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి జె.వి.మోహన్ గౌడ్,తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చెమటలు పట్టాల్సిందే!

**- కియారా అడ్వాణీ**

ఓర్పు, సహనం, నిజాయతీ నటికి చాలా అవసరం అంటున్నారు కియారా అడ్వాణీ. 'భరత్ అనే నేను', వినయ విధేయ రామ' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నాయిక ఈమె. ప్రస్తుతం బాలీవుడ్‌లో 'లక్ష్మీ బాంబ్', 'ఇందూ కీ జవానీ', 'షేర్షా', 'భూల్ భూలయ్యా2' చిత్రాలతో బిజీగా ఉన్నారు. విమర్శలపై మీరెలా స్పందిస్తారు అన్న ప్రశ్నకు కియారా ఇలా సమాధానమిచ్చారు. "మనం చేసే పని మనతోపాటు మనల్ని అభిమానించే వాళ్లకూ నచ్చాలి. నచ్చని సమయంలో విమర్శలు ఎదురవుతాయి. అందరి అభిరుచులు ఒకేలా ఉండవు కదా! పొగిడినా, తిట్టినా నేను పట్టించుకోను. చేసే పని నిజాయతీగా చేసుకుపోతా. పరిశ్రమలో అడుగుపెట్టాక ఓర్పు బాగా పెరిగింది. ఒక్క విషయంలో మాత్రం కోపం కట్టలు తెంచుకుంటుంది. నా అసలు పేరు అలియా అడ్వాణీ. సినిమాల్లోకి వచ్చాక కియారా అడ్వాణీగా మార్చుకున్నా. కానీ కొందరు 'కైరా' అని పిలుస్తున్నారు. ఆ పిలుపు వింటే విపరీతమైన కోపం వస్తుంది. అలా పిలిచిన వాళ్లు నా ఎదుట ఉండే నా ఉగ్రరూపానికి వారికి చెమటలు పట్టాల్సిందే. నా స్నేహితులు మాత్రం కోపం తెప్పించడానికైనా 'కైరా' అని పిలుస్తారు" అని కియారా తెలిపారు.


ఊర్వశీ రౌతెల

## భానుప్రియ... వర్జిన్!

టైటిల్ చూసి తప్పుగా అర్థం చేసుకోవద్దని, ఇదొక వినోదాత్మక చిత్రమని 'వర్జిన్ భానుప్రియ' బృందం చెబుతోంది. ఈ హిందీ చిత్రంలో ఊర్వశీ రౌతెల ప్రధాన పాత్రధారి. కాలేజీకి వెళ్లే అమ్మాయిగా, వెండితెరపై ఆమె భానుప్రియగా కనిపించనున్నారు. జూన్ 12న చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు నిర్మాత స్పష్టం చేశారు. "ఈ రోజుల్లో వర్జినిటీ కోల్పోడం చాలా సులభమని భావించే సంప్రదాయబద్ధమైన అమ్మాయి, ఎన్నిసార్లు ఆ ప్రయత్నం చేసి విఫలమైందనేది వినోదాత్మకంగా చెప్పాం. చివరకు, ఆ అమ్మాయి విజయం సాధించిందా? లేదా? అనేది చిత్రకథ" అని దర్శకుడు అజయ్ లోహన్ పేర్కొన్నారు.

## పాత్రలన్నీ కల్పితమే!


మేఘన

పవన్ తేజ్ కొణిదెల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఈ కథలో పాత్రలు కల్పితం'. మేఘన, లక్కీ నాయికలు. అభిరామ్ ఎం. దర్శకుడు. మాధవి సమర్పణలో రాజేశ్ నాయుడు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "వినోదాత్మకంగా సాగే థ్రిల్లర్ సినిమా ఇది. చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. మాటలు, పాటలు, కెమెరా పనితనం సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. చివరి షెడ్యూల్, నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసి విడుదల తేదీని ప్రకటిస్తాం. త్వరలో టీజర్, పాటలను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు.

## 20 శాతం తగ్గిన సౌదీ అరామ్కో లాభం

రియాద్: సౌదీ అరామ్కో నికర లాభం 2019 సంవత్సరంలో 20.6 శాతం తగ్గింది. ముడిచమురు ధరలు తక్కువ స్థాయిలో ఉండటం, ఉత్పత్తి తగ్గడమే ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. గత డిసెంబరులో సౌదీ అరామ్కో తొలి పబ్లిక్ ఇష్యూకు వచ్చిన విషయం తెలిసిందే. ఇష్యూ తర్వాత మొదటిసారిగా కంపెనీ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. 2018లో కంపెనీ నికర లాభం 11,110 కోట్ల డాలర్లు ఉండగా.. 2019 నాటికి 8,820 కోట్ల డాలర్లకు తగ్గిపోయింది. ముడి చమురు ధరల్లో క్షీణత, ఉత్పత్తిలో తగ్గుదల, రిఫైనింగ్, కెమికల్ మార్జిన్లలో క్షీణత వంటివి లాభాలు తగ్గడానికి కారణమైనట్టు వివరించింది. 2019 సంవత్సరానికి 7,320 కోట్ల డాలర్ల డివిడెండ్లను పంపిణీ చేయనున్నట్టు పేర్కొంది. ఈ ఏడాది నుంచి వచ్చే ఐదేళ్ల కాలానికి కనీసం 7,500 కోట్ల డాలర్ల డివిడెండ్లను అందించనున్నట్టు తెలిపింది. 2018లో కంపెనీ మూలధన వ్యయం 3,510 కోట్ల డాలర్లు ఉండగా.. 2019 సంవత్సరంలో 3,280 కోట్ల డాలర్లకు తగ్గింది.




## తిరోగమన బాటలో అమెరికా, యూరప్

### ప్రపంచానికీ ముప్పు తప్పదు
### కోవిడ్-19 ప్రభావంపై ఆర్థికవేత్తల అంచనా

న్యూఢిల్లీ : కరోనా వైరస్ (కోవిడ్-19) ప్రభావం వల్ల అమెరికా, యూరోపియన్ యూనియన్ ఆర్థిక వ్యవస్థలు తిరోగమనంలో పడడం ఖాయమని జేపీ మోర్గాన్ అంచనా వేసింది. అదే జరిగితే ప్రపంచ ఆర్థిక రంగం యావత్తు మరిన్ని కష్టాల్లో పడే ప్రమాదం వెంటాడవచ్చు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బ్రెగ్జిట్ వంటి పరిణామాల వల్ల ఇప్పటికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రతికూలతలు ఎదుర్కొంటోంది. ఈ లోగా తాజాగా ప్రపంచాన్ని చుట్టుముడుతున్న కోవిడ్-19 మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టింది. ఈ మహమ్మారి వ్యాప్తిని అదుపు చేయడంలో భాగంగా షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లు, జనం అధిక సంఖ్యలో పాల్గొనే వేడుకలు, సమావేశాలు వంటివి ప్రపంచంలో పలు దేశాలు తాత్కాలికంగా నిషేధించడంతో ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ప్రారంభంలో దీన్ని అరికట్టడం తేలికే అనిపించినా గత కొద్ది వారాలుగా వైరస్ త్వరితగతిన వ్యాపిస్తూ పలు దేశాలను చుట్టుముట్టడం అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను ఆటుపోట్లకు గురి చేస్తోంది. కోవిడ్-19 ప్రభావం వల్ల స్టాక్ మార్కెట్లలో గత దశాబ్ది కాలంలో కనీవినీ ఎరుగని స్థాయిలో అమ్మకాలు సాగుతున్నాయని జేపీ మోర్గాన్ ఆర్థికవేత్తలు తాజా నివేదికలో పేర్కొన్నారు. దీని ప్రభావం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 2 శాతం, రెండో త్రైమాసికంలో 3 శాతం దిగజారవచ్చునని, అదే సమయంలో యూరోపియన్ యూనియన్ ఆర్థిక వ్యవస్థల వృద్ధి రేటు 1.8 శాతం, 3.3 శాతం దిగజారే ప్రమాదం ఉన్నదని వారు అంచనా వేశారు.

ఆర్థికవేత్తల నిర్వచనం ప్రకారం వరుసగా రెండు త్రైమాసికాలు జీడీపీ ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తే టెక్నికల్‌గా అది తిరోగమన దశ అవుతుంది. కాగా ప్రపంచ దేశాలు సమన్వయపూర్వకంగా, సుసంఘటితంగా నిలిచి ఆర్థిక కార్యకలాపాలను పునరుజ్జీవింపచేసే అవకాశాలు కూడా అంతగా కనిపించకపోవడం పరిస్థితిని తీవ్రతరం చేస్తోందన్నారు. దీనికి తోడు ఆర్థిక మార్కెట్లలో ధరల్లో ఏర్పడిన భారీ క్షీణత కూడా తిరోగమనానికి కారణం కావడంతో పాటు పలు కంపెనీల క్రెడిట్ నాణ్యత దెబ్బతింటుందని వారు హెచ్చరించారు. కోవిడ్-19 ప్రభావానికి తీవ్రంగా గురైన రంగాలకు ఉద్దీపనలు అందించడం, కేంద్రీయ బ్యాంకులు ద్రవ్యపరమైన చర్యలతో దీన్ని దీటుగా ఎదుర్కొనే దిశగా ప్రపంచం అడుగేయాలని కూడా వారు సూచించారు. కాగా 1835 నుంచి ఏర్పడిన ప్రతీ ఒక్క బేర్ మార్కెట్ మూడు ప్రమాద సూచీలను ఇచ్చాయని, ఈ కరోనా వైరస్ వల్ల ఏర్పడిన పరిస్థితి కూడా దానికి భిన్నంగా ఏమీ లేదని గోల్డ్‌మాన్ శాక్స్ ఆర్థికవేత్తలు అంటున్నారు.

## అప్లయెన్సెస్ పరిశ్రమకు కష్టమే..



### చైనా విడిభాగాల సరఫరా పెరగకపోతే ఉత్పత్తికి దెబ్బ
### ఉత్పత్తుల ధరలు పెంచుతున్న కంపెనీలు

న్యూఢిల్లీ: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చైనాలో ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఇప్పుడిప్పుడే కొన్ని ఫ్యాక్టరీలు తెరుచుకుంటున్నాయి. అయినా ఉత్పత్తి పుంజుకోవడం లేదు. భారత్‌లోని అనేక పరిశ్రమలు చైనా నుంచి దిగుమతి అయ్యే విడిభాగాలతో ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వీటి సరఫరా ఆశించిన స్థాయిలో పెరగకపోతే పరిశ్రమకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ముఖ్యంగా అప్లయెన్సెస్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ రాబడులపై దెబ్బపడుతుందని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఉత్పత్తుల తయారీపై ప్రభావం పడుతోంది. మరోవైపు వేసవి వచ్చినందు వల్ల ఈ కాలంలో వినియోగించే ఎయిర్ కండీషనర్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లకు డిమాండ్ పెరుగుతోంది. వీటి నిల్వలు తక్కువగా ఉన్నందు వల్ల కొన్ని కంపెనీలు ధరలు పెంచడం మొదలుపెట్టాయి. సప్లయ్ సంబంధిత అవరోధాలను దృష్టిలో ఉంచుకునే కంపెనీలు ధరలను సవరిస్తున్నాయని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లయెన్సెస్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సీమా) చెబుతోంది. చైనాలో ఫ్యాక్టరీల కార్యకలాపాలు ప్రారంభమైనా సగం వరకు ఉత్పత్తి సామర్థ్యంతోనే అవి పని చేస్తున్నాయని సీమా అంటోంది. ముడిసరుకుల లభ్యత ఏప్రిల్ వరకు పుంజుకోకపోతే పరిశ్రమ రెడ్‌జోన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని చెబుతోంది. కరోనా వైరస్ దాడి కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, చైనా దిగుమతులపై ఆధారపడటమే ఇందుకు కారణమని అంటున్నారు. చైనాలోని ఫ్యాక్టరీలు 50-60 శాతం సామర్థ్యంతో పని చేస్తున్నట్టు సమాచారం ఉందని సీమా ప్రెసిడెంట్, గోద్రెజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కమల్ నంది తెలిపారు. తమ కంపెనీ ఏసీల ధరలను 2-3 శాతం పెంచుతున్నట్టు ఆయన చెప్పారు. విడిభాగాల సరఫరాలో కొరత, కస్టమ్స్ సుంకం పెంపు, అధిక లాజిస్టిక్ వ్యయాలు వంటి ధరల పెంపునకు దారితీస్తున్నట్టు ఆయన చెప్పారు.

సీమా, ఫ్రోస్ట్ అండ్ సులివన్ సంయుక్త నివేదిక ప్రకారం.. 2018-19 సంవత్సరంలో పరిశ్రమ మార్కెట్ పరిమాణం రూ.76,400 కోట్లుగా ఉంది. ఇందులో దేశీయ మాన్యుఫ్యాక్చరింగ్ ద్వారా సమకూరిన మొత్తం రూ.32,200 కోట్లు.

#### ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఎక్కువగా జనాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లేందుకు చాలా మంది సంశయిస్తున్నారు. ప్రయాణాల్లోనూ ఒంటరిగానే వెళ్లడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కార్లు కొనుగోలు చేయాలనుకునే వారు కూడా డీలర్‌షిప్‌కు వెళ్లడానికి వెనుకాడుతున్నారు. ఈ నేపథ్యంలో హ్యుండయ్ మోటార్ ఇండియా తన 'క్లిక్ టు బై' ఆన్‌లైన్ సదుపాయాన్ని మరింతగా విస్తరించడంపై దృష్టిసారిస్తోంది. అంతేకాకుండా ఇప్పటికే ఈ కంపెనీ పలు అంతర్గత చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఉద్యోగులతోపాటు చెన్నై ప్లాంట్, కార్యాలయంలోకి వచ్చే సందర్శకుల శరీర ఉష్ణోగ్రతను పరిశీలిస్తోంది. ఎగ్జిక్యూటివ్‌ల విదేశీ ప్రయాణాలను నిషేధించింది. అత్యంత ముఖ్యం అయితే తప్ప దేశీయంగా బిజినెస్ ట్రిప్‌లకు అనుమతించడం లేదు.

#### ఫెరారీ ఉత్పత్తి నిలిపివేత

ఇటలీ లగ్జరీ కార్ల దిగ్గజం ఫెరారీ తన రెండు ఫ్యాక్టరీల్లో రెండు వారాల పాటు ఉత్పత్తిని నిలిపివేసింది. మార్చి 27వ తేదీ వరకు ఈ ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి ఉండదని కంపెనీ తెలిపింది. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి నిలిపివేత నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. కంపెనీ కార్యకలాపాలకు ఉత్పత్తికి సంబంధం లేదని కంపెనీ సీఈఓ లూయిస్ కామిలెరి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఉత్పత్తిని పునఃప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

కరోనా వైరస్ మూలంగా చైనాలో నిర్మాణం, రవాణా, కెమికల్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాలపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక వెల్లడించింది. భారత్ అత్యధికంగా ముడిచమురు, బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. మొత్తం దిగుమతుల్లో వీటి వాటాయే 46 శాతం ఉంటుంది. 2018-19 సంవత్సరంలో భారత్ మొత్తం దిగుమతులు 50,700 కోట్ల డాలర్లుగా ఉన్నాయి. ఇందులో 26 శాతం వాటా ఇనుము,

#### నిర్మాణం, రవాణాపై ప్రభావం

ఉక్కు, ఇనార్గానిక్ కెమికల్స్ వంటివి ఉన్నాయి. ఈ దిగుమతులు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. భారత్ ఇనుము, ఉక్కు దిగుమతుల్లో చైనా వాటా 11 శాతంగా ఉంది. ఇనార్గానిక్ కెమికల్స్ దిగుమతుల్లో చైనా వాటా 15 శాతం ఉంది. దక్షిణ కొరియా తన అవసరాల్లో 20 శాతం చైనా నుంచి దిగుమతిచేసుకుంటోంది. చైనాలో మూసివేత కారణంగా నిర్మాణం, రవాణా, మాన్యుఫ్యాక్చరింగ్, కెమికల్ మాన్యుఫ్యాక్చరింగ్, మెషనరీ మాన్యుఫ్యాక్చరింగ్ ంటి రంగాలు ప్రభావితం అవుతాయని నివేదిక పేర్కొంది.

చైనాపై ఆధారపడకుండా ముడిసరుకులను కొనుగోలు చేయడానికి ఇతర మార్కెట్లను అన్వేషించమని తన సభ్యులకు అపారెల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ)

#### ప్రత్యామ్నాయాలు వెతుక్కోండి

చైర్మన్ ఏ శక్తివేల్ సూచించారు. ముడిసరుకుల సరఫరాకు ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని భారత రాయబార కార్యాలయాలను ఆదేశించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అమెరికా, ఈయూ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో 10 అపారెల్ ఉత్పత్తులను గుర్తించామని, ఇవి చైనా నుంచి ఉత్పత్తులను తగ్గించుకున్నాయని చెప్పారు.

## ఎస్‌బీఐ ఒక హృదయం లేని బ్యాంక్!



న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒక హృదయం లేని బ్యాంకు. మీ అసమర్థతే బ్యాంకును ఇలా తయారుచేసింది. ఇవీ ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చేసిన వ్యాఖ్య లు. అసోం లోని తేయాకు తోటల కార్మికుల బ్యాంకు ఖాతాలను వాడుకలోకి తీసుకురాలేక పోయారంటూ తీవ్ర ఆగ్రహానికి లోనైన నిర్మల.. రజనీష్‌పై మండిపడ్డారు. దీనికి సంబంధించి లీకైన ఒక ఆడియో క్లిప్పింగ్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. గువాహటిలో గత నెల 27న నిర్వహించిన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా.. నిర్మల వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేసిన ఆలిండియా బ్యాంకు అధికారుల సంఘం (ఏఐబీఓసీ).. తిరిగి దాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించడం గమనార్హం.

## మరో ఏడాది పాటు ఎన్‌పీఏ కష్టాలు

ముంబై : యెస్ బ్యాంక్‌కు మరో ఏడాది పాటు ఎన్‌పీఏల కష్టాలు తప్పేలాలేవు. అయినా కొత్తగా సమకూరనున్న రూ.10,000 కోట్ల ఈక్విటీ మూలధనంతో ఆ కష్టాల నుంచి గట్టెక్కుతామని బ్యాంక్ సీఈవోగా నియమితులైన ప్రశాంత్ కుమార్ చెప్పారు. త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో బ్యాంక్ మొత్తం రుణాల్లో మూడో వంతు ఎన్‌పీఏలే. కాగా బ్యాంకులో ఉన్న రూ.137 లక్షల కోట్ల డిపాజిట్లలో రూ.72,000 కోట్లకు పైగా డిపాజిట్లను డిపాజిటర్లు వెనక్కి తీసుకున్నారు.

## వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టులన్నీ ఆలస్యమే..




న్యూఢిల్లీ : వైజాగ్ స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) చేపట్టిన పలు ప్రాజెక్టుల నిర్మాణంలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై పార్లమెంట్ స్థాయీ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. కనీసం సవరించిన గడువులోగానైనా కంపెనీ ఈ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని బొగ్గు, ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన స్థాయీ సంఘం కోరింది. రూ.2,858 కోట్లతో చేపట్టిన కోక్ ఓవెన్ బ్యాటరీ 5 ప్రాజెక్టు 2017డిసెంబరు నాటికే పూర్తి కావాల్సి ఉన్నా, ఇంకా పూర్తికాని విషయాన్ని గుర్తు చేసింది. ఉత్తరప్రదేశ్ లోని రాయ్‌బరేలిలో రైలు చక్రాల ఉత్పత్తి కోసం రూ.1,700 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ ఆలస్యంపైనా అసంతృప్తి వ్యక్తం చేసింది. 2018 సెప్టెంబరు నాటికే పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు గడువును ఈ సంవత్సరం ఫిబ్రవరి వరకు పొడిగించారు. రూ.321 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ డిస్పాచ్ యార్డు నిర్మాణంలోనూ విపరీతమైన జాప్యం జరగడాన్ని స్థాయీ సంఘం తప్పుపట్టింది. ఈ ప్రాజెక్టు ఇప్పటికే ఏడాదిన్నరకుపైగా ఆలస్యమైందని పేర్కొంది.

## కాల్ డేటా వివరాలివ్వండి

- టెల్కోలను కోరుతున్న డాట్ విభాగాలు
- కార్యదర్శికి ఫిర్యాదు చేసిన సంస్థలు



న్యూఢిల్లీ: ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా టెలికాం శాఖ (డాట్)కు చెందిన కొన్ని విభాగాలు భారీగా కాల్ డేటాను కోరుతున్నాయని డాట్ కార్యదర్శి అన్షు ప్రకాశ్ వద్ద టెల్కోలు ఆందోళనను వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఆయనకు ఆయా సంస్థలు ఫిర్యాదు చేసినట్లు టెలికాం శాఖ అంతర్గత వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీకి సంబంధించి రాష్ట్ర డాట్ విభాగం గత నెల 2, 3, 4 తేదీల్లోని మొత్తం కాల్ డేటాను కోరిందని తెలిపాయి. ఇందులో మంత్రులు, ఎంపీలు, న్యాయమూర్తులు, కీలక కార్యాలయాలకు సంబంధించిన డేటా కూడా ఉంది. కాల్ డేటా సేకరణకు సంబంధించి స్పష్టమైన సూచనలు, ప్రమాణాలను 2016 ఆగస్టు, 2019 ఏప్రిల్‌లో ప్రభుత్వ సంస్థలకు డాట్ స్పష్టం చేసింది. దాని ప్రకారం.. కాల్ డేటా సమాచారాన్ని కోరే ముందు డాట్ విభాగం కచ్చితంగా వినియోగదారుడి పేరును వెల్లడించడంతో పాటు డేటాను కోరేందుకు సరైన కారణాన్ని చూపించాల్సి ఉంటుంది. సేకరించిన డేటాను ముందుగా వెల్లడించిన కారణం కోసం తప్ప.. వేరే ఏ ఇతర చర్యకు వినియోగించరాదు. పేర్కొన్న వినియోగంపై సంబంధిత అధికారులకు వివరించి వారి వద్ద అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే డాట్‌కు చెందిన పలు విభాగాలు ఈ మొత్తం ప్రక్రియను గాలికి వదిలేశాయని, భారీగా కాల్ డేటాను అడుగుతున్నాయని టెల్కోలు తమ ఫిర్యాదులో పేర్కొన్నాయి.

డాట్‌కు చెందిన దాదాపు అన్ని లైసెన్స్ సర్వీస్ ఏరియా విభాగాలు కూడా ప్రతి నెల ఒక రోజు మొత్తానికి కాల్ డేటాను కోరుతున్నాయని చెప్పాయి. రాష్ట్రాల వారీగా చూస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో 1, 5 తేదీల్లో, ఢిల్లీలో 18వ తేదీ, హరియాణాలో 21వ తేదీ, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్‌లో నెలాఖరున, కేరళ, ఒడిశాల్లో 15వ తేదీ, మధ్యప్రదేశ్, పంజాబ్‌లలో గత నెలాఖరు, ప్రస్తుత నెల 1వ తేదీన కాల్ డేటా ఇవ్వాలని అడుగుతున్నారని టెల్కోలు పేర్కొన్నాయి.

## అన్ని ఆడిట్ సంస్థలపైనా నియంత్రణ

- ఇంజేటి శ్రీనివాస్

న్యూఢిల్లీ : దేశంలో ఆడిట్ సేవలందించే ఏ సంస్థ అయినా దేశీయ నియంత్రణలకు లోబడి ఉండాల్సిందేనని కేంద్ర కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. డెలాయిట్, కేపీఎంజీ, పీడబ్ల్యూసీ,ఈవై వంటి బహుళజాతి ఆడిటింగ్ సంస్థలపై ప్రభుత్వానికి సరైన నియంత్రణ లేదని వార్తలు వస్తున్న సమయంలో ఈ విషయం చెప్పడం విశేషం. దేశంలో ఆడిట్ సేవలు అందించే ఏ చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) అయినా ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) దగ్గర నమోదైతేనే, వారిని ఆడిటింగ్‌కు అనుమతిస్తున్న విషయాన్ని శ్రీనివాస్ గుర్తు చేశారు. ఐసీఏఐ దగ్గర నమోదైన వ్యక్తులతో కలిసి పరిమిత భాగస్వామ్య కంపెనీలుగా ఏర్పడ్డాకే విదేశీ ఆడిట్ సంస్థలు దేశంలో ఆడిట్ సేవలందిస్తున్నట్టు చెప్పారు.

## తగ్గిన బంగారం దిగుమతులు

### 11 నెలల్లో 8.86 శాతం తగ్గుదల



న్యూఢిల్లీ : బులియన్ మార్కెట్ కళ తప్పుతోంది. మార్కెట్ నీరసించడంతో పసిడి దిగుమతులు కూడా తగ్గుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 11 నెలల్లో (2019 ఏప్రిల్-2020 ఫిబ్రవరి) బంగారం దిగుమతులు అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 8.86 శాతం తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరం తొలి 11 నెలల్లో 2,962 కోట్ల డాలర్లు ఉన్న పసిడి దిగుమతులు.. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి 11 నెలల్లో 2,700 కోట్ల డాలర్లకు (సుమారు రూ.1.9 లక్షల కోట్లు) దిగొచ్చాయి. దీంతో దేశ వాణిజ్య లోటు 17,300 కోట్ల డాలర్ల నుంచి 14,312 కోట్ల డాలర్లకు తగ్గింది.

#### ఎందుకంటే ?

మన దేశం ఏటా 800 నుంచి 900 టన్నుల బంగారం దిగుమతి చేసుకుంటుంది. ఇందులో కొంత భాగాన్ని నగలుగా మార్చి ఎగుమతి చేస్తుంటారు. పసిడి దిగుమతులపై 10 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 12.5 శాతానికి పెంచడం పరిశ్రమ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీన్ని నాలుగు శాతానికి తగ్గించాలని తాము కోరుతుంటే, ప్రభుత్వం 12.5 శాతానికి పెంచడాన్ని పరిశ్రమ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈ భారం తగ్గించుకునేందుకు కొంత మంది ఆభరణాల ఎగుమతిదారులు పన్నులు తక్కువగా ఉండే పొరుగు దేశాలకు తమ వ్యాపారాలను మార్చారు. దీనికి తోడు ఆర్థిక మందగమనంతో దేశీయ కొనుగోళ్లు నీరసించాయి. ఇవన్నీ పసిడి దిగుమతులను దెబ్బతీస్తున్నాయి.

#### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 15వ తేదీకి.. | | విజయవాడ | 290 |
| హైదరాబాద్ | 275 | విశాఖపట్నం | 300 |
| 16వ తేదీకి.. | | వరంగల్ | 278 |
| చిత్తూరు | 293 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 290 | | |

#### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 20 | విజయవాడ | 30 |
| వరంగల్ | 20 | గుంటూరు | 30 |
| మహబూబ్‌నగర్ | 20 | ఒంగోలు | 30 |
| కరీంనగర్ | 20 | చిత్తూరు | 34 |
| కర్నూలు | 20 | నెల్లూరు | 34 |
| విశాఖపట్నం | 16 | అనంతపురం | 41 |
| గోదావరి | 16 | | |

## ట్రెండ్ వ్యూ — కన్సాలిడేషన్ తప్పనిసరి


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం బేరిష్‌గా ప్రారంభమై ప్రధాన మద్దతు స్థాయి 10800 కన్నా దిగజారింది. ఈ మద్దతు స్థాయిని పోగొట్టుకోవడం ద్వారా తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు అంతరించిపోవడంతో పాటు మరింత డౌన్‌ట్రెండ్‌కు ఆస్కారం ఏర్పడింది. ఆ తర్వాత వారం అంతా డౌన్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ శుక్రవారంనాడు మరింత దిగజారి 8600 వరకు కూడా క్షీణించింది. కాని అంతలోనే కోలుకుని చివరికి 365 పాయింట్ల లాభంతో ముగిసినా ఇది మైనర్ బౌన్స్‌బ్యాక్ మాత్రమే. వారం మొత్తం మీద నిఫ్టీ 1000 పాయింట్లకు పైగా నష్టపోయి వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు మధ్యస్థంగా ముగిసింది.

ట్రెండ్‌లో అనిశ్చితికి ఇది దర్పణం. టెక్నికల్‌గా ప్రధాన ట్రెండ్ దిగువకే ఉంది. ఓవర్‌సోల్డ్ స్థితిలో ఉన్నందు వల్ల మైనర్ రికవరీ లేదా కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. 10000 వద్ద ఏర్పడిన అతి పెద్ద బ్రేక్‌డౌన్ కారణంగా ఈ మానసిక అవధి వరకు పుల్‌బ్యాక్ రికవరీ కూడా ఉండవచ్చు. గత కొన్ని రోజులుగా అన్ని మద్దతు స్థాయిలను కోల్పోతూ బేరిష్ ట్రెండ్‌లో కూడా ప్రవేశించింది. ఇంకా సరైన కన్సాలిడేషన్ ఏర్పడని కారణంగా స్వల్పకాలంలో మరింత ఆటుపోట్ల ధోరణికే ఆస్కారం ఉంది.



**బుల్లిష్ స్థాయిలు:** టెక్నికల్‌గా పూర్తి స్థాయి కన్సాలిడేషన్ అనంతరమే సరైన దిశ తెలుస్తుంది. మరింత పాజిటివ్ ధోరణి ఏర్పడితే గత శుక్రవారం ఏర్పడిన మేజర్ హై 10150 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 10350, 10550.

**బేరిష్ స్థాయిలు :** 10000 వద్ద విఫలమైతే మరింత డౌన్‌ట్రెండ్ ఏర్పడుతుంది. మైనర్ మద్దతు స్థాయి 9900 కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 9700. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

**బ్యాంక్ నిఫ్టీ :** ఈ సూచీకి గత వారం ఏర్పడిన టాప్ 25700. ఆ పైన నిలదొక్కుకుంటే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. ప్రధాన నిరోధం 26000.

**పాటర్న్ :** మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక 20, 50 ఎటిపిల కన్నా దిగువకు వచ్చింది. తక్షణ బుల్లిష్ ట్రెండ్ అవకాశాలు లేవనేందుకు ఇది సంకేతం. అలాగే "ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా చాలా దిగువన ఉంది. అప్‌ట్రెండ్‌కు మరింత సమయం పట్టవచ్చు. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం 10150 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద బ్రేకౌట్ సాధించాలి.

**టైమ్ :** ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

| సోమ వారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం: | 10080, 10150 |
| మద్దతు : | 9960, 9900 |

www.sundartrends.in

## ఆస్ట్రో ట్రెండ్ — 10250 పైన ముగిస్తే బుల్లిష్

### (మార్చి 16-20 తేదీల మధ్య వారానికి)

**గత వారం నిఫ్టీ : 9955 (-1034)**


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం పాయింట్ల 10752-8855 పాయింట్ల మధ్యన విస్తృత పరిధిలో కదలాడి 1034 పాయింట్ల భారీ నష్టంతో 9955 వద్ద నెగెటివ్‌గా ముగిసింది.

- ఫిబ్రవరి 24-27 తేదీల మధ్య కాలంలో కొత్త ఆస్ట్రో మాసంలో 12013-11537 పాయింట్ల మధ్యన కదలాడింది. వారాంతానికి తొలి టార్గెట్ కన్నా కూడా దిగజారింది. గత శుక్రవారం అన్ని మద్దతు స్థాయిలను పోగొట్టుకుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 11354, 11817, 11905, 11654 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం అన్ని డిఎంఏల దిగువకు వచ్చింది. అయితే 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైనే కొనసాగుతోంది. ఇది దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం. ఈ వారాంతంలో 10250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి : 10250** **బ్రేక్‌డౌన్ స్థాయి : 9700**
**నిరోధ స్థాయిలు : 10100, 10175, 10250 (10025 పైన బుల్లిష్)**
**మద్దతు స్థాయిలు : 9800, 9725, 9650 (9875 దిగువన బేరిష్)**

**ఇన్వెస్టర్లకు సూచన...** వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం.

#### గ్రహగతులు

- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4 నుంచి మకరంలోని శ్రవణం పాదం 4 మధ్యలో చంద్ర సంచారం
- మీనంలోని పూర్వాభాద్ర పాదం 4 నుంచి ఉత్తరాభాద్ర పాదం 1 మధ్యలో రవి సంచారం
- కుంభంలోని ధనిష్ఠ పాదం 4 నుంచి శతభిషం పాదం 1 మధ్యలో బుధ సంచారం
- మేషంలోని భరణి పాదం 2-3 మధ్యలో శుక్ర సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 4 నుంచి ఉత్తరాషాఢ పాదం 1 మధ్యలో కుజ సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 3లో కుంభ నవాంశలో శని సంచారం
- ధనుస్సులోని ఉత్తరాషాఢ పాదం 1లో ధనుస్సు నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 2లో రాహువు, ధనుస్సులోని మూల పాదం 4లో కేతువు సంచారం

#### ప్రారంభం, ముగింపు మెరుగు (సోమవారానికి)

**తిథి :** ఫాల్గుణ బహుళ అష్టమి **నక్షత్రం :** జ్యేష్ఠ, మూల
**అప్రమత్తం :** కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ/రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.
**ట్రెండ్ మార్పు వేళలు : 11.11**
**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ 11.10 వరకు మెరుగ్గాను, ఆ తర్వాత 1.59 వరకు నిస్తేజంగాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది. తదుపరి 3.10 వరకు మరోసారి మెరుగ్గా ట్రేడయి చివరిలో నిస్తేజంగా మారవచ్చు.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 11 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11.45 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది. 2.15 తర్వాత మరోసారి పైకి వస్తే మరిన్ని లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 10000, 10050, 10100 మద్దతు స్థాయిలు : 9900, 9850, 9800**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి

### ● తొలి రెండు పరీక్షలూ ఉచితం

కొవిడ్-19 సోకిందీ లేనిదీ తెలుసుకోవడానికి చేసే పరీక్షను మొదటి రెండుసార్లూ ఉచితంగా చేయాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి సంజీవ కుమార్ ఈ విషయాన్ని తెలిపారు. కరోనా పరీక్షలకు అవసరమైనన్ని కిట్లు ఉన్నాయని.. ఉన్నవాటిలో 10 శాతాన్నే వినియోగించుకున్నారని వివరించారు. ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్న దేశాల నుంచి వచ్చి.. అనుమానిత లక్షణాలతో బాధపడుతున్నవారు 011-23978046కు ఫోన్ చేసి వివరాలు తెలిపితే ప్రభుత్వం అనుమతించిన ల్యాబ్‌లో ఈ ఉచిత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

### ● అలసి సొలసి..

కరోనా వైరస్ బాధితులకు సేవలు అందించి అలసిసొలసిపోయిన ఇటలీ నర్సు ఈమె! ఇటలీలో కరోనా వైరస్ మృతుల సంఖ్య 1441కి చేరింది. నిర్విరామ సేవలు అందించడంతో పని చేస్తున్న చోటే ఇలా అలసటతో నిద్రించింది. ఈ ఫొటో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరలైంది. 'ఓ వైపు నా బలహీనతను చూస్తే బాధేస్తోంది. మరో వైపు నా కథ విన్నవారు పంపుతున్న మెసేజ్‌లు చూస్తుంటే ఆనందమేస్తోంది' అని ఆ నర్సు వ్యాఖ్యానించింది.





## అమెరికాలో యోగాపై నిషేధం ఎత్తివేత

బోస్టన్/వాషింగ్టన్, మార్చి 15 : అమెరికాలో యోగాపై నిషేధాన్ని ఎత్తివేశారు. 1993లో అలబామా బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విధించిన నిషేధాన్ని అలబామా ప్రతినిధుల సభ తొలగించింది. డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు జెరిమీ గ్రే ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ 84-17 ఓట్లతో ఆమోదించింది. దీంతో యోగా బిల్లును పునరుద్ధరించారు. అయితే నమస్తేకు మాత్రం దూరంగా ఉండాలని సభ పేర్కొనడం గమనార్హం. కరోనా బారిన పడకుండా సామాన్యుడి నుంచి అమెరికా అధ్యక్షుడి వరకు నమస్తే పెడుతుంటే నమస్తేను సభ నిషేధించడం విశేషం. మరోవైపు అమెరికాలో ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లు విద్యార్థులకు ఉచితంగా 60 రోజుల పాటు వైఫై సేవలు అందించనున్నారు.



## 2వేల మాస్కులు ఇవ్వనున్న ఎంపీ జైలు ఖైదీలు

జబల్‌పూర్, మార్చి 15 : మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జైలు ఖైదీలు తాము తయారుచేసిన రెండు వేల మాస్కులను ఆరోగ్య శాఖ అధికారులకు ఇవ్వనున్నారు. కరోనా నేపథ్యంలో మాస్కుల కొరత తీర్చేందుకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జైల్లోని 50 మంది ఖైదీలు ఈ మాస్కులను తయారుచేశారు. ఒక్కో దాని ఖరీదు రూ.7 అని అధికారులు చెప్పారు. మాస్కులను తయారు చేసేందుకు వాడిన కాటన్‌ను కూడా జైల్లో ఏర్పాటు చేసిన మరమగ్గాల సాయంతోనే తయారుచేయడం విశేషం. కాగా, మాస్కుల కొరత తీర్చేందుకు కేరళ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. తన రాష్ట్రంలోని జైళ్లలో ఉన్న ఖైదీలతో మాస్కులను తయారు చేయిస్తోంది.



## ఏసీ కోచుల్లో దుప్పట్లు ఉండవు: దక్షిణ రైల్వే

న్యూఢిల్లీ, మార్చి 15 : కేంద్ర, పశ్చిమ రైల్వే బాటలోనే దక్షిణ రైల్వే (ఎస్‌సీ) పయనించనుంది. ఇకపై ఏసీ కోచుల్లో దుప్పట్లు ఉంచబోమని, ప్రయాణికులే వారి సొంత దుప్పట్లను తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. రోజూ కొన్ని వేల మంది ప్రయాణికులు కోచుల్లోని వివిధ వస్తువులను తాకుతారని, దీంతో కరోనా వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదముందని, ఈ వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఎస్‌సీ తెలిపింది. ప్రయాణికులు సహకరించాలని కోరింది. కోచుల్లో ఏసీని 24 నుంచి 25 డిగ్రీల మధ్య ఉంచుకోవాలని భారతీయ రైల్వే సూచించింది.




## మృతదేహాల ద్వారా కరోనా వ్యాప్తి చెందదు: ఢిల్లీ ఎయిమ్స్

న్యూఢిల్లీ, మార్చి 15: మృతదేహాల ద్వారా కరోనా వ్యాప్తి చెందదని ఢిల్లీ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) తెలిపింది. ఆ వైరస్ దగ్గడం ద్వారా (రెస్పిరేటరీ సెక్రీషన్) వ్యాప్తి చెందుతుందని, కాబట్టి కరోనా సోకిన మృతదేహాలను కాల్చకపోయినా ప్రమాదం లేదని పేర్కొంది.



## ఓడల్లోంచి దిగొద్దు.. ప్రయాణికులకు అనుమతి నో

న్యూఢిల్లీ, మార్చి 15 : ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న ఓడరేవుల్లో ప్రయాణికులెవరూ దిగకుండా కేంద్ర ప్రభుత్వం నిరోధించింది. ప్రస్తుతం 700 ఓడల్లో 25,504 మంది ప్రయాణికులు ఉన్నారని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 1 అనంతరం వైరస్ సోకిన దేశాల్లో పర్యటించిన సరుకును చేరవేసే ఓడలతో పాటు అంతర్జాతీయ క్రూయిజ్ షిప్‌లను కూడా (ప్రయాణికులను విహారానికి తీసుకెళ్లే ఓడలు) మన దేశ సరిహద్దు జలాల్లో ప్రవేశించకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది.

# 24 గంటల్లో.. 24 కొత్త కేసులు




సార్క్ దేశాధినేతలతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ, మార్చి 15: ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనాపై దక్షిణాసియా ప్రాంతీయ సహకార మండలి (సార్క్) దేశాలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వైరస్‌ను ఎదుర్కొనేందుకు ఉమ్మడి వ్యూహంతో కదలాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం సార్క్ అత్యవసర నిధి ఏర్పాటుకు ఆయన ప్రతిపాదించారు. భారత్ వంతుగా దాదాపు రూ.74 కోట్లు (10 మిలియన్ డాలర్లు) ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పరిశోధనలను సమ

### 'సార్క్' అత్యవసర నిధి

న్వయం చేసుకుంటూ నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఈ సంయుక్త వేదిక ఉపయోగపడుతుందన్నారు. భారత వైద్య పరిశోధన మండలి తోడ్పాటు అందిస్తుందని వివరించారు. ఆదివారం సార్క్ సభ్య దేశాధినేతల వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని ప్రసంగించారు. సరిహద్దుల మూసివేతతో ఆహారం, ఔషధాలు, నిత్యావసరాలకు ఇబ్బంది తలెత్తుందని అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ ప్రస్తావించారు. కాగా, కరోనా వ్యాప్తిపై.. దేశాధినేతలంతా ఆందోళన వ్యక్తం చేశారు. పాక్ మాత్రం అప్రస్తుతంగా కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించి తన వక్రబుద్ధిని మరోసారి బయటపెట్టుకుంది. కరోనా కేసులు నమోదైనందున కశ్మీర్‌లో అన్ని రకాల ఆంక్షలు ఎత్తివేయాలని పాక్ ఆరోగ్య మంత్రి జాఫర్ మీర్జా అన్నారు.

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 15: దేశంలో కరోనా కేసుల సంఖ్య 108కి చేరింది. మహారాష్ట్రలో.. దేశంలోనే అత్యధికంగా 32 కేసులు నమోదయ్యాయి. ఔరంగాబాద్‌లో 59 ఏళ్ల మహిళకు, పుణెజిల్లాలోని పింప్రి-చించ్‌వాడ్‌లో ఐదుగురికి వైరస్ పాజిటివ్ వచ్చినట్టు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. మహారాష్ట్రలో వైరస్ బాధితుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేతో ప్రధాని నరేంద్రమోదీ ఫోన్‌లో మాట్లాడారు. వైరస్ కట్టడికి తీసుకుంటున్న చర్యల గురించి ప్రధానికి ఠాక్రే వివరించారు. కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో ముంబైలోని రైల్వే అధికారులు.. లోకల్ రైళ్ల డిస్‌ఇన్‌ఫెక్షన్ చర్యలు చేపట్టారు. కొవిడ్ అనుమానిత లక్షణాలతో క్వారంటైన్‌లో ఉంటూ చనిపోయిన మహారాష్ట్రవాసికి వైరస్ నెగెటివ్ అని తేలింది. కాగా.. కేరళలోని కొచ్చి ఎయిర్‌పోర్టులో ఆదివారం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఆ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కి వెళ్లాల్సిన విమానం ఉదయం 9.20కి ప్రయాణానికి సిద్ధమైంది. యూకేకు చెందిన 19 మంది బృందం అందులో ఎక్కారు. విమానం టేకాఫ్ తీసుకునే సమయానికి అధికారులు దాన్ని ఆపేశారు. విమానంలోని యూకే బృందాన్ని కిందకు దింపారు. వారంతా కేరళలో పర్యాటక ప్రదేశాలను చూడ్డానికి వచ్చిన టూరిస్టులు. మున్నార్‌లోని ఒక రిసార్టులో బస చేసి పర్యటించారు. వారిలో ఒకరికి కొవిడ్-19 సోకినట్టు అనుమానం రావడంతో మార్చి 11 నుంచి వైద్యులు అతణ్ని పరిశీలనలో ఉంచారు. అతడి నమూనాలను వైద్యపరీక్షలకు పంపారు. ఫలితాలు వచ్చేలోపే వారం దరూ దేశం దాటి వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలోనే కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్నారు. అంతలోనే.. వైద్యపరీక్షల్లో అతడికి పాజిటివ్ రావడంతో అధికారులు పరుగులు పెట్టారు. అతడు కొచ్చి ఎయిర్‌పోర్టులో ఉన్న విషయం తెలుసుకుని అతణ్ని, అతడి భార్యను సమీప ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అతడితోపాటు కేరళలో పర్యటనకు వచ్చిన బృందంలోని 17 మందినీ దగ్గర్లోని ఒక హోటల్‌గదిలో క్వారంటైన్‌లో ఉంచారు. ఆ విమానంలో వెళ్లాల్సిన మరో ప్రయాణికుడు (యూకే బృందంతో సంబంధం లేని వ్యక్తి).. స్వచ్ఛందంగా ప్రయాణాన్ని మానుకుని హోం ఐసోలేషన్‌లో ఉండేందుకు సిద్ధపడ్డారు. దీంతో ఉదయం 9.20కి బయల్దేరాల్సిన విమానం మధ్యాహ్నం 12.47కు బయల్దేరింది. కొత్తగా పాజిటివ్‌గా నమోదైన యూకే వ్యక్తితో కలిపి.. కేరళలో కొవిడ్ కేసుల సంఖ్య 20కి చేరింది. 300 మంది దాకా అనుమానితులు ఆ రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల ఐసోలేషన్ వార్డుల్లో ఉన్నారు. ఢిల్లీలో ఈ వైరస్ ఇప్పటివరకూ ఏడుగురికి సోకగా.. అందులో ఒకరు శుక్రవారం మరణించిన సంగతి తెలిసిందే. హరియాణాలో ఇప్పటిదాకా నమోదైన కేసుల సంఖ్య 14. కానీ.. బాధితులంతా విదేశీయులే. రాజస్థాన్‌లో నలుగురికి వైరస్ పాజిటివ్ రాగా.. అందులో ఇద్దరు భారతీయులు, ఇద్దరు ఇటాలియన్లు. చికిత్సతో వారిలో ఇద్దరు ఇటాలియన్లకు, ఒక జైపూర్‌వాసికి పూర్తిగా నయమైందని, వైరస్ నెగెటివ్ వచ్చిందని అధికారులు తెలిపారు. యూపీలో 11, పంజాబ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కో కేసు, లద్దాఖ్‌లో 3, జమ్ముకశ్మీర్‌లో 2, కర్ణాటకలో ఆరు కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలోని కలబుర్గిలో.. విదేశాల నుంచి వచ్చిన 16 మంది హోం క్వారంటైన్‌లో ఉన్నట్టు ఆ రాష్ట్ర మంత్రి శ్రీరాములు తెలిపారు. ఇప్పటివరకూ కరోనా కేసులు లేని పశ్చిమబెంగాల్‌లో.. విదేశాల నుంచి వచ్చిన 10 మంది అనుమానిత లక్షణాలతో కోల్‌కతాలో ఆస్పత్రిలో చేరారు.

### రద్దులు.. సెలవులు..

కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా మార్చి 29 దాకా అన్ని తరగతులనూ రద్దు చేస్తున్నట్టు ఐఐటీ బాంబే ప్రకటించింది. విద్యార్థులందరినీ హాస్టళ్లు వదిలి ఇళ్లకు వెళ్లాలని సూచించింది. మార్చి 31 దాకా కేజీ, ప్రైమరీ స్కూళ్ల మూసివేతకు తమిళనాడు సర్కారు ఆదేశాలు జారీ చేసింది. పుదుచ్చేరి సర్కారు ప్రాథమిక పాఠశాలలకు సెలవులు ప్రకటించగా.. ఉత్తరాఖండ్ సర్కారు మొత్తం అన్ని స్కూళ్లనూ మార్చి 31 దాకా మూసేయాలని ఆదేశించింది. అసోం సర్కారు కూడా 29 దాకా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, జిమ్‌లు, సినిమాహాళ్లు, ఈతకొలనుల మూసివేతకు ఆదేశించింది.

కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై వ్యాప్తి నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాయి. మాస్కుల కొరత రాకుండా చూసేందుకు 80,50,000 ఎన్-95 మాస్కుల అదనపు తయారీకి ఆర్డర్ ఇచ్చినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కోల్‌కతా నుంచి బంగ్లాదేశ్‌కు నడిచే పాసింజర్ రైలు సర్వీసులను తూర్పు రైల్వే రద్దు చేసింది. పాకిస్థాన్‌లో కూడా కరోనా

### పారిపోతే కఠిన చర్యలు

కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో.. కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారా యాత్రను, ఆ యాత్రకు రిజిస్ట్రేషన్లను కేంద్రం తాత్కాలికంగా నిలిపివేసింది. ఇక.. శనివారం మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ సివిల్ హాస్పిటల్ నుంచి పారిపోయిన ముగ్గురు కొవిడ్ అనుమానితులు, నాగపూర్‌లోని మయో హాస్పిటల్ నుంచి పారిపోయిన నలుగురు అనుమానితుల్లో ముగ్గురు ఆదివారం తిరిగొచ్చినట్టు అధికారులు చెప్పారు. ఇలా పారిపోయేవారిపై, వైద్యాధికారులకు సహకరించనివారిపై కఠిన చర్యలు తప్పవని మహారాష్ట్ర మంత్రి రాజేశ్ తోపే అన్నారు.

### ఇరాన్, ఇటలీ నుంచి 452 మంది భారత్‌కు!

ఇటలీలో చిక్కుకుపోయిన భారతీయుల్లో 218 మందిని దేశానికి తీసుకొచ్చినట్టు విదేశాంగ శాఖ సహాయమంత్రి వి.మురళీధరన్ తెలిపారు. అక్కడున్న మిగతావారినీ తీసుకొస్తామన్నారు. ఇరాన్ నుంచి 234 మందిని ఢిల్లీకి తీసుకొచ్చినట్టు విదేశాంగ మంత్రి జైశంకర్ ట్వీట్ చేశారు.ఇరాన్‌లో చిక్కుకుపోయిన మిగతా భారతీయులను రవాణా చార్జీలు లేకుండా భారత్‌కు చేరవేసేందుకు సిద్ధమంటూ ఇరాన్‌కు చెందిన ప్రైవేటు విమానయాన సంస్థ మహాన్ ఎయిర్ ప్రధాని మోదీకి లేఖ రాసింది.

### ప్రవాసుల రక్షణకు ప్రత్యేక విభాగం

కరోనా ముప్పు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో.. విదేశాల్లో ఉన్న భారతీయుల సంరక్షణకు కేంద్రం ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. విదేశాంగ శాఖ అదనపు కార్యదర్శి దమ్ము రవి కొవిడ్-19 సమస్యలకు సంబంధించి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ పనిలో ఆయనకు మరో నలుగురు అధికారులు సహకరిస్తారు. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల సహకారంతో ఈ విభాగం పనిచేస్తుంది.

## కొడుకు ద్వారా తల్లికి కరోనా..

**కోలుకుంటున్న కొడుకు.. బలైపోయిన తల్లి**

న్యూఢిల్లీ, మార్చి 15: ఒక వ్యక్తి గత నెలలో స్విట్జర్లాండ్, ఇటలీ వెళ్లి ఢిల్లీ తిరిగి వచ్చాడు. మొదట్లో కరోనా లక్షణాలేవీ కనిపించలేదు. ఒకరోజు తర్వాత జ్వరం, దగ్గు రావడంతో రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి వెళ్లాడు. తల్లికి కూడా జ్వరం, దగ్గు ఉండడంతో ఇద్దరికీ చికిత్స ప్రారంభించారు. వైద్య పరీక్షల్లో ఇద్దరికీ కరోనా ఉందని తేలింది. కాగా, షుగర్, బీపీ ఉండడంతో పరిస్థితి విషమించి తల్లి మృతిచెందింది. కుమారుడి ఆరోగ్యం మెరుగవడంతో ఐసొలేషన్ వార్డుకు మార్చారు.

## భయపెట్టే వేగం

**త్వరత్వరగా చుట్టబెట్టే కొవిడ్-19**

**తగిన చర్యలు తీసుకోకపోతే**

**ప్రతి 6 రోజులకూ కేసులు రెట్టింపు**

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'వడ్లగింజలు' నవల చదివారా? అందులో ప్రధాన పాత్రధారి చదరంగ నిపుణుడు రాజుతో ఆడి గెలిచి ఏం కావాలో కోరుకోమంటే.. చదరంగం బల్లలోని మొదటి గడిలో ఒక వడ్ల గింజ, రెండో గడిలో రెండు గింజలు, మూడో గడిలో నాలుగు, నాలుగో గడిలో ఎనిమిది.. ఇలా గడిగడికీ రెట్టింపు చొప్పున ఇవ్వాలని కోరుతాడు! అలా ఇస్తే అరవైనాలుగో గడిలో పెట్టడానికి సరిపడా ధాన్యం ఆ రాజ్యంలోనే ఉండదు. కరోనా కూడా అంతేనని.. దాని కట్టడికి చర్యలు తీసుకోకపోతే సగటున ప్రతి ఆరు రోజులకూ కొవిడ్-19 పాజిటివ్ కేసుల సంఖ్య రెట్టింపు అవుతుందని సియాటెల్ (అమెరికా)లోని ఫ్రెడ్ హచిన్సన్ కేన్సర్ రిసెర్చ్ సెంటర్‌కు చెందిన పరిశోధకుడు ట్రెవర్ బెడ్‌ఫోర్డ్ తెలిపారు. కొవిడ్-19కు కేంద్రస్థానమైన చైనాలో ఆ వైరస్ వ్యాప్తి ఎప్పుడు మొదలైందో తెలియదు కాబట్టి.. ఆ దేశాన్ని పక్కనపెడదాం! ఎక్కడో సుదూరంగా ఉన్న అమెరికానే ఉదాహరణగా తీసుకుంటే.. ఈ ఏడాది జనవరి 21న అమెరికాలో తొలి కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. తర్వాత నెమ్మదిగా, క్రమంగా పెరుగుతూ 50 రోజులు గడిచేసరికి ఆ దేశంలో 2500 మందికి పాకింది. ఆదివారంనాటికి కరోనా కేసుల సంఖ్య అక్షరాలా 2952కు చేరింది. అన్ని రాష్ట్రాలకూ పాకింది. 60 మంది చనిపోయారు. ఇక మనదేశంలో కూడా తొలుత కేరళలో మూడు కేసులు వెలుగు చూశాయి. 12 రోజుల్లో ఆ సంఖ్య 108కి చేరింది. ఇద్దరు వృద్ధులు కరోనాతో మృత్యువాత పడ్డారు. అయితే.. జాగ్రత్త చర్యలతో కొవిడ్-19 వేగవ్యాప్తిని అడ్డుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## 'నిర్బంధం'లో ప్రపంచం!

- బ్రిటన్‌పైనా అమెరికా ప్రయాణ నిషేధం
- నూజెర్సీలో కర్ఫ్యూ.. మనీలా మూసివేత
- 6 వేలు దాటిన కరోనా మృతుల సంఖ్య
- ఒక్క రోజే 500 మందికి పైగా మృత్యువాత



నిర్మానుష్యంగా న్యూయార్క్‌లోని టైమ్స్‌స్క్వేర్

వాషింగ్టన్, మార్చి 15: విశ్వరూపం దాల్చిన కరోనా వైరస్‌ను అడ్డుకొనేందుకు వివిధ దేశాలు నిషేధాజ్ఞలు విధిస్తున్నాయి. ప్రజలను ఇళ్లు దాటి బయటకు రానీయకపోవడం నుంచి కర్ఫ్యూ అమలు, నగరాలు, సరిహద్దుల మూసివేత వరకు రకరకాల చర్యలు చేపట్టాయి. కరోనా కాటుకు ప్రపంచవ్యాప్తంగా 24 గంటల్లో 500 మందిపైగా బలయ్యారు. దీంతో మృతుల సంఖ్య 6 వేలు దాటింది. పాజిటివ్ కేసుల సంఖ్య 1,59,844కు పెరిగింది. అమెరికా... ప్రయాణ నిషేధాన్ని బ్రిటన్, ఐర్లాండ్‌కూ వర్తింపజేసింది. అమెరికాలోని చాలా నగరాల్లో ప్రజలు గుమిగూడడాన్ని నిషేధించారు. ఫిలిప్పైన్స్ రాజధాని మనీలాలోకి ఎవరూ రాకుండా, బయటకు వెళ్లకుండా పోలీసులు, సైనికులు పహారా కాస్తున్నారు. ఫ్రాన్స్‌లో స్కూళ్లు, హోటళ్లు, థియేటర్లను మూసివేశారు. ఎక్కువ దూరం ప్రయాణించే రైళ్లు, బస్సులను నిలిపివేశారు. పారిస్‌లో ప్రముఖ పర్యాటక ప్రదేశాలు మూతపడ్డాయి. యూరప్ దేశాలు పొరుగుకు 'నో ఎంట్రీ' అంటున్నాయి. డెన్మార్క్ సరిహద్దులు మూసివేసింది. పోలాండ్, చెక్ రిపబ్లిక్, స్లొవేకియా ఇదే బాట పట్టనున్నాయి. నార్వే, పోలాండ్‌తో సరిహద్దులు మూసివేస్తున్నట్లు రష్యా ప్రకటించింది. ఇతర దేశాల నుంచి చైనాకు వచ్చేవారిని వైద్య పరీక్షలకు అనువుగా మార్చిన ఎగ్జిబిషన్ కేంద్రానికి తరలిస్తున్నారు. ఆ దేశంలో మరో 10 మంది మృతిచెందారు. దీంతో మరణాల సంఖ్య 3,199కు పెరిగింది. దేశంలోకి వచ్చే వారు స్వచ్ఛందంగా 14 రోజులు ఐసోలేషన్‌లో ఉండాలని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఆంక్షలు విధించాయి. కజకిస్థాన్, సాల్వెడార్‌లు అత్యవసర పరిస్థితి ప్రకటించాయి. పాకిస్థాన్‌లో కొత్తగా 20 కేసులు నమోదయ్యాయి.

### స్పెయిన్‌లో కొత్తగా 2,000 కేసులు

స్పెయిన్‌లో 24 గంటల్లో 105 మంది మృతి చెందారు. దీంతో మరణాల సంఖ్య 250 దాటింది. ఆదివారం కొత్తగా 2 వేల కేసుల నమోదుతో మొత్తం సంఖ్య 7.753 దాటింది. ఇందులో ఎక్కువ రాజధాని మాడ్రిడ్‌లోనే నమోదయ్యాయి. ప్రధాని పెడ్రో సాంచెజ్ భార్య బెగొనా గోమెజ్‌కు కరోనా సోకింది.

### ఇటలీలో ఒక్కరోజే 368 మంది బలి

యూరప్‌లో కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్న ఇటలీలో ఒక్కరోజే 368 మరణాలు సంభవించాయి. దీంతో మొత్తం మరణాల సంఖ్య 1400 దాటింది. 24 గంటల్లో కొత్తగా 3,497 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇది సుమారు 20 శాతం. మొత్తం కేసులు 21,000 దాటాయి.

### ఇరాన్‌లో మరో 113 మంది మృతి

ఇరాన్‌లో ఆదివారం కరోనా 113 మందిని బలి తీసుకుంది. దీంతో మృతుల సంఖ్య 724కు చేరింది. కొత్తగా 1,209 కేసులు నమోదయ్యాయి. మొత్తం కేసులు 13,938కి పెరిగాయి. ప్రజలు బయటకు రావద్దని ప్రభుత్వం ఆదేశించింది.

### ట్రంప్‌కు కరోనా సోకలేదు : వైట్‌హౌస్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కరోనా వైరస్ సోకలేదని నిర్ధారణ అయింది. "శుక్రవారం రాత్రి ట్రంప్‌తో విస్తృతంగా చర్చించిన తర్వాత ఆయన కొవిడ్-19 పరీక్షకు అంగీకరించారు. ఫలితం 'నెగెటివ్' వచ్చింద"ని అధ్యక్షుడి ఫిజీషియన్ డాక్టర్ సీన్ కోన్లే తెలిపారు. ట్రంప్ ఇటీవల తన ఫ్లోరిడా రిసార్ట్‌లో బ్రెజిల్ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఆ బృందంలోని బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సోనారో సలహాదారు ఫాబియోతో పాటు కొందరికి వైరస్ సోకింది. ఐసోలేషన్‌కు ట్రంప్ విముఖత చూపారు. కరోనా లక్షణాలు లేవంటూ పరీక్షకూ నిరాకరించారు. అయితే శ్వేత సౌధంలో తాజా సమావేశంలో చర్చ అనంతరం ఒప్పుకున్నారు. 24 గంటల్లోపే పరీక్ష ఫలితం వచ్చింది.

## 'రహస్య' శత్రువు!!

- వ్యాధి లక్షణాలు బయటపడకముందే.. ఒకరి నుంచి మరొకరి వైరస్
- ఒక వ్యక్తిలోకి ప్రవేశించిన నాలుగోరోజే.. అతడి నుంచి మరో వ్యక్తిలోకి
- అమెరికాలోని టెక్సస్ వర్సిటీ శాస్త్రవేత్తలు

హూస్టన్(అమెరికా), మార్చి 15: అది ఫిబ్రవరి నెల. అమెరికాలోని కేంబ్రిడ్జి నగరంలో బయోజెన్ అనే బయోటెక్నాలజీ కంపెనీ తమ ఉద్యోగులతో ఓ సమావేశం నిర్వహించింది. ఇది ముగిసిన తర్వాత కరోనా పరీక్షలు నిర్వహించగా ముగ్గురు ఉద్యోగులకు పాజిటివ్ అని తేలింది. చూడటానికి ఆరోగ్యంగా కనిపించిన వారికి కరోనా ఉందని ఎవరూ అంచనా వేయలేకపోయారు. ఇదే తరహాలో ప్రపంచవ్యాప్తంగా మరెన్నో దేశాలు కూడా వ్యాధి లక్షణాలు బయటపడని.. కరోనా రోగులను గుర్తించినట్లు ప్రకటించాయి. ఈ రీతిలో రహస్య శత్రువులా కరోనా వైరస్ మానవాళిపై ముప్పేట దాడి చేస్తోంది. ఓ వ్యక్తి శరీరంలోకి ప్రవేశించిన వారంలోపే(నాలుగో రోజే) అతడి నుంచి మరెందరికో వ్యాపిస్తోంది. జ్వరం, దగ్గు, ఆయాసం వంటి వ్యాధి లక్షణాలు బయటపడకముందే.. ఒకరి నుంచి ఎంతో మందికి వైరస్ వ్యాప్తి జరిగిపోతోంది. అందుకే కరోనా కేసుల సంఖ్య శరవేగంగా పెరుగుతూపోతోంది. పది శాతానికిపైగా కరోనా రోగులకు వైరస్ బారినపడిన ఇతరుల నుంచే వ్యాధి వ్యాపిస్తోంది. అమెరికాలోని టెక్సస్ వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనంలోనూ ఇదే ధ్రువీకృతమైంది. చైనాలోని 93 నగరాలకు చెందిన 450 కరోనా ఇన్ఫెక్షన్ కేసుల విశ్లేషణ అనంతరం వారు ఈ నిర్ధారణకు వచ్చారు. ఫ్లూ వ్యాధి తరహాలో కొన్ని రోజుల వ్యవధిలోనే ఒకరి నుంచి మరొకరికి వైరస్ సంక్రమిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టకుంటే పరిస్థితి చేయిదాటే అవకాశాలు ఉంటాయని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.

## ఈబే, అమెజాన్‌లో మాస్కులు, శానిటైజర్ల విక్రయాలు నిలిపివేత



వాషింగ్టన్ డీసీ, మార్చి 15: మాస్కులు, చేతి శానిటైజర్లు, నేలను తుడిచేందుకు ఉపయోగించే క్రిమిసంహారక మందుల విక్రయాలను ఈబే, అమెజాన్‌లు నిలిపివేశాయి. ఈ ఉత్పత్తులను ఆ ఆన్‌లైన్ సంస్థల్లో విక్రేతలు భారీఎత్తున ధరలు పెంచి, విక్రయిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ ఉత్పత్తులను విక్రయాల జాబితా నుంచి తొలగిస్తున్నామని ప్రకటించాయి.

# నిధులకు ఢోకాలేదు!

- ఎన్నికల తర్వాత విడుదలకు అవకాశం
- ఆర్థిక సంఘం పరిగణనలో కరోనా?

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కరోనా కారణంగా రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలు ఆరు వారాలు వాయిదా పడటంతో 14వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోతాయని ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యానించడంతో ఎన్నికలు జరగాల్సిన ఆవశ్యకతపై చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఏ రాష్ట్రమైనా స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే ఆ రాష్ట్రాల్లో స్థానికసంస్థలకు ఇవ్వాల్సిన ఆర్థిక సంఘం నిధులను కేంద్రం ఆపేస్తుంది. 2013కు ముందు మన రాష్ట్రంలో రెండన్నరేళ్ల స్థానిక ఎన్నికలు నిర్వహించలేదు. 2013లో ఎన్నికలు జరిగాక ఈ నిధులను రాష్ట్రానికి విడుదల చేశారు. ఈ నెలాఖరులోపు ఎన్నికలు నిర్వహించకుంటే రావాల్సిన నిధులు రావని సీఎంతో పాటు పలువురు నేతలు పేర్కొంటున్నారు. సాంకేతికంగా పరిశీలిస్తే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అయితే అనివార్య కారణాల వల్ల వాయిదా వేయాల్సి వచ్చింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అనివార్య కారణాల వల్ల ఎన్నికలు వాయిదా వేసే అధికారముంది. ఆప్రకారమే జాతీయ విపత్తు కరోనా వల్ల వాటిని వాయిదా వేసింది. దీంతో 14వ ఆర్థిక సంఘం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. ఎన్నికల తర్వాత ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఎన్నికల ప్రక్రియనే రద్దు చేయాలి!

- నామినేషన్లు వేయలేని వారికి అన్యాయమే
- మళ్లీ నోటిఫికేషన్‌తోనే న్యాయం: నిపుణులు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలను ఆరు వారాల పాటు వాయిదా వేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ) ఇప్పటికే అభ్యర్థులు వేసిన నామినేషన్లు చెల్లుబాటయ్యేలా ప్రకటించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, పత్రాలు చించివేయడం, ఫోన్ల ద్వారా బెదిరించడం, డబ్బు ఎరవేసి నామినేషన్ పత్రాలు తీసుకోవడం తదితర ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎన్నికలు వాయిదా వేసినంత మాత్రాన పెద్దగా ఉపయోగం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే పలు జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ వార్డులు ఏకగ్రీవం కావడంతో ఎన్నికల వాయిదా వల్ల బాధితులకు పూర్తి న్యాయం జరిగే అవకాశం లేదంటున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను నిలిపేస్తే బాధితులకు న్యాయం చేసినట్లు అవుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే జరగాల్సిన అన్యాయం జరిగిందని, ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని ఆమోదించడం, ఇప్పటికే పోటీ పడాల్సిన వారు పోటీలో లేకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరిగినట్లే భావిస్తున్నారు. ఎస్ఈసీ మొత్తం ఎన్నికల ప్రక్రియను రద్దు చేసి మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్లు, షెడ్యూల్‌ను కొత్తగా ప్రకటించాలని పలు పార్టీలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మొత్తంగా రద్దుచేయాలి!

- స్థానిక ఎన్నికలకు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలి
- కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహించాలి
- సీఆర్‌పీఎఫ్‌ను రప్పించాలి
- కరోనా గురించి ఈ సీఎంకేం తెలుసు?
- జగన్‌పై చంద్రబాబు ఆగ్రహం



అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అరాచకాలు, బెదిరింపులతో.. ఉన్మాద ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల వ్యవహారం సాగిందని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. ఈ మొత్తం ప్రక్రియను రద్దుచేసి ఎన్నికలకు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించడం శ్రేయస్కరం కాదని, కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరగాలని స్పష్టం చేశారు. ఆదివారమిక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో రాష్ట్ర పోలీసులు అన్‌ఫిట్ అని, వారు భయపడుతున్నారని.. సీఆర్‌పీఎఫ్ బలగాలను రప్పించాలని సూచించారు. ఈ అంశాలపై రాష్ట్రపతి, గవర్నర్‌ను కూడా కలిసి కోరతామని తెలిపారు. 'స్థానిక ఎన్నికల్లో 23 శాతం ఏకగ్రీవమయ్యాయి. ఇవన్నీ బెదిరింపులు, నామినేషన్లు ఉపసంహరించుకోవాలనే ఒత్తిళ్లు, అధికారుల అక్రమాలతో జరిగినవే.కడపలో ఏకంగా 70 శాతం స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసినందుకు ఈ ముఖ్యమంత్రి సిగ్గుపడాలి. అన్ని పార్టీలు ఈ ఎన్నికలు ప్రహసనం అంటున్నాయి. జాతీయ పార్టీ బీజేపీ, జనసేన, సీపీఎం, సీపీఐ అన్ని పార్టీలు మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని అడుగుతున్నాయి' అని గుర్తుచేశారు. ఈ ఎన్నికలు జరగకపోతే నిధులు రావని ముఖ్యమంత్రి అంటున్నారని.. అవసరమైతే అన్ని పార్టీలు కలిసొస్తామని.. ఆర్థిక సంఘాన్ని నిధులివ్వాలని అడుగుతామని చెప్పారు. ఇంకేమన్నారంటే...

### వీళ్లతో దేశానికి శాపం..

'ప్రజల ప్రాణాలు ఈ సీఎంకు పట్టవు. రాష్ట్రానికి ఈ ముఖ్యమంత్రి ఉండడం అరిష్టం. ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండడం దేశానికి శాపం. కరోనా వైరస్ గురించి ప్రపంచమంతా భయపడుతుంటే...ఎక్కడికక్కడ అన్నీ మూసేస్తుంటే.. ఈయన మాత్రం అవగాహన లేకుండా అజ్ఞానంతో మాట్లాడుతున్నారు. కరోనా వస్తే పారసిటిమల్ టాబ్లెట్ చాలు.. 60ఏళ్ల పైబడ్డ వారే చనిపోతున్నారు. బ్లీచింగ్ చల్లితే సరిపోతుందని జగన్ అన్నారు. ఎంత తేలిగ్గా, తెలివితక్కువగా మాట్లాడారు! ఒకపక్క ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ ఈ వైరస్‌ను పాండమిక్(మహమ్మారి)గా ప్రకటించారు. 147 దేశాలకు అది ప్రబలిపోయింది. పలువురు చనిపోయారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కరోనా కారణంగా ఆ దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ప్రధాని మోదీ ఈ వైరస్‌ను విపత్తుగా పేర్కొన్నారు. మన దేశంలో 12 రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ వచ్చింది. తెలంగాణలో సీఎం కేసీఆర్ ముందు రోజు అదేమీ లేదన్నారు. మళ్లీ తప్పు గ్రహించి స్కూళ్లు, కళాశాలలు అన్నీ మూసేశారు. పెళ్లిళ్లు కూడా వాయిదా వేసుకోవాలని చెప్పారు. మిగతా చాలా దేశాల జనసాంద్రత కన్నా మన జనసాంద్రత చాలా ఎక్కువ. మనదేశంలో ఇది ప్రబలితే చాలా కష్టం. కెనడా ప్రధాని భార్యకు కరోనా వైరస్ వచ్చింది. ఆమె వయసు చాలా తక్కువ. ఇరాన్‌లో ఒక మంత్రి సభలో మాట్లాడుతూ.. కరోనాతో భయం లేదు. అది రాదన్నారు. మర్నాడు ఆయనకే కరోనా పాజిటివ్ వచ్చింది. పరిస్థితి దారుణంగా ఉందని అన్ని దేశాలు గగ్గోలు పెడుతుంటే.. జగన్ మాత్రం దాని నియంత్రణకు చర్యలు తీసుకోకపోగా...తేలిగ్గా మాట్లాడుతున్నారు. అసలు ఆయనకు కరోనా గురించి ఏం తెలుసో నాకు తెలీదు. అహంకారం, పిచ్చితనంతో మాట్లాడుతున్నారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే హక్కు లేదు.'

### అంత తెలివైనవాడా..?

'కడపలో 50 జడ్పీటీసీలుంటే 38, నెల్లూరులో 46లో 12, కర్నూలులో 53లో 16, చిత్తూరులో 65లో 29 స్థానాలు ఏకగ్రీవం చేసేశారు. అంటే ఈ ముఖ్యమంత్రికి అంత ప్రజామోదం ఉందా? అంత తెలివైనవాడా? బెదిరించి నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు. ఉపసంహరించేలా భయపెట్టారు. అధికారులు కావాలని తిరస్కరించారు. ఎంపీటీసీ స్థానాల్లో ఏకంగా 22 శాతం స్థానాలు ఏకగ్రీవం చేసేసుకున్నారు. తెనాలిలో టీడీపీ నేత ఇంట్లో బయటి వ్యక్తులు అర్ధరాత్రి వచ్చి గోడ దూకి మద్యం సీసాలు పెట్టి వెళ్లిపోయారు. తర్వాత వాళ్లే ఫిర్యాదుచేస్తే పోలీసులు వచ్చేశారు. సీసీ టీవీ ఉండడంతో దొరికిపోయారు. గ్రామ వలంటీర్లను హోల్‌సేల్‌గా వాడుకుంటున్నారు. ముఖ్యమంత్రిగా ఉంటూ.. కనీసం ఆ స్థానానికైనా గౌరవం తెచ్చేలా వ్యవహరించాలి. ఈసీకి సెక్యూరిటీ మేమేం ఇవ్వాలని అంటున్నారు. అంటే రేపు సెక్యూరిటీ తీసేస్తారా? వాళ్ల చిన్నాన్నను చంపితే ఇప్పటికీ పట్టుకోలేదు. మొన్న మండలి రద్దు అన్నారు. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని అంటున్నారు. ఇక కోర్టు మిగిలింది. రాజ్యాంగం నుంచే నీకు అధికారం వచ్చింది. 151 సీట్లు వస్తే నీకు రాజ్యాంగం వర్తించదని చెప్పలేదు. రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలుచేసే వ్యక్తిపై ఆధారపడి ఉంటుంది. మంచివాడైతే మంచి. చెడ్డవాడైతే చెడు అని అంబేడ్కర్ చెప్పారు. ఈయన రుజువు చేస్తున్నారు. ఇంత అహంభావం, ఉన్మాదం అన్నీ కలిపి ఉన్న ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు. విమర్శించాలని విమర్శించడం కాదు. అతడిని చూశాక నిజమేంటో తెలుస్తోంది. ఇతడి అహంకారం రాష్ట్రానికి శాపంగా మారింది.'

### సత్తెనపల్లిలో ఫోర్జరీ!

చంద్రబాబు విలేకరుల సమావేశం నిర్వహిస్తుండగానే సత్తెనపల్లి నియోజకవర్గ నేత మల్లి, జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మేడా వెంకాయమ్మ వచ్చారు. చంద్రబాబు ఆమెతో మాట్లాడించారు. 'నేను ముప్పాళ్ల మండలం గోళ్లపాడు జడ్పీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశాను. కానీ అక్కడి ఎంపీడీవో నేను నామినేషన్ ఉపసంహరించుకున్నట్లుగా సంతకం చేశానంటూ ఆ స్థానాన్ని ఏకగ్రీవం చేశారు. నేను సంతకం చేయలేదు. నా సంతకం వాళ్లే పెట్టేశారు' అని ఆరోపించారు. 'ఇదీ జగన్‌మార్కు రాజకీయం, ఖాకీ ఉగ్రవాదం. ఇలాంటి పనులు చేస్తే ప్రజలు ముఖానే ఉమ్మేస్తారు. ముఖ్యమంత్రి పదవి, అధికారం శాశ్వతం అనుకోవద్దు. దౌర్జన్యాలు, దాడులతో ఏకపక్షంగా ఏకగ్రీవమని చెప్పుకొంటే ముందుగానే పదవి నుంచి దిగిపోవడం ఖాయం' అని హెచ్చరించారు.

### రమేశ్‌కుమార్‌ను నరసింహన్ సిఫారసు చేశారు

ఈ ఉన్మాద, అహంకారపు ముఖ్యమంత్రి అధికార కైపులో ఉండి...తాను అనుకున్నదే జరగాలన్నట్లుగా మాట్లాడుతున్నారని చంద్రబాబు దుయ్యబట్టారు. 'ఎన్నికల కమిషనర్‌కు కూడా కులం అంటగడుతున్నారు. మొన్న శాసనమండలిలో రాజధాని మార్పు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలంటే దాన్ని రద్దుచేశారు. ఇప్పుడు కమిషనర్‌ను తిడుతున్నారు. ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను నేను నియమించానని అంటున్నారు. నేను ఆయన్ను సిఫారసు చేయలేదు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి 2016లో కమిషనర్‌ను నియమించాల్సిన సమయంలో.. అప్పటికే రిటైరై ఉన్న ఐఏఎస్ అధికారి సీఆర్ బిశ్వాల్ (చిత్తరంజన్ బిశ్వాల్)ను ఆ పదవికి ఎంపిక చేయాలనుకున్నాను. సదరు ప్రతిపాదనను అప్పటి ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు పంపాను. అయితే నరసింహన్ ఆమోదించలేదు. బిశ్వాల్‌కు బదులు సీనియర్ ఐఏఎస్ రమేశ్‌కుమార్‌ను ఎస్ఈసీగా నియమించాలని, ఆయన మంచి అధికారి అని, ఏడేళ్లు తన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. ఇందుకు నేను సుముఖత వ్యక్తం చేయనప్పటికీ ఆయన గట్టిగా సిఫారసు చేశారు. కాదనలేక బిశ్వాల్ స్థానంలో రమేశ్‌కుమార్‌ను ఎస్ఈసీగా నియమించాను. నీకు ఇష్టం లేకపోతే అందరికీ కులాలు ఆపాదిస్తావు. పత్రికలకు కులాలు ఆపాదిస్తావు. ఆ పత్రికలు నువ్వు పుట్టక ముందు నుంచీ ఉన్నాయి. నువ్వు కులంతో గెలిచావా? ఎందుకు కులం? నా జీవితంలో ఎప్పుడూ కులం చూడలేదు. నీ బలహీనతల్ని కప్పిపుచ్చుకోవడానికి, ఎదురుదాడి చేయడానికి సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తున్నావు' అని విరుచుకుపడ్డారు.

## మధ్యప్రదేశ్‌లో నేడే బలపరీక్ష..!

- సీఎంకు గవర్నర్ లేఖ... సభ్యులకు కాంగ్రెస్, బీజేపీ విప్

భోపాల్, మార్చి 15: అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాలతో రసకందాయంలో పడ్డ మధ్యప్రదేశ్ రాజకీయం సోమవారం ఓ కొలిక్కి రానుందా? బడ్జెట్ సమావేశాలు ఆరంభమయ్యే రోజే ముఖ్యమంత్రి కమల్‌నాథ్ సర్కారు బలపరీక్షను ఎదుర్కోనుందా? స్పీకర్ నిర్ణయమేంటి? ఇప్పుడీ ప్రశ్నలు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. సభలో తన ప్రసంగం పూర్తవ్వగానే బలపరీక్షను నిర్వహించాలని గవర్నర్ లాల్జీ టాండన్ శనివారం అర్ధరాత్రి సీఎం కమల్‌నాథ్‌కు లేఖ పంపించారు. ఈ లేఖతో కాంగ్రెస్‌లో కలకలం రేగింది. జైపూర్‌లోని క్యాంపుల్లో ఉన్న తమ ఎమ్మెల్యేలను హుటాహుటిన భోపాల్‌కు రప్పించింది. వారిని ప్రత్యేక బస్సుల్లో ఓ హోటల్‌కు తరలించింది. తమ ఎమ్మెల్యేలంతా సోమవారం ఉదయమే శాసనసభలో అందుబాటులో ఉండాలంటూ విప్ జారీ చేసింది. అటు బీజేపీ కూడా తమ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేసింది. ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేలు, మద్దతుదారులు హరియాణాలోని ఓ రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన క్యాంపులో ఉన్నారు. వారు ఇంకా భోపాల్‌కు తిరిగి రావాల్సి ఉంది. బల పరీక్షకు గవర్నర్ ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పుడు అందరి దృష్టి స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతిపై పడింది. ఆయన నిర్ణయమేమిటనే ఉత్కంఠ నెలకొంది. ఆదివారం కొందరు విలేకరులు ఈ అంశంపై స్పీకర్‌ను ప్రశ్నించగా.. సభలో తెలియజేస్తానన్నారు.

## గుజరాత్‌లో ఐదుగురు ఎమ్మెల్యేల రాజీనామా

- రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ

గాంధీనగర్, మార్చి 15: రాజ్యసభ ఎన్నికల సందర్భంగా గుజరాత్‌లో కాంగ్రెస్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈ నెల 26న జరిగే రాజ్యసభ ఎన్నికలలో క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకునేందుకు గుజరాత్‌కు చెందిన తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ జైపూర్‌కు తరలించినా ఆదివారం ఐదుగురు రాజీనామా చేశారు. మొదట నలుగురు ఎమ్మెల్యేలు గుజరాత్ శాసనసభ స్పీకర్‌కు తమ రాజీనామాలు సమర్పించారు. ఆ తరువాత తాను కూడా రాజీనామా చేసినట్లు ఎమ్మెల్యే ప్రవీణ్ మారూ చెప్పారు. గుజరాత్ శాసనసభలోని మొత్తం 182 స్థానాలలో బీజేపీకి 103, కాంగ్రెస్‌కు 73 స్థానాలు ఉన్నాయి. ఇక్కడ నుంచి రాజ్యసభకు నలుగురు ఎంపిక కావలసి ఉంది. బీజేపీకి ఉన్న సంఖ్యాబలం ప్రకారం రెండు స్థానాలను మాత్రమే గెలుచుకోగలుగుతుంది. అయితే ఆ పార్టీ తరపున ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ తరపున ఇద్దరు నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ మూడో స్థానం గెలవాలంటే 111 ఓట్లు కావాలి. కాంగ్రెస్ నుంచి క్రాస్ ఓటింగ్ జరిగితేనే ఆ స్థానం గెలవగలదు. బీజేపీకి భారతీయ ట్రైబల్ పార్టీకి చెందిన ఇద్దరు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే మద్దతు ఉంది. అయినా బీజేపీకి ఇంకా ఐదు ఓట్లు కావాలి. కాంగ్రెస్ తరపున ఇద్దరు గెలవడానికి 74 ఓట్లు కావాలి. స్వతంత్ర ఎమ్మెల్యే జిగ్నేష్ మెవాని కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తానని శుక్రవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తారన్న భయంతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను గ్రూపులుగా చేసి తమ పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు తరలించాలన్న వ్యూహరచన చేసింది. అందులో భాగంగా మొదటి గ్రూప్ 14 మందిని శనివారం జైపూర్ పంపారు. వారిలో నలుగురు ఎమ్మెల్యేలు కనిపించకుండా వెళ్లిపోయారు. వారు నలుగురు, మరొకరు కలిసి మొత్తం ఐదుగురు ఆదివారం రాజీనామా చేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలోపడింది.

## త్వరలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా: అమిత్‌షా

న్యూఢిల్లీ, మార్చి 15: జమ్మూకశ్మీర్‌కు నిర్ణీత సమయం కంటే ముందే రాష్ట్ర హోదాను కల్పిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఉద్ఘాటించారు. ఆ రాష్ట్రానికి చెందిన అప్నీ పార్టీ నేతలు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు 40 సమస్యలను అమిత్ షా ముందు పెట్టారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. "జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇచ్చేప్పుడు.. నైసర్గిక స్వరూపంలో మార్పులు రాకుండా చర్యలు తీసుకుంటాం. ఆ రాష్ట్రంలో ల్యాండ్‌బ్యాంకును సృష్టిస్తాం. 70 ఏళ్లలో కశ్మీర్‌కు 13వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. కానీ.. మేము అంతకు మించి పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. తద్వారా నిరుద్యోగ సమస్య తగ్గిపోతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. గత ఏడాది ఆగస్టులో జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కలిగించే ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేశాక నిర్బంధంలో పెట్టిన రాజకీయ నాయకులను త్వరలో విడుదల చేస్తామన్నారు. "ఇంటర్నెట్‌ను పునరుద్ధరిస్తాం. కర్ఫ్యూలను ఎత్తివేస్తాం. రాజకీయ ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తాం" అని వెల్లడించారు.



ఖాళీగా కనిపిస్తున్న విజయవాడ దుర్గమ్మ ఆలయం పరిసరాలు



విజయవాడలో ఖాళీగా ఉన్న బస్టాండ్

# ఆలయాలు వెలవెల!

- తిరుమలకు తగ్గిన భక్తుల రద్దీ
- రేపటి నుంచి టైంస్లాట్ టోకెన్లు జారీ
- ఆరోగ్య జపయజ్ఞానికి టీటీడీ సిద్ధం
- శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు రద్దు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కరోనా వైరస్ ప్రభావం పుణ్య క్షేత్రాలపై పడింది. తిరుమల కొండ, శ్రీశైలం, శ్రీకాళహస్తి ఆలయాలు భక్తుల రద్దీ తగ్గి వెలవెలబోతున్నాయి. నిత్యం భక్తులతో కళకళలాడే తిరుమల క్షేత్రంలో కరోనా దెబ్బకు కొండ ఖాళీగా కనిపిస్తోంది. సాధారణంగా శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. కానీ కరోనా భయానికి చాలామంది తిరుమల యాత్రను వాయిదా వేసుకోవడంతో కొండపై జనం కనిపించడం లేదు. దీంతో ఆలయ పరిసరాలతో పాటు నాలుగు మాడ వీధులు, కాటేజీలు, వైకుంఠం క్యూకాంప్లెక్సులు, అన్నప్రసాద భవనం, అఖిలాండం వంటి ప్రాంతాల్లో భక్తుల సంఖ్య పలచగా కనిపిస్తోంది. మరోవైపు టీటీడీ కూడా కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ముందస్తుగా గదులు, దర్శనం ఆన్‌లైన్‌లో పొందిన భక్తులు రద్దు చేసుకున్న పక్షంలో నగదు ఇచ్చేస్తామంటూ టీటీడీ ప్రకటన చేయడంతో చాలా మంది తిరుమల ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటున్నారు. మంగళవారం నుంచి కంపార్టుమెంట్లలో భక్తులు గుంపుగా కూర్చోకుండా సర్వదర్శనాన్ని రద్దు చేసి టైంస్లాట్ దర్శనాన్ని మాత్రమే అమలు చేయనున్నారు. కరోనా నేపథ్యంలో ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ టీటీడీ ఈనెల 16 నుంచి 25 వరకు శ్రీనివాస వేద మంత్ర ఆరోగ్య జపయజ్ఞాన్ని నిర్వహించేందుకు సిద్ధమైంది. కాగా.. శ్రీశైల క్షేత్రంలో ఈనెల 22 నుంచి 26 వరకు జరిగే ఉగాది మహోత్సవాలపై కరోనా ప్రభావం పడింది. భక్తుల ఆరోగ్యం దృష్ట్యా ఏటా నిర్వహించే స్వామి అమ్మవార్ల గ్రామోత్సవాలు, ప్రభోత్సవం, రథోత్సవం, వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం రద్దు చేసినట్లు శ్రీశైలం దేవస్థాన కార్యనిర్వహణాధికారి కేఎస్ రామరావు తెలిపారు. అలాగే.. కరోనా ప్రభావం దృష్ట్యా ఆలయ సందర్శనకు విచ్చేసే వృద్ధులు, పిల్లలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో చంద్రశేఖరరెడ్డి ఆదివారం కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పుట్టపర్తిలోని భగవాన్ సత్యసాయిబాబా మహాసమాధిని తాకడాన్ని నిషేధించినట్టు ట్రస్టు వర్గాలు తెలిపాయి.

### ఆలయాల్లో రద్దీ లేకుండా దైవదర్శనం

కరోనా వైరస్ ముప్పు దృష్ట్యా రాష్ట్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన ఆలయాల వద్ద అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి వీ ఉషారాణి ఈవోలను ఆదేశించారు.



విజయవాడలో ప్రయాణికులు లేక వెలవెలబోతున్న రైల్వేస్టేషన్

## కరోనా.. అనుమానం

- రాష్ట్రంలో కొత్తగా మరో పది అనుమానిత కేసులు
- ఐసోలేషన్‌లోనే నెల్లూరు వాసి... కుటుంబ సభ్యులకు విముక్తి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో కరోనా అనుమానిత కేసులు ఎక్కువవుతున్నాయి. ఇంటింటి సర్వేలో భాగంగా విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు జ్వరం, దగ్గుతో బాధపడుతున్న వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా మరో పది అనుమానిత కేసులు నమోద య్యాయి. మరోవైపు కరోనా పాజిటివ్ వచ్చిన నెల్లూరు యువకుడు ఐసోలేషన్ వార్డులోనే ఉన్నాడు. అతని కుటుంబ సభ్యులను మాత్రం ఆదివారం డిశ్చార్జి చేశారు. అలాగే ఐసోలేషన్‌లో ఉన్న మరో మహిళకు కరోనా నెగటివ్ రిపోర్ట్ రావడం, ఆమెకు క్షయ ఉన్నట్లు తేలడంతో టీబీ వార్డుకు తరలించారు. ఇదిలా ఉండగా కరోనా వ్యాధి సోకిన యువకుడికి షేవింగ్ చేసిన వ్యక్తి కూడా జ్వరంతో బాధపడుతుండడంతో వైద్యాధికారులు శనివారం రాత్రి అతన్ని బలవంతంగా ఐసోలేషన్ వార్డుకు తరలించారు. కొడవలూరు ప్రాంతంలోని ఓ పరిశ్రమ నుంచి ఒక వ్యక్తిని కరోనా అనుమానంతో ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ఇద్దరి శాంపిల్స్‌ను తిరుపతి స్విమ్స్‌కు పంపించారు. కరోనా భయంతో విదేశాల నుంచి స్వగ్రామాలకు వచ్చేస్తున్న వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. వివిధ దేశాల నుంచి గుంటూరు జిల్లాకు వచ్చిన వారి సంఖ్య శనివారం వరకు 400 ఉండగా.. ఆదివారం ఒక్క రోజే ఈ సంఖ్య మరో 300 పెరిగింది. దీంతో జిల్లావ్యాప్తంగా 700 మందిని గృహ నిర్బంధంలో ఉంచారు. వారిని 14 రోజులపాటు బయటకు రావొద్దని ఆదేశిస్తున్నారు. మరో పక్క వియత్నాం నుంచి వచ్చిన ఇద్దరు జిల్లావాసుల్లో కరోనా వైరస్ అనుమానిత లక్షణాలున్నట్లు వైద్య సిబ్బంది గుర్తించడంతో వారిని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. కరోనా వైరస్ లక్షణాలతో గతవారం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో చేరిన ఇద్దరికి నెగటివ్ రిపోర్ట్ వచ్చిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. గల్ఫ్ నుంచి ఇటీవల స్వగ్రామానికి చేరిన ఇద్దరికి చిత్తూరు జిల్లా మదనపల్లె జిల్లా వైద్యశాలలో ఆదివారం రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం కరోనా అనుమానంతో ఆ ఇద్దరినీ తిరుపతి రుయా ఆస్పత్రికి సిఫారసు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జీజీహెచ్‌లో నలుగురు కరోనా అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ విభాగంలో కరోనా వైరస్ నిర్ధారణ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యశాఖాధికారి బి.సత్యసుశీల తెలిపారు. అయితే పరీక్షల నిర్వహణకు ఒక మిషన్, పలు కిట్లు అవసరం ఉన్నాయన్నారు.

# ఎస్ఈసీకి విశేషాధికారాలు

- కేంద్ర ఎన్నికల కమిషన్‌తో సమానంగా అధికారం
- అభిశంసన బిల్లుతోనే ఎస్ఈసీ తొలగింపు సాధ్యం

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ వాయిదా వేయడంపై అధికార పార్టీ కన్నెర్ర చేస్తోంది. తమకు ఒక్కమాట కూడా చెప్పకుండా ఎన్నికలు ఎలా వాయిదా వేస్తారంటూ ఎస్ఈసీ చర్యలను సీఎం జగన్ ఖండించారు. ఇద్దరు కలెక్టర్లు, ఎస్పీలను తప్పించాలని సూచించడాన్ని సైతం తప్పుబట్టిన ఆయన ఎస్ఈసీపై వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. దీనికి స్పందనగా రమేశ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు జడ్జికి ఉండే అధికారాలు ఎన్నికల కమిషర్‌కు ఉంటాయని, ప్రస్తుతం ఎన్నికలను నిలుపుదల మాత్రమే చేశామని, రద్దు చేయలేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అసలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఉండే అధికారాలేంటి?, దాని పరిధి ఎంత అనేదానిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను 1994 సెప్టెంబరులో రాజ్యాంగంలోని 243కే, 243 జెడ్(ఏ) అధికరణల కింద ఏర్పాటు చేశారు. దీనిప్రకారం ఎన్నికల జాబితాను రూపొందించేందుకు ఆదేశించడం, పంచాయతీరాజ్, మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ బాధ్యత. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఉన్నట్లుగానే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కూడా అధికారాలుంటాయి. అసెంబ్లీ, పార్లమెంట్ సభ్యుల ఎన్నికలు కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తే, స్థానికసంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుంది. ఎస్ఈసీని గవర్నర్ నియమించినా ఆయన్ను తొలగించాలంటే మాత్రం అభిశంసన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అసెంబ్లీలో మూడింట రెండొంతుల మెజారిటీతో తొలగిస్తూ బిల్లుపెట్టి దానిని గవర్నర్ ఆమోదంతో కేంద్రానికి పంపించాల్సి ఉంటుంది. కేంద్ర హోం, న్యాయశాఖలు దానిపై సమీక్షించి ఆమోదిస్తేనే ఎస్ఈసీ పదవీచ్యుతుడవుతారు. ఎస్ఈసీ అభిశంసించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినా... కేంద్రం అందుకు ఒప్పుకునే పరిస్థితి ఉండదంటున్నారు. కేంద్ర అధికారుల సూచనలతోనే నిర్ణయం తీసుకున్నందున రమేశ్‌కుమార్‌ను అభిశంసిస్తూ కేంద్రానికి బిల్లు పంపినా పట్టించుకోబోరని పేర్కొంటున్నారు.

# జగన్మోహన్‌రెడ్డీ.. సిగ్గుపడు!

- నువ్వు చేయాల్సిన పని ఈసీ చేసింది
- ఎన్నికల కమిషనర్‌కు కులం రంగా!
- క్విడ్ ప్రో కో చేస్తేనే నీకు మిత్రులా?
- సీఎం వ్యాఖ్యలపై మండిపడ్డ టీడీపీ నేతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎన్నికలు వాయిదా వేసిన ఈసీపై సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ నేతలు తీవ్రంగా ఆక్షేపించారు. కరోనాపై కనీసం దృష్టి పెట్టకుండా మొండిగా ముందుకెళ్తూ ప్రజల ఆరోగ్యంతో జగన్ చెలగాటమాడుతున్నారని టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమ విమర్శించారు. కరోనా ఉధృతి నేపథ్యంలో ప్రభుత్వమే ఎన్నికలను వాయిదా వేయాల్సిందని, కానీ ఆ పని ఎన్నికల కమిషనర్ చేసినందుకు ముఖ్యమంత్రి సిగ్గుపడాలని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా చట్టబద్ధంగా వ్యవహరించి, ఎన్నికలు వాయిదా వేసిన ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ జగన్‌కు శత్రువు అయితే, అదే సామాజిక వర్గానికి చెందిన నిమ్మగడ్డ ప్రసాద్ ఎలా మిత్రుడయ్యారో జగన్ చెప్పాలని మాజీ మంత్రి జవహర్ డిమాండ్ చేశారు. క్విడ్ ప్రోకోకి పాల్పడితే మిత్రులు, రాజ్యాంగ బద్ధంగా వ్యవహరిస్తే శత్రువులా? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్‌కు జగన్ కులం రంగు పులమడంపై టీడీపీ శాసనసభాపక్ష ఉప నేత అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్‌కు కులాన్ని ఆపాదించినందుకు కమ్మ సామాజికవర్గ మంత్రులు, ఎమ్మెల్యేలు వైసీపీకి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికలకు రీనోటిఫికేషన్ ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు, ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, సీనియర్ నాయకులు యడ్లపాటి వెంకట్రావు, యనమల, ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, దీపక్‌రెడ్డి, ఎమ్మెల్యే అనగాని, తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత ఈసీని కోరారు.

## కోర్టుకు ఈడుస్తాం

- చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులకు జైలే
- 'మాచర్ల'లో పిన్నెల్లిని ఏ1గా చేర్చాలి : బుద్దా



మంగళగిరి, మార్చి 15: జగన్ మాటలు విని చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులకు జైలు తప్పదని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న హెచ్చరించారు. ఆదివారం మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పోలీస్ వ్యవస్థను జగన్ తన చెప్పుచేతల్లో పెట్టుకుని వ్యవస్థను నాశనం చేశారు. టీడీపీ అభ్యర్థులు నామినేషన్ వేయకుండా, వేసిన వారు విత్‌డ్రా చేసుకునేలా పోలీసులే బెదిరించారు. మాచర్లలో మాపై దాడి జరిగితే ఏ పోలీస్ అధికారీ మా వద్దకు వచ్చి రక్షణ కల్పించే విషయం అడుగకపోవడంతో పాటు కనీసం జరిగిన ఘటనపై మాతో విచారణ కూడా జరపలేదు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రమేయంతోనే మాపై హత్యాయత్నం జరిగింది. కానీ ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. పిన్నెల్లిని వెంటనే అరెస్టు చేయాలి. ఏ1 నిందితునిగా చేర్చాలి. మాచర్ల ఘటనపై డీజీపీ సరిగా స్పందించలేదు. దీనికి సంబంధించిన అధికారులందరినీ కోర్టుకు ఈడుస్తాం' అని చెప్పారు. కాగా, శునకాన్ని (జగన్) సింహాసనంపై కూర్చోబెట్టారని స్వయంగా ఒప్పుకొన్న విజయసాయికి ధన్యవాదాలు అని ప్రకటించారు.






## మాకు హైకోర్టు జడ్జి అధికారాలు: ఎస్ఈసీ

కేంద్ర ప్రభుత్వం కరోనాను జాతీయ విపత్తుగా ప్రకటించిందని, దీనిపై కేంద్ర అధికారులతో చర్చించిన తర్వాతే స్థానిక ఎన్నికలు వాయిదా వేశామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ విపత్తు ఆదేశాలను కేంద్రం ఉపసంహరించిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం ఎన్నికలను నిలుపుదల మాత్రమే చేశామని, రద్దు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గుర్తు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషర్‌కు హైకోర్టు జడ్జికి ఉండే అధికారాలు ఉంటాయని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో హింసపై హైకోర్టులో వ్యాజ్యం నడుస్తోందని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారికి దురుద్దేశాలు ఆపాదించడం తీవ్ర విచారకరమన్నారు. ఇటువంటి చర్యలు వ్యవస్థలను బలహీనపరుస్తాయని రమేశ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# అధికారం నీదా.. నాదా?

**సీఎం నేనా.. రమేశ్‌కుమారా?.. ప్రజలు ఓట్లేసి 151 సీట్లిచ్చారు నాకే అధికారం లేదంటే ఈ ఎన్నికలు ఎందుకు?**

- గవర్నర్‌కు కంప్లయింట్ చేశాం
- ఎస్ఈసీ మారతారని ఆశిస్తున్నాం
- లేదంటే పైవారికి ఫిర్యాదు చేస్తా
- ఎన్నికల కమిషనర్‌పై జగన్ ఆగ్రహం
- రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ


గవర్నర్ విశ్వభూషణ్‌తో భేటీ అయిన సీఎం జగన్

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేస్తే 151 స్థానాల్లో ఎమ్మెల్యేలు విజయం సాధించారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తేనే నేను సీఎం స్థానంలో కూర్చుకున్నాను. సీఎంగా నాదా అధికారం.. నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌దా' అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుది, రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ)ది ఒకే సామాజిక వర్గమని.. చంద్రబాబే ఆయన్ను నియమించుకున్నారని ఆరోపించారు. ప్రజలు అధికారమిచ్చిన జగన్‌కు ఎలాంటి అధికారమూ లేదంటే.. ఇంకా ఈ ఎన్నికల ప్రక్రియ ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలను ఆరు వారాలపాటు వాయిదా వేయడంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఆయన.. ఆదివారం విజయవాడలోని రాజ్‌భవన్‌కు వెళ్లి.. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అప్రతిహతంగా దూసుకుపోతోందని.. ఇది చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్‌కు మింగుడుపడలేదని.. అందుకే కరోనా పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశారని ఆరోపించారు. వైరస్ నిరోధానికి అవసరమైన చర్యలన్నీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. ఈ సాకుతో ఎన్నికలు వాయిదా వేస్తూనే.. మరోవైపు కలెక్టర్, ఎస్పీ, సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వు ఇచ్చారని తప్పుబట్టారు. 'విచక్షణాధికారం అని ఎన్నికల కమిషనర్ అంటున్నారు. ఈ మధ్య ప్రతివాడూ విచక్షణాధికారం అంటున్నారు. ప్రజల చేత ఎన్నికైన సీఎం కంటే రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఎక్కువ అధికారాలు ఉంటాయా? రాష్ట్రాన్ని కూడా ఆయనే పరిపాలించొచ్చుగా' అని మండిపడ్డారు. కరోనా వైరస్ సాకుతో.. ఎన్నికలు వాయిదా వేయడం సరికాదని.. వారం రోజుల్లో కొంపలేమీ మునిగిపోవని చెప్పారు. ఎన్నికల కమిషనర్‌కు ఉండాల్సిన ప్రాథమిక లక్షణం ఒక్కటి కూడా రమేశ్‌కుమార్‌కు లేదన్నారు. నిష్పాక్షికంగా ఉండాల్సిన కమిషనర్ విచక్షణ కోల్పోయారన్నారు.

### 5,000 కోట్లు రాష్ట్రానికి రావు..

ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వకపోతే.. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.5000 కోట్లు రాష్ట్రానికి రాకుండా పోతాయని జగన్ అన్నారు. వచ్చేఏడాది కూడా ఎన్నికలు జరక్కపోతే అప్పుడూ నిధులు రావన్నారు. ఎన్నికలు వాయిదా వేశాక.. పేదవారికి ఇంటి స్థలాలు పంపిణీ చేయవద్దని ఎలా ఆదేశిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గవర్నర్‌కు కంప్లయింట్ చేశామని.. పిలిచి మాట్లాడాలని కోరామని.. ఆయన మారతారని ఆశిస్తున్నామని చెప్పారు. లేదంటే పైవారికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

### వాయిదా విషయం కార్యదర్శికీ తెలియదు

విచక్షణాధికారం పేరిట ఇష్టారీతిన వ్యవహరించే అధికారం కమిషనర్‌కు ఎవరిచ్చారని జగన్ ప్రశ్నించారు. ఎన్నికల వాయిదాపడిన విషయం ఎన్నికల కమిషన్ కార్యదర్శికి కూడా తెలియదన్నారు. 'అంటే.. ఈ ఆదేశాలను ఎవరో రాశారు. నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ చదివారు' అని ఆరోపించారు. కరోనా వైరస్ నిరోధక కార్యకలాపాలు ఇప్పట్లో ఆగవని తెలిపారు. కొన్నాళ్లు పోతే విదేశాల్లో ఉన్న మనవారిని ఆరోగ్య సమస్యల కారణంగా ఆయా దేశాలు వెనక్కి పంపించడం మొదలవుతుందని చెప్పారు. అదే జరిగితే వచ్చేవారికి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయాల్సి ఉంటుందని.. ఇది రెండు మూడు వారాల్లో పూర్తయ్యే ప్రక్రియ కాదని.. కనీసం ఏడాది పట్టవచ్చని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియ మరో పది రోజుల్లో అయిపోయేదానికి వాయిదా వేశారని ఆక్షేపించారు. వాయిదా వేసే ముందు ఎవరినైనా కమిషనర్ ఎవరినైనా సంప్రదించారా అని ప్రశ్నించారు. ఆరోగ్య శాఖ సీనియర్ అధికారులను సంప్రదించామని.. పోలింగ్ రోజు అధిక సంఖ్యలో జనం గుమికూడితే ఇబ్బందని చెప్పడంతో ఎన్నికల వాయిదా నిర్ణయం తీసుకున్నామని కమిషనర్ అన్నారని.. రాష్ట్రంలో హెల్త్ సెక్రటరీ కంటే సీనియర్ అధికారి ఎవరుంటారని జగన్ నిలదీశారు. కనీసం ఆయన్ను సంప్రదించకుండా.. చీఫ్ సెక్రటరీతో మాట్లాడకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో 2000కి పైగా ఎంపీటీసీలను వైసీపీ స్వీప్ చేయడం సహించలేక, జీర్ణించుకోలేక రమేశ్‌కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎన్నికలు వాయిదా వేశాక.. అధికారులను బదిలీ చేసే అధికారం ఆయనకు ఎక్కడిదని నిలదీశారు. ఇలాగైతే ఇక సీఎం ఎందుకు.. ఎన్నికల కమిషనరే సీఎంగా ఉండొచ్చుగా అని వ్యాఖ్యానించారు.

### చెదురుమదురు ఘటనలు తక్కువే!

రాష్ట్రంలో 10,243 చోట్ల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతుంటే 43 చోట్లే చెదురుమదురు ఘటనలు జరిగాయని సీఎం అన్నారు. 2,794 వార్డుల్లో 15,185 నామినేషన్లు దాఖలైతే వాటిలో 14 చోట్లే చెదురుమదురు ఘటనలు జరిగాయని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఇంతకుముందెప్పుడైనా ఇంతకంటే తక్కువగా జరిగాయా అని సీఎం ప్రశ్నించారు. పోలీసులు నిబద్ధతతో పనిచేస్తున్నారని ప్రశంసించారు.

### ఎన్నికల సంఘాన్ని నియంత్రించండి

**గవర్నర్‌కు జగన్ వినతి**

స్థానిక ఎన్నికల్లో వైసీపీ స్వీప్ చేస్తున్న తరుణంలో కరోనా వైరస్ సాకుతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఈ ప్రక్రియను వాయిదా వేయడంపై సీఎం జగన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆదివారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కరోనా వైరస్‌పై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో.. ఎన్నికల ప్రక్రియను వాయిదా వేసినట్టు సీఎంవో అధికారులు ఆయనకు చేరవేశారు. దీంతో కరోనా వైరస్‌పై వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చిన నివేదికను వెంటబెట్టుకుని ఆయన హుటాహుటిన రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌తో గంటసేపు సమావేశమయ్యారు. రాష్ట్రంపై కరోనా వైరస్ ప్రభావం లేదన్నారు. దాని సాకుతో ఎన్నికలు వాయిదావేశారని ఫిర్యాదు చేశారు. ఈ ఆదేశాలను పునఃసమీక్షించి.. ఎన్నికల ప్రక్రియను ఈ నెలాఖరులోగా యథాతథంగా పూర్తి చేసేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు.

### 10 నెలల తర్వాత మీడియా ముందుకు జగన్

- చెప్పదలచుకుంది చెప్పారు
- ప్రశ్నలడిగేందుకు నో చాన్స్
- 'ఆంధ్రజ్యోతి'కి నో ఎంట్రీ
- 'అనుకూల' మిత్రులతోనే ముచ్చట్లు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు వాయిదావేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంతో బిత్తరపోయిన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. అధికార పగ్గాలు చేపట్టిన పది నెలల తర్వాత తెలుగునేలపై తొలిసారిగా మీడియా ముందుకొచ్చారు. ఈ నిర్ణయాన్ని విమర్శిస్తూ తాను చెప్పదలచుకుంది చెప్పేశారు. మీడియా ప్రతినిధులు ప్రశ్నలు వేసే అవకాశం ఏ మాత్రం ఇవ్వకుండా చకచకా వెళ్లిపోయారు. ఈసీ నిర్ణయానికి దారితీసిన పరిస్థితులపై ఈ సందర్భంగా ఎక్కడ ప్రశ్నలు వేస్తారోనని.. 'ఆంధ్రజ్యోతి' పత్రికను.. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చానల్‌ను, మరికొన్ని మీడియా సంస్థలను ముందుగానే దూరంగా ఉంచారు. సీఎం ప్రెస్‌మీట్ సమాచారం అందగానే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అక్కడకు చేరుకున్నాయి. కానీ చిత్రంగా ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద తమకు అనుకూల మిత్రులను మాత్రమే సీఎంవో లోపలకు అనుమతించింది. సీఎం విలేకరుల సమావేశానికి ఇలా ఎంపిక చేసుకున్న సంస్థలను మాత్రమే అనుమతించడం రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారి. గతంలో సీఎంగా చంద్రబాబు బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో జగన్ మీడియా ప్రతినిధులు అధికారిక కార్యక్రమాల్లో, మీడియా సమావేశాల్లో పాల్గొనేవారు. టీడీపీ మీడియా సమావేశాలకు మాత్రం జగన్ మీడియాను దూరంగా ఉంచేవారు. దానిపైనా వైసీపీ నానా యాగీ చేసేది. ప్రెస్‌కౌన్సిల్‌కూ ఫిర్యాదు చేసింది. కాగా.. ఆదివారం క్యాంపు కార్యాలయం వద్ద తాము బయట వేచి చూస్తున్న సమాచారాన్ని పౌరసంబంధాల శాఖ ఉన్నతాధికారులకు ఆంధ్రజ్యోతి అందజేసింది కూడా. అయినా ప్రయోజనం లేకపోయింది.

**కొసమెరుపు:** సహజంగా సీఎం మీడియా సమావేశాన్ని నిర్వహించాక.. విలేకరుల ప్రశ్నలకు జవాబులివ్వడం రివాజు. అడగదలచుకున్నది అడగాలని సూచిస్తారు. కానీ ఆదివారం నాటి భేటీని కొద్ది మంది మీడియా ప్రతినిధులకు మాత్రమే పరిమితం చేసిన సీఎం జగన్.. తాను చెప్పదలచుకున్నదంతా చెప్పేసి ఒక్క ప్రశ్నకూ చాన్సివ్వకుండా వెళ్లిపోయారు.

## ఈసీ గురించి తెలియని సీఎం.. ఏపీ దురదృష్టం

- మొత్తం ప్రక్రియ రద్దు చేయాలి: కన్నా



అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ అధికారాల గురించి తెలియని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ఆంధ్రప్రదేశ్ చేసుకున్న దురదృష్టమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఈసీ వాయిదా వేయడం పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేయడాన్ని కన్నా తీవ్రంగా ఆక్షేపించారు. ప్రజాస్వామ్యంలో పరిస్థితులు చేయిదాటినప్పుడు ఈసీ తన విస్తృత అధికారాలు ఉపయోగిస్తుందని గుర్తుచేశారు. ఈసీని తప్పుబడుతోన్న జగన్‌కు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు అమలు చేయకూడదనే విషయం తెలియదా.? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఆరు వారాలపాటు వాయిదా వేయడం పట్ల ఎన్నికల కమిషన్‌కు ట్విటర్ ద్వారా ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో జరుగుతోన్న దారుణాల గురించి బీజేపీ ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించడంపట్ల హర్షం వ్యక్తం చేశారు.

**జీవీఎల్ హర్షం:** ఎన్నికల వాయిదాపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. ఈసీ నిర్ణయంతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ లేబర్ బోర్డు ఛైర్మన్ జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యానించారు.

## సీఎంకూ పరిమితులుంటాయి: ఐవైఆర్



అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): '151 సీట్లు వచ్చినా, 175 సీట్లు వచ్చినా రాజ్యాంగబద్ధంగా నడిచే ప్రభుత్వ విధానంలో ముఖ్యమంత్రి అధికారాలకు పరిమితులుంటాయి అనే మౌలిక సత్యాన్ని సీఎం జగన్ గ్రహిస్తే మంచిది' అని మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలపై విపరీత ఆరోపణలు చేసే ముందు కొంత ఆలోచించడం ఎందుకైనా మంచిదని ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. ఎన్నికలను వాయిదా వేసిన తర్వాత అధికారులను బదిలీ చేసే అధికారం ఈసీకి ఉందా అనే ఒక్క విషయం మినహాయిస్తే, మిగిలిన అన్ని విషయాల్లోనూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, పూర్తయ్యే వరకూ ఈసీకి అధికారం ఉంటుందని వివరించారు.

## వాయిదా కాదు... రద్దు చేయండి: సాకే



విజయవాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కరోనా ప్రభావం కారణంగా స్థానిక సంస్థల ఎన్నికలను ఆరు వారాలపాటు ఈసీ వాయిదా వేయడం కాదు.. మొత్తం షెడ్యూల్‌ను రద్దు చేయాలని పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, కార్పొరేటర్, కౌన్సిలర్ల నామినేషన్ ప్రక్రియ హింసాత్మకంగా సాగిందని ఆరోపించారు. ఈ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో రక్షణ బలగాల మధ్య నిర్వహించాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. .

## రాజకీయ కరోనాతోనే వాయిదా: సీపీఐ



అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించడం శుభసూచికమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. మొత్తం ప్రక్రియను మళ్లీ చేపట్టాలని ఈసీని కోరారు. ఇది రాజకీయ కాలుష్యంతో కూడుకున్న వైరస్ కాబట్టి ఎన్నికలను ఆపాల్సి వచ్చిందన్నారు. కాగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా జరిగిన దౌర్జన్యకాండకు సీఎం జగనే బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు.

## సీఎం వ్యాఖ్యలు సరికావు: సీపీఎం



ఎన్నికల కమిషన్ నిర్ణయంపై సీఎం జగన్ వ్యాఖ్యలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఒక ప్రకటనలో ఖండించారు. నెల్లూరులో పార్టీ కార్యాలయంలో మీడియాతోనూ ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఆలస్యంగానైనా ఈసీ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

## కరోనా కన్నా... రమేశ్ ప్రమాదకారి

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు
- చంద్రబాబు కోసమే ఎన్నికలు వాయిదా: వైసీపీ నేతల విమర్శలు

మద్దిలపాలెం(విశాఖ సిటీ), మార్చి 15: కరోనా వైరస్‌కన్నా రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) రమేశ్‌కుమార్ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం ఆయన విశాఖపట్నంలో మాట్లాడుతూ 'రాజ్యాంగ వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని రమేశ్‌కుమార్ ఖూనీ చేశారు. ఆయన నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ కాదు... నారా రమేశ్‌కుమార్. కనకపు సింహాసనంపై ఒక శునకాన్ని కూర్చోబెడితే ఏం చేస్తుందో... ఈరోజు ఎస్ఈసీ అదేపని చేస్తున్నారు. ఇటలీ నుంచి వచ్చిన వ్యక్తికి కరోనా సోకిందంటూ ఎన్నికలు వాయిదా వేయడం హేయమైన చర్య. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య కార్యదర్శి, ప్రభుత్వంతో సంప్రదించకుండా, పరిస్థితిని సమీక్షించకుండా ఎన్నికల వాయిదా వంటి పెద్ద నిర్ణయాన్ని ఏకపక్షంగా ఏ విధంగా తీసుకుంటారు? చంద్రబాబు ఇచ్చిన అజెండా ప్రకారం రమేశ్‌కుమార్ పనిచేస్తున్నారు. నైతిక విలువలుంటే వెంటనే పదవికి రాజీనామా చేయాలి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ... చంద్రబాబుకు అమ్ముడుపోయారు' అని ఆరోపించారు. మంత్రి కన్నబాబు మాట్లాడుతూ ఎన్నికల వాయిదా ద్వారా వైసీపీ విజయాన్ని కొన్ని రోజులు మాత్రమే ఆపగలరని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా 90శాతం స్థానాల్లో తమ పార్టీదే విజయమన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను అడ్డుకోవడానికే చంద్రబాబు ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని మంత్రి ముత్తంశెట్టి ఆరోపించారు. కాగా, ఈ మీడియా సమావేశంలో వైసీపీ నేతల నోట 'నిమ్మగడ్డ ప్రసాద్' పేరు రావడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అని పలకడానికి బదులుగా నిమ్మగడ్డ ప్రసాద్ అని పలికారు. తర్వాత తప్పుని గుర్తించిన విజయసాయిరెడ్డి సరిచేసుకున్నారు. మరో గంట తర్వాత మంత్రి బొత్స కూడా అదే పేరు పలకడం పార్టీ నేతలను, విలేకరులను ఆశ్చర్యపరిచింది. బొత్స తన తప్పుని సవరించుకోకుండానే సమావేశం కొనసాగించడం విశేషం.

### బాబుకు గురుదక్షిణగానే వాయిదా: బొత్స

విశాఖపట్నం/మచిలీపట్నం, మార్చి 15(ఆంధ్రజోతి):"రాష్ట్ర ఎన్నికల కమిషన్ భగవంతుడు కాదు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగితే నిలదీయవచ్చు, చర్యలు తీసుకోవచ్చు. కానీ, ఎన్నికలు వాయిదావేసే అధికారం ఆయన(ఎస్ఈసీ)కు ఎవరిచ్చారు?" అని మంత్రి బొత్ససత్యనారాయణ, ఆగ్రహం వ్యక్తంచేశారు. "ఆయనను(రమేశ్‌కుమార్) పదవిలో నియమించిన చంద్రబాబుకి, ఎన్నికల వాయిదాను గురుదక్షిణగా ఇచ్చారు" అని ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో ఇది 'బ్లాక్ డే' అన్నారు. "చంద్రబాబు చెవిలో చెప్పాడని, చంద్రబాబు, అతని బృందం ఇచ్చిన నోట్‌ను చదివేసి, ఎన్నికలు వాయిదా వేస్తున్నట్టు సంతకం పెట్టడం దారుణం" అని విమర్శించారు. రమేశ్‌కుమార్ నిర్ణయంపై తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. కాగా, "రాష్ట్రానికి కరోనా వైరస్ సోకలేదు. కానీ, ఎలక్షన్ కమిషన్(ఎస్ఈసీ)కు, చంద్రబాబు వైరస్ సోకింది" అని మంత్రి పేర్ని నాని మచిలీపట్నంలో అన్నారు. కరోనాను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిలిపివేయడం దుర్మార్గమన్నారు.

# కరోనాకు పారాసిటమల్ చాలు

- 60 ఏళ్లుపైబడినవారిపైనే ప్రభావం
- సీఎం జగన్ వ్యాఖ్యలు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్‌పై 'ప్యానిక్' (భయాందోళనలు) బటన్ నొక్కాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. దానికి పారాసిటమల్ మాత్ర వేసుకున్నా సరిపోతుందని.. ఇంట్లో ఉంటూనే వైద్యం చేయించుకోవచ్చని చెప్పారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 60 ఏళ్ల వయసు పైబడినవారికి, డయాబెటిక్, బీపీ, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులు ఉన్నవారికి కరోనా వస్తే కొంత ప్రభావం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రపంచం మొత్తమ్మీద కేసుల్లో 81.9 శాతం ఇంట్లో ఉండి చికిత్స పొందుతున్నారని.. 13 శాతానికి ఆస్పత్రుల్లో చికిత్సలు జరుగుతున్నాయని చెప్పారు. కేవలం 4.7 శాతానికే ఐసీయూలో చికిత్స జరుగుతోందన్నారు. ఎవరికీ ఇబ్బందులు ఉండకూడదనే ప్రభుత్వ తాపత్రయమన్నారు. విదేశాల్లో పనిచేసుకునే రాష్ట్రానికి చెందిన వారిని వెనక్కు పంపుతున్నారన్నారు. వారికి ఎయిర్‌పోర్టుల్లో స్క్రీనింగ్ నిర్వహించి.. 14 రోజులపాటు పర్యవేక్షణలో ఉంచుతామని.. అవసరమైన వారందరికీ ప్రభుత్వం వైద్యం చేయిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో 70 శాంపిళ్లను పంపితే ఒకే కేసులో పాజిటివ్ వచ్చిందన్నారు. గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికీ తిరిగి కరోనాపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

# పారాసిటమల్‌తోనే పోతుందా!

- సీఎం వ్యాఖ్యలతో వైద్యుల విస్మయం
- రాష్ట్రంలోనూ మినీ హెల్త్ ఎమర్జెన్సీ
- 1897నాటి బ్రిటిష్ చట్టం అమల్లోకి

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన కరోనా వైరస్‌ను పారాసిటమల్‌తో నివారిస్తామంటూ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు వైద్యవర్గాల్ని విస్మయానికి గురిచేశాయి. కరోనా దెబ్బకు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 149 దేశాలు గడగడలాడుతున్నాయి. వేలాది మందిని పొట్టన పెట్టుకున్న ఈ వైరస్ నానాటికీ తన ప్రభావాన్ని మరింత విస్తరిస్తోంది. ఆదివారం నాటికి దేశవ్యాప్తంగా 107 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అత్యంత ప్రమాకరమైన పరిస్థితిల్లో ఉన్నామంటూ రాష్ట్రాలను కేంద్రం ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో సీఎం స్థాయి వ్యక్తి ఇది చాలా చిన్న సమస్యగా పరిగణించడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. కరోనా తీవ్రతతో పదికి పైగా రాష్ట్రాల్లో పాఠశాలలు, కాలేజీలు, సినిమా థియేటర్లు, షాపింగ్ మాళ్లు మూతపడ్డాయి. బహిరంగ సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. పొరుగున ఉన్న తెలంగాణ కూడా వైరస్ ప్రభావం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోనూ ఆరోగ్యశాఖ అధికారులు నెల రోజుల నుంచి ఇతర పనులన్నీ పక్కనపెట్టి, కేవలం కరోనాపైనే దృష్టి సారించారు. వలంటీర్లను కూడా రంగంలోకి దించిన ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించింది. ఫిబ్రవరి 10 తర్వాత విదేశాల నుంచి రాష్ట్రానికి 6,500మంది వరకూ వచ్చారని గుర్తించి, వారం దరినీ క్వారంటైన్‌లో ఉంచారు. వైరస్ నివారణకు ఆరోగ్యశాఖ ఇంత శ్రమిస్తోంటే... సీఎం మాత్రం చాలా తేలికగా తీసిపారేశారు. కరోనా వైరస్ అంత సీరియస్ కాకపోతే ప్రభుత్వం మినీ హెల్త్ ఎమర్జెన్సీ ఎందుకు ప్రకటించిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. 1897లో బ్రిటిష్ ప్రభుత్వం అమలు చేసిన అంటువ్యాధుల నివారణ చట్టానికి మరికొన్ని నిబంధనలు జతచేసి రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. పాజిటివ్ కేసు వచ్చిన నెల్లూరులో పాఠశాలలు, సినిమా థియేటర్లు మూసివేశారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ పరిస్థితిని అదుపుచేసే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, కరోనా తీవ్రత నేపథ్యంలో ఈ సంవత్సరం ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణాన్ని లక్షలాది మంది భక్తుల మధ్య నిర్వహించబోమని టీటీడీ ప్రకటించింది. ఏప్రిల్ 7న ఆలయం లోపల నిర్వహించి ప్రత్యక్షప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతానికి కొన్ని రాష్ట్రాలకే పరిమితమైన కరోనా ప్రభావం ఒకేసారి బయటపడుతుందేమోనని కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతోంది. రాష్ట్రాలతో నిత్యం వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తోంది. సీఎం చెప్పినట్లు కరోనా ప్రభావం లేకపోతే ఇంత హడావిడి చేయాల్సిన అవసరం ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## స్థానిక ఎన్నికలు ఆరు వారాలు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

దాఖలయ్యాయి. ఈనెల 21న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, 23న మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికల తొలివిడత నోటిఫికేషన్ ఈ రోజునే విడుదల చేయాల్సి ఉన్నా.. దేశంలో కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, విజ్ఞుల సూచనలు వచ్చాయి.. వస్తూనే ఉన్నాయి. కరోనా గురించి ఇప్పటికే ఒక స్పష్టత వచ్చింది. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలతో సంప్రదించినప్పుడు కరోనా ప్రస్తావన వచ్చింది. పరిస్థితులకు అనుగుణంగా ఆ తర్వాత పునఃసమీక్షించుకుంటామని అప్పుడు చెప్పాం' అని గుర్తుచేశారు. వేగంగా మారిన పరిస్థితులకు అనుగుణంగా సమీక్షించుకోవాల్సి వచ్చిందన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోను, కర్ణాటకలోనూ స్కూళ్లు, సినిమా హాళ్లు, వాణిజ్య సముదాయాలను నియంత్రించారని.. కేంద్ర ప్రభుత్వం ఇది వరకే రాష్ట్ర ప్రభుత్వాలకు కరోనా వైరస్‌పై హెచ్చరిక చేసిందని తెలిపారు. 'ఇప్పుడు కేంద్రం కరోనా వైరస్‌ను జాతీయ విపత్తుగా ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ వినియోగిస్తున్నందున కరోనా వ్యాప్తి చెందేందుకు అవకాశముంటుంది. ఎన్నికలు జరపడం ముఖ్యమైనా, ప్రజాభద్రతను పణంగా పెట్టకూడదనే వాదనతో ఎన్నికల సంఘం ఏకీభవిస్తోంది. ఎన్నికల ఏర్పాట్లు పూర్తిగానో, పాక్షికంగానో పూర్తయ్యాయి. అనేక వ్యయ ప్రయాసలను అధిగమించి ఏర్పాట్లు చేపట్టాం. సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు చేశాం' అని చెప్పారు. కిషన్‌సింగ్ తోమర్ వర్సెస్ అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు మేరకు అనివార్య కారణాలతో ఎన్నికలను వాయిదా వేయవచ్చన్న విషయాన్ని ఉటంకించారు. విపత్తులు, తుఫాన్లు, భూకంపాలు, గొడవలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలు సంభవించినప్పుడు ఎన్నికలు వాయిదా వేయవచ్చని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 కే, 243 జెడ్(ఏ) ప్రకారం పంచాయతీరాజ్ చట్టం ద్వారా సంక్రమించిన విస్తృత, విచక్షణ అధికారాల మేరకు ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల పాటు నిలిపేస్తున్నామని స్పష్టం చేశారు.

### ఎన్నికల ప్రక్రియ రద్దు కాదు..

ఇప్పటివరకు జరిగిన ఎన్నికల ప్రక్రియ రద్దుకాదని, ఇది వాయిదా మాత్రమేనని రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైనవారు.. మిగతావారు ఎన్నికైన తర్వాత వారితోపాటు బాధ్యతలు చేపడతారని వివరణ ఇచ్చారు. ఆరు వారాల అనంతరం సమీక్ష తర్వాత ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ, మున్సిపాలిటీలకు ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్లను అవసరమైన మేరకు సవరణలు చేస్తామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలకు 6వారాల తర్వాత సరికొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తామన్నారు. ఎన్నికలు వాయిదా పడిన తర్వాత కూడా రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలో ఓటర్లను పలోభపెట్టే వ్యక్తిగత పథకాలకు నిషేధం వరిస్తుందని తేల్చిచెప్పారు. అయితే ప్రభుత్వ దైనందిన కార్యక్రమాలకు ఈ నిషేధం వర్తించదన్నారు. కావలసిన చోట రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత కూడా ఇస్తుందని చెప్పారు.

# వైసీపీ దౌర్జన్యాలను ఊరుకోం

- రోడ్లమీదకొచ్చి తిరగబడతాం
- ఎన్నికల ప్రక్రియను మళ్లీ చేపట్టాలి
- అన్ని ఆధారాలతో కేంద్రానికి ఫిర్యాదు
- జనసేన అధినేత పవన్ కల్యాణ్



రాజమహేంద్రవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): "స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం హింస, దౌర్జన్యాలకు పాల్పడుతోంది. ఆర్థిక ఉగ్రవాదంతోను, భౌతిక దాడులతోను, రౌడీయిజంతోను భయపెట్టాలంటే ఊరుకోం. ఖచ్చితంగా రోడ్ల మీదకు వచ్చి తిరగబడతాం" అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హెచ్చరించారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలన వస్తే హింస, దౌర్జన్యాలు ఎక్కువవుతాయని గత ఎన్నికల ముందే చెప్పానన్నారు. ఇవాళ మారుమూల ప్రాంతాల్లో కూడా దౌర్జన్యం, హింస, పాలెగాళ్ల రాజ్యం వచ్చేసిందన్నారు. తాను ఏం చెప్పానో అదే ఈరోజు నిజమైందన్నారు. "స్థానిక ఎన్నికల ప్రక్రియను ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించాల్సిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ దౌర్జన్యాలు జరుగుతుంటే చేతులు కట్టుకుని చోద్యం చూస్తోంది. ఎవరైనా నామినేషన్లను అడ్డుకుంటే వాటిని రద్దు చేసి మళ్లీ నామినేషన్లు స్వీకరించాలి. కానీ, ఎన్నికల కమిషన్ ప్రభుత్వంతో కుమ్మక్కైంది. చిత్తూరులో మా పార్టీ నేతలు నామినేషన్ వేస్తుంటే భయపెట్టారు. ఎన్నికల అధికారుల పద్ధతి బాగోలేదు. రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. అధికార యంత్రాంగం ప్రభుత్వంతో కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది" అని పవన్ ధ్వజమెత్తారు. "కరోనా భయంతో ఎన్నికలను వాయిదా వేశారు సరే. ఇంతవరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియను రద్దుచేసి మళ్లీ స్వీకరించాలి. ఎన్నికల ప్రక్రియను మొదటి నుంచీ చేపట్టాలి" అని డిమాండ్ చేశారు. పోలీసులు కూడా వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు.

### అన్నీ సేకరిస్తున్నాం

"అనేక ప్రాంతాల్లో నామినేషన్ల ఉపసంహరణ గడువును రాత్రి 10గంటల వరకు పెంచి వైసీపీకి అనుకూలంగా మార్చుకున్నారు. జనసేన లీగల్ విభాగం అన్ని విషయాలనూ క్రోడీకరిస్తోంది. ఈసీ విధి విధానాలు, నామినేషన్ సమయంలో వారి వ్యవహారం, చాలామంది ఇళ్లకు పోలీసులు, రౌడీలు వెళ్లి విత్‌డ్రాలు చేయించడం వంటి ఘటనలు జరిగాయి. అందుకే నామినేషన్ల గడువు పొడిగించాలి. జడ్పీటీసీ, ఎంపీటీసీ, మునిసిపాలిటీ నామినేషన్లు మళ్లీ స్వీకరించాలి" అని పవన్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగని విధానంపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. దీనిపై కేంద్ర హోం శాఖ కార్యదర్శికి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాస్తున్నట్టు చెప్పారు. "బీజేపీ-జనసేన బలమైన పార్టీగా వస్తుంది. ఎవరినీ వదలం. ఎన్నికల్లో హింస, దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి ఆడియో, వీడియోలన్నీ సేకరించాం. నేనే స్వయంగా కేంద్ర ప్రభుత్వానికి ఇస్తాను' అని పవన్ చెప్పారు.




## ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- పదేళ్ల తర్వాత తొలి టైటిల్ నెగ్గిన శరత్
- ఒమన్ టీటీలో విజేతగా నిలిచిన కమల్

**మస్కట్:** భారత వెటరన్ టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ అదరగొట్టాడు. ఎన్నాళ్లుగానో ఊరిస్తున్న అంతర్జాతీయ టైటిల్‌ను ఎట్టకేలకు ఒడిసి పట్టుకున్నాడు. ఐటీటీఎఫ్ చాలెంజర్ ప్లస్ ఒమన్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలిచి పదేళ్ల నిరీక్షణకు తెరదించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో నాలుగోసీడ్ శరత్ 6-11, 11-8, 12-10, 11-9, 3-11, 17-15తో పోర్చుగల్‌కు చెందిన టాప్‌సీడ్ మార్కస్ ఫ్రెటిస్‌ను చిత్తుచేసి ట్రోఫీ అందుకున్నాడు. 37 ఏళ్ల శరత్ చివరిసారిగా 2010లో ఈజిప్టు ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. ఆ తర్వాత 2011లో మొరాకో, 2017లో ఇండియా ఓపెన్‌లో సెమీస్ దాకా రాగలిగాడు.



## 'లా లిగా' ప్లేయర్ గారేకు కరోనా

**మాడ్రిడ్:** ప్రఖ్యాత ఫుట్‌బాల్ లీగ్ 'లా లిగా'కు కరోనా సెగ తగిలింది. ఆ లీగ్‌లో ఆడుతున్న అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ ఎజెక్విల్ గారే (33)కు కరోనా సోకింది. ఈ విషయాన్ని అతడే స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. 'ఈ ఏడాది దుర్ముహూర్తంలో ప్రారంభమైంది. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న నాకు వైద్య పరీక్షలు నిర్వహించగా కరోనా పాజిటివ్ అని తేలింది. ప్రస్తుతానికి నేను బాగానే ఉన్నా. ఐసోలేషన్ వార్డులో చికిత్స తీసుకుంటున్నా' అని గారే తెలిపాడు. స్పెయిన్‌లో ఇప్పటివరకు 6,391 కరోనా కేసులు నమోదవగా.. అందులో 196 మంది ప్రాణాలు కోల్పోయారు.

## ఇంటివాడవుతున్న ఉనాద్కట్

**కె**ప్టెన్‌గా సౌరాష్ట్రకు రంజీట్రోఫీ అందించిన ఆనందాన్ని నిశ్చితార్థంతో రెండింతలు చేసుకున్నాడు జయదేవ్ ఉనాద్కట్. రినీతో అతడి ఎంగేజ్‌మెంట్ ఆదివారం జరిగింది. ఈ మేరకు ఫొటోలను ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. టీమిండియా బ్యాట్స్‌మన్ పుజార ఈ వేడుకకు హాజరయ్యాడు. 'ఆరు గంటలు, రెండు భోజనాలు, ఓ కేక్' అని ఆ చిత్రాలకు ఉనాద్కట్ క్యాప్షన్ ఇచ్చాడు.



మహిళల డబుల్స్‌లో భారత్‌కు ఎన్నో మధుర విజయాలను అందించిన ఆ షట్లర్ ఆటకు గ్లామర్ జోడించి దేశ వ్యాప్తంగా బ్యాడ్మింటన్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. రెండేళ్లుగా షటిల్ కోర్టుకు దూరమైన ఆమె ప్రస్తుతం సొంత అకాడమీ నిర్వహణలో తీరిక లేకుండా శ్రమిస్తోంది. సోషల్ మీడియాలో హుషారుగా ఉంటూ సామాజిక అంశాలపై తనదైన శైలిలో స్పందించే ఆ మాజీ స్టార్ షట్లర్ గుత్తా జ్వాలతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ.

ఆంధ్రజ్యోతితో జ్వాల

# ఇల్లు అమ్మి అకాడమీ పెట్టా

## బ్యాడ్మింటన్ కోసం జీవితాన్నే అంకితం చేశా

### తమిళ నటుడితో డేటింగ్ నిజమే



**కొత్తగా అకాడమీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.. ఎలా అనిపిస్తోంది?**

కెరీర్ ప్రారంభంలో సరైన మార్గదర్శనం, సదుపాయాల లేమితో అనేక ఇబ్బందులు పడ్డా. యువ క్రీడాకారులకు అలాంటి సమస్యలు ఎదురు కాకూడదన్న ఉద్దేశంతో అకాడమీ ఏర్పాటు చేశా. అధునాతన సదుపాయాలను ఉపయోగించుకుంటూ ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇస్తే ఒక సింధు, ఒక జ్వాల కాదు అలాంటి వారిని వందల సంఖ్యలో తయారు చేయవచ్చు. దేశానికి పెద్ద సంఖ్యలో పతకాలు తీసుకురావచ్చు.

**అకాడమీకి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందింది?**

అకాడమీ ఏర్పాటుకు సాయం చేయాల్సిందిగా ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశా..కానీ అటు నుంచి స్పందన రాలేదు. ఈ విషయంలో ప్రభుత్వానిది తప్పు కాదు. వారితో నా ఆలోచనలను సరిగ్గా పంచుకోలేకపోయానేమో. అందుకే వారు ముందుకు రాలేకపోయారనుకుంటున్నా. అయితే, ప్రభుత్వం మీద ఆధారపడి అకాడమీ స్థాపనను ఆలస్యం చేయడం సరికాదని నాన్న చెప్పడంతో ఇల్లు అమ్మి పని ప్రారంభించా.

**ప్రభుత్వం చేయూత ఇవ్వకుండా ఎవరైనా అడ్డుపడ్డారా?**

ఆ విషయం నాకు తెలియదు. ఒకవేళ అలాంటి ప్రయత్నాలు జరిగినా వాటి గురించి పట్టించుకోను. ప్రభుత్వం నుంచి ఎప్పటికైనా సహకారం లభిస్తుందన్న సానుకూల దృక్పథంతో వేచి చూస్తున్నా. నాకు అందుబాటులో ఉన్న వనరులతో వంద మందికి శిక్షణ ఇస్తున్నా. భవిష్యత్‌లో ప్రభుత్వం సాయం చేస్తే 500 మందికి శిక్షణ ఇవ్వగలను. దీనివల్ల అంతిమంగా పతకాలు సాధించే క్రీడాకారుల సంఖ్య పెరుగుతుంది.

**ఒలింపిక్ పతకం సాధించలేకపోవడానికి కారణాలేంటి?**

సింధు, సైనా సింగిల్స్‌లో ఒలింపిక్ పతకాలు సాధించారు. డబుల్స్‌లో అయితే, ఇప్పటివరకు ఎవరూ ఒలింపిక్ మెడల్ నెగ్గలేదు. డబుల్స్‌లో దేశం తరపున నేను గెలిచిన టైటిళ్లను మరే షట్లర్ సాధించలేదు. సింగిల్స్‌లో సింధు, సైనాకు గోపీచంద్ ఉన్నాడు. గోపీచంద్‌కు ప్రకాష్ పదుకోన్ ఉన్నాడు కాబట్టి వారు రాణించగలిగారు. డబుల్స్‌లో నాకు అలా గైడ్ చేయడానికి అప్పుడు ఎవరూ లేరు. కష్టపడి పైకొచ్చా. యువ డబుల్స్ క్రీడాకారులకు ఒక బాట వేశా. వారికి మార్గదర్శనం చేయడానికి ఇప్పుడు నేనున్నా.

**కెరీర్‌లో బాధపెట్టిన సంఘటనలేవి?**

బ్యాడ్మింటన్ కోసం జీవితాన్నే అంకితం చేశా. అలాంటి నన్ను వరల్డ్ నెంబర్-6గా ఉన్న సమయంలో పక్కనపెట్టారు. ఆ సంఘటన తీవ్రంగా కలచివేసింది. దీని గురించి సంబంధిత వ్యక్తిని ప్రశ్నించగానే ఆయనకు నేను టార్గెట్‌గా మారిపోయా. భారత డబుల్స్‌లో నంబర్ వన్ ప్లేయరైనప్పుడు నన్ను గౌరవించాల్సిన బాధ్యత అతడిపై ఉంది. కానీ అతడలా చేయలేదు. కారణం నేను ఆ అకాడమీకి చెందిన క్రీడాకారిణిని కాకపోవడమే.

**రాజకీయ అంశాలపై ఇటీవల సామాజిక మాధ్యమాల్లో బాగా స్పందిస్తున్నారు. పాలిటిక్స్‌లోకి వచ్చే అవకాశముందా?**

జాతీయ పార్టీల నుంచి పిలుపు వచ్చింది కానీ, సున్నితంగా తిరస్కరించా. నా భావసారూప్యతకు ఇప్పుడున్న పార్టీలతో పొసగదు. నా వ్యవహారశైలి ఎవరికీ నచ్చదు. ప్రస్తుతమైతే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి లేదు.

**తమిళ నటుడు విష్ణు విశాల్‌తో మీ బంధం గురించి..?**

మేం డేటింగ్‌లో ఉన్నాం. వివాహం ఎప్పుడు చేసుకోవాలనేది ఇంకా నిర్ణయించుకోలేదు కానీ, త్వరలోనే ఒక్కటవుతాం. అప్పుడు అందర్నీ ఆహ్వానిస్తాం.

## ఐఓఏ టోక్యో పర్యటన వాయిదా

**న్యూఢిల్లీ:** కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారుల టోక్యో పర్యటన వాయిదా పడింది. కొవిడ్-19 ప్రభావంతో ప్రస్తుతానికి వెళ్లకపోవడమే మంచిదని నిర్ణయించారు. పరిస్థితులను బట్టి తిరిగి ఎప్పుడు పర్యటించేది తర్వాత ప్రకటిస్తారు. రిజిజుతో పాటు ఐఓఏ అధ్యక్షుడు నరీందర్ బాత్రా, ప్రధాన కార్యదర్శి రాజీవ్ మెహతా, భారత బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడు అజయ్ సింగ్, క్రీడా శాఖ కార్యదర్శి రాధే శ్యామ్, సాయ్ డైరెక్టర్ జనరల్ సందీప్ ప్రధాన్‌లతో కూడిన అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం ఈనెల 25 నుంచి 29 వరకు టోక్యోలో పర్యటించాల్సి ఉంది. 70 మందికి పైగా భారత అథ్లెట్లు ఇప్పటికే ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. గేమ్స్‌కు ముందు కనీసం 125 మంది అయినా బెర్త్ దక్కించుకుంటారని ఐఓఏ ఆశిస్తోంది. మరోవైపు కొవిడ్-19 ఉధృతి జపాన్‌లో కూడా ఎక్కువగానే ఉండడంతో జూలైలో ఆరంభమయ్యే ఒలింపిక్స్ నిర్వహణపై కూడా సందేహాలు నెలకొంటున్నాయి.

## సఫారీ క్రికెటర్లు ఇంకా భారత్‌లోనే..

**కోల్‌కతా:** భారత జట్టుతో మూడు వన్డేల సిరీస్ కోసం వచ్చిన దక్షిణాఫ్రికా క్రికెటర్లు ఇప్పుడు క్షేమంగా స్వదేశానికి వెళ్లాలనుకుంటున్నారు. కరోనా కారణంగా సిరీస్ రద్దు కావడంతో ప్లేయర్స్ లఖ్‌నవ్ నుంచి ముంబై లేక ఢిల్లీకి రావడానికి కూడా భయపడుతున్నారు. అందుకే ప్రస్తుతానికి ఎలాంటి వైరస్ కేసులు నమోదు కాని కోల్‌కతాను ఎంచుకున్నారు. అక్కడి నుంచి దుబాయ్ మీదుగా దక్షిణాఫ్రికాకు వెళ్లాలనేది వారి ఆలోచన. 'ప్రొటీస్ ఆటగాళ్లు సోమవారం కోల్‌కతాకు చేరుకుని మరుసటి రోజు దుబాయ్ మీదుగా దక్షిణాఫ్రికా వెళతారు. వీరిని క్షేమంగా పంపేందుకు బీసీసీఐ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే బెంగాల్ సీఎం, ప్రధాన కార్యదర్శికి కూడా ఈ విషయాన్ని తెలిపాం' అని క్యాబ్ అధ్యక్షుడు అవిషేక్ దాల్మియా తెలిపారు.



## దండలు మార్చుకున్న మాక్స్‌వెల్, వినీ

**ఆ**స్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ తన ప్రేయసి, భారత సంతతికి చెందిన వినీ రామన్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. పూర్తిగా భారతీయ సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుక జరగడం విశేషం. వేదమంత్రోచ్చారణల మధ్య ఇరువురూ దండలు మార్చుకున్న ఫొటోలను వినీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

## చెన్నైని వీడిన ధోనీ



**చెన్నై:** ఐపీఎల్ తాజా సీజన్ వచ్చే నెల 15 వరకు వాయిదా పడడంతో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ స్వస్థలం రాంచీకి బయలుదేరాడు. ఈ సందర్భంగా అతడికి సీఎస్‌కే యాజమాన్యం, అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. జాతీయ జట్టుకు చాన్నాళ్ల నుంచి దూరంగా ఉంటున్న ధోనీ ఈసారి ఐపీఎల్‌లో సత్తా చూపాలనుకున్నాడు. అందుకే చాలా ముందుగానే సన్నాహకాలను ఆరంభించాడు. కానీ కొవిడ్-19 వైరస్ కారణంగా లీగ్‌ను వాయిదా వేయడంతో జట్టు ప్రాక్టీస్ సెషన్‌ను కూడా ఆపేశారు. 'విజిల్ వేస్తూనే ఉండండి. 'తలా' ధోనీకి చిన్న విరామం' అంటూ సీఎస్‌కే ట్వీట్‌తో పాటు ఓ వీడియోను పోస్ట్ చేసింది. దీనిలో ధోనీ అభిమానులకు ఆటోగ్రాఫ్‌లిస్తూ వారితో మాట్లాడుతూ కనిపించాడు.

## బోర్డు నిర్ణయాన్ని గౌరవిస్తా

### కామెంటరీ నుంచి ఉద్వాసనపై మంజ్రేకర్

**న్యూఢిల్లీ:** కామెంటరీ ప్యానెల్ నుంచి తనను తొలగించిన బీసీసీఐ నిర్ణయాన్ని గౌరవిస్తానని మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ తెలిపాడు. 'కామెంటేటర్‌గా నా ఎంపిక నాకు దక్కిన గౌరవంగానే భావించా, కానీ అదో హక్కుగా అనుకోలేదు. నన్ను కొనసాగించాలా.. లేదా అనేది నా యజమానికి సంబంధించిన విషయం. వారు తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తా. నా పనితీరు బీసీసీఐకి నచ్చలేదేమో.. ఓ ప్రొఫెషనల్‌గా దీన్ని అంగీకరిస్తున్నా' అని మంజ్రేకర్ ట్వీట్ చేశాడు.

## ఆల్ ఇంగ్లండ్ విజేతలు విక్టర్, తై జు

**బర్మింగ్‌హామ్:** ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో విక్టర్ అక్సెల్‌సన్, తై జు యింగ్ విజేతలుగా నిలిచారు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో రెండోసీడ్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) 21-13, 21-14తో టాప్‌సీడ్ చో తిన్ చెన్ (చైనీస్ తైపీ)పై, మహిళల్లో రెండోసీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) 21-19, 21-15తో టాప్‌సీడ్ చెన్ యుఫీ (చైనా)పై గెలిచారు.

## నాకు చెప్పకుండా రద్దు చేస్తారా?

### దాదాపై దీదీ గరంగరం



**కోల్‌కతా:** కొవిడ్-19 వైరస్ ఉధృతి నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో జరగాల్సిన కోల్‌కతా వన్డేను రద్దు చేయడంపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి వన్డే వర్షార్పణం కాగా.. లఖ్‌నవ్, కోల్‌కతా మ్యాచ్‌లు రద్దయ్యాయి. అయితే తనకే మాత్రం సమాచారం ఇవ్వకుండా ఈ నిర్ణయం తీసుకోవడంతో బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీని దీదీ తప్పుబట్టారు. 'సౌరవ్‌తో ఎలాంటి విభేదాలు లేవు. కానీ కోల్‌కతా మ్యాచ్ రద్దు విషయం మాతో ఓ మాట చెప్పాల్సింది. కనీసం ప్రధాన కార్యదర్శి, హోం శాఖ కార్యదర్శి, పోలీస్ కమిషనర్‌లలో ఎవరికైనా సమాచారం ఇవ్వాలి కదా' అని మమతా అసహనం వ్యక్తం చేశారు. షెడ్యూల్ ప్రకారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్‌లో చివరిదైన మూడో వన్డే ఈనెల 18న జరగాల్సి ఉండేది.

## గేల్ హిందీ తిప్పలు!



**ముంబై:** మైదానంలో బౌలర్లపై ఊచకోతకు దిగే డాషింగ్ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ ఆఫ్‌సైడ్‌లో మాత్రం చాలా జాలీగా ఉంటాడు. తన విచిత్ర వేషధారణతో ప్రత్యేకంగా కనిపిస్తాడు. ఇక గేల్‌తో హిందీ పలికించేందుకు యువరాజ్ చేసిన ప్రయత్నం కూడా నవ్వులు పూయించింది. ఈ సరదా వీడియోను యువీ ట్వీట్ చేశాడు. దీంట్లో 'కాన్ఫిడెన్స్ మేరా.. ఖబర్ బనేగి తేరి!' అనే డైలాగ్‌ను గేల్‌తో పలికించేందుకు ట్రై చేశారు. అయితే కాన్ఫిడెన్స్ మేరా.. అనే పదాన్ని బాలీవుడ్ సినిమా స్థాయిలో జోష్‌గా చెప్పినా మిగతా సగం మాత్రం ఇష్టమొచ్చినట్టుగా పలకడంతో యువీ సహా అక్కడున్న వారంతా నవ్వు ఆపుకోలేకపోయారు. ఐపీఎల్‌లో గేల్ పంజాబ్ ఆటగాడిగా కొనసాగుతున్నాడు.




Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.

epaper.andhrajyothy.com